'కొల్లేరు' మళ్లీ కల్లోలం

- చేపల చెరువుల ధ్వంసంతో గగ్గోలు
- 3వ కాంటూరుకు కుదింపుపై అసెంబ్లీలో తీర్మానించినా అమలుకు నోచని వైనం
- జిరాయితీ, సొసైటీ భూములను వెనక్కి ఇవ్వాలని కోరుతున్న జనం

3

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 248 | విజయవాడ, శుక్రవారం 11 ఏప్రిల్ 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Friday 11 April 2025 | Rs



కదంతొక్కిన కెఎల్ రాహుల్

- బెంగళూరుపై ఆరు వికెట్ల తేడాతో ఢిల్లీ గెలుపు

8

పంటల బీమా దిగదుడుపు

మునుపెన్నడూ లేని విధంగా విస్తీర్ణం, లబ్ధిదారుల తగ్గుదల • రైతు నెత్తిన ప్రీమియం భారం
ఇన్సూరెన్స్ బాధ్యత వారిపైనే • లక్షలాది అన్నదాతలు దూరం • కూటమి ప్రభుత్వ కొత్త విధానం ఫలితం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

రబీలో పంటల బీమా బాగా తగ్గిపోయింది. బీమా చేయించుకునే నిర్ణయాన్ని రైతుల ఇష్టాఇష్టాలకు (ఐచ్ఛికం) వదిలేయడం, అప్పటి వరకు అమల్లో ఉన్న ఉచిత పంటల బీమాను ఎత్తేసి తమ వంతు ప్రీమియాన్ని రైతులే చెల్లించాలనడంతో ఈ రబీలో బీమా చేయించుకున్న రైతుల సంఖ్య, విస్తీర్ణం మునుపెన్నడూ లేని విధంగా దిగజారింది. రాష్ట్ర వ్యాప్తంగా 60 లక్షల ఎకరాల్లో వ్యవసాయ, ఉద్యానవన, కూరగాయ పంటలు సాగు చేయగా పది లక్షల లోపు ఎకరాలకే ఇన్సూరెన్స్ అయింది. సాగైన విస్తీర్ణంలో కేవలం ఆరు శాతానికే బీమా గ్యారంటీ దక్కింది. ఫసల్ బీమా, వాతావరణ ఆధారిత బీమా రెండూ కలుపుకొని సుమారు లక్షల మంది రైతులు ప్రీమియం చెల్లించి 9.92 లక్షల ఎకరాలకు బీమా చేయించుకున్నారు. ఇంత తక్కువ స్థాయిలో రైతులు బీమా చేయించుకోవడం ఇప్పుడే.

సమగ్రం అన్నారు...

టిడిపి కూటమి తాము అధికారంలోకొస్తే రైతులకు సమగ్ర పంటల బీమా పథకాన్ని తీసుకొస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చింది. కౌలు రైతులకు గుర్తింపుకార్డులిచ్చి బీమా వర్తింపజేస్తామనీ చెప్పింది. పాలనలోకొచ్చాక సమగ్ర పంటల బీమా పథకం కోసం మంత్రుల కమిటీని ఏర్పాటు చేసింది. సదరు కమిటీ సిఫారసుల్లో రైతులు తమ వంతు ప్రీమియం చెల్లించాలంది. గత వైసిపి ప్రభుత్వంలో ఇ-క్రాప్‌లో నమోదైన రైతులందరికీ బీమాను వర్తింపజేయగా, కొత్త విధానంలో బీమా బాధ్యత రైతులపైనే పెట్టింది. తమ ఇష్టాఇష్టాలకనుగుణంగా బీమా చేయించుకోనూ వచ్చు, వద్దనుకుంటే మానేయనూ వచ్చు. గతంతో బ్యాంకులో పంట రుణం తీసుకున్న ప్రతి రైతు నుంచి బీమా ప్రీమియాన్ని మినహాయించుకునేవారు. లోన్ తీసుకున్న రైతులందరికీ బీమా తప్పనిసరి అయ్యేది. కేంద్రం ఆ నిబంధన ఎత్తేసి ఐచ్ఛికం చేసింది. బీమా కావాలనుకుంటే రైతులు బ్యాంకుల వద్దకు స్వచ్ఛందంగా వెళ్లి బీమా చేయించుకోవాలంది. బ్యాంకు లోన్ తీసుకోని రైతులు సైతం బీమా చేయించుకోవచ్చంది. ఆ నిబంధనలనే కూటమి సర్కారు అమలు చేస్తోంది. బీమా రైతుల ఇష్టాఇష్టాలకు వదిలేయడం, వైసిపి ప్రభుత్వంలో ఐదేళ్లపాటు ఉచిత పంటల బీమా పేరిట రైతుల తరపున ప్రభుత్వమే ప్రీమియం చెల్లించగా,



ఇప్పుడు రైతులు తమ జేబుల్లోనుంచి ప్రీమియం కట్టాలనడంతో ఆర్థిక ఇబ్బందులరీత్యా రైతులు పెద్దగా బీమా జోలికి పోలేదు. వాతావరణ బీమా మరీ తక్కువ.

కొత్త విధానం

2024-25 రబీ నుంచి కూటమి ప్రభుత్వం కొత్త విధానం అమల్లో పెట్టింది. వ్యవసాయ పంటలు సాగు చేసే రైతులు 1.5 శాతం, హార్టికల్చర్ రైతులు 5 శాతం వంతున ప్రీమియం చెల్లించాలి. ప్రభుత్వ గణాంకాల ప్రకారం ఫసల్ బీమా కోసం లోనీ, నాన్-లోనీ కలుపుకొని 2.91 లక్షల మంది రైతులు బీమా చేయించుకున్నారు. తమ వంతు రూ.31.41 కోట్ల ప్రీమియం చెల్లించగా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ వాటాగా చెరో 81 కోట్ల ప్రీమియం జమ చేశాయి. వాతావరణ బీమాను సుమారు 15 వేల మంది రైతులు 33 వేల ఎకరాలకు ఇన్సూరెన్స్ చేయించారు. రైతులు తమ వంతు రూ.6.30 కోట్ల ప్రీమియం చెల్లించగా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ వాటాగా చెరో 7 కోట్లు కంపెనీలకు జమ చేశాయి. కొత్త విధానం రాకముందు 2022 రబీలో సుమారు 15 లక్షల మంది రైతుల 38 లక్షల ఎకరాలు బీమా పరిధిలోకొచ్చాయి. 2023 రబీలో 13 లక్షల మంది రైతుల 32 లక్షల ఎకరాలు బీమా పరిధిలోకొచ్చాయి. ఈ రబీలో తీవ్ర కరువు నెలకొంది. లక్షల ఎకరాల్లో పంటలు సాగు కాలేదు. సాగైన పంటలూ డ్రైస్పెల్స్ వలన దెబ్బతిన్నాయి. దిగుబడి తగ్గిపోయింది. ప్రభుత్వమే 51 మండలాల్లో కరువు ప్రకటించింది. వాస్తవానికి అంతకు కొన్ని రెట్ల మండలాల్లో కరువు విలయతాండవం చేస్తోంది. బీమా పరిధిలోకి రైతులొస్తే అరకొర పరిహారమైనా దక్కేది. ప్రభుత్వం ప్రీమియం భారాన్ని రైతుల నెత్తినేయడంతో లక్షలాది రైతులు బీమాకు దూరమయ్యారు.

రబీ పంటల బీమా

వివరం	ఫసల్ బీమా	వాతావరణ బీమా
జిల్లాలు	25	18
ఇన్సూరెన్స్ యూనిట్లు	4,408	351
గ్రాస్ ప్రీమియం	193 కోట్లు	20 కోట్లు
రైతులు	2.91 లక్షలు	15 వేలు
ఏరియా	9.60 లక్షల ఎకరాలు	34 వే ఎకరాలు

నత్తనడకన ధాన్యం కొనుగోళ్లు

- అక్కరకు రాని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు
- నష్టపోతున్న అన్నదాతలు

2లో..

మున్సిపల్ కార్మికుల పోరుబాట

- 15 నుంచి ధర్నాలు

2లో..

ఒంటిమిట్టలో నేడు సీతారాముల కల్యాణం

- పట్టువస్త్రాలు సమర్పించనున్న సిఎం

2లో..

గిరిజన ప్రాంతాలను కార్పొరేట్లకు కట్టబెట్టే కుట్ర

- అల్లూరి జిల్లాను రూథర్‌ఫర్డ్ జిల్లాగా మార్చేస్తారేమో!
- 13న సమైక్యతా శంఖారావం సభకు మద్దతు
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు
- భారత ఆత్మగౌరవాన్ని మోడీ అమెరికాకు తాకట్టు పెట్టారని వ్యాఖ్య



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గిరిజన ప్రాంతాలను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రలు చేస్తున్నాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు హెచ్చరించారు. అల్లూరి సీతారామరాజు జిల్లాను రూథర్‌ఫర్డ్ జిల్లాగా మార్చే ప్రయత్నం చేస్తున్నాయని చెప్పారు. విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రంపచోడవరంలో ఐటిడిఎ బుధవారం వర్క్‌షాపు నిర్వహించిందని, ఈ కార్యక్రమానికి జర్నలిస్టులను, మీడియాను కూడా రానివ్వకుండా అడ్డుకుందన్నారు. టిడిపి ఎమ్మెల్యేలు, నాయకులతో మాట్లాడించి ఒక నోట్ తయారు చేసి విడుదల చేసినట్లు చెప్పారు. అభివృద్ధి, టూరిజం మాటున ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న ఖనిజ సంపదను దోచుకోవడమే దీని వెనుకనున్న మర్మమన్నారు. ఈ ప్రక్రియ గత రెండు మూడు నెలల నుంచి కొనసాగుతుందన్నారు. గతంలో శాసన సభ స్పీకర్ అయన్నపాత్రుడు 1/70 చట్టానికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేయడం, గత శాసన సభ సమావేశాల్లో టిడిపి ఎమ్మెల్యేతో గిరిజన ప్రాంతంలో గిరిజనేతరులకు ఇళ్ల స్థలాలు కేటాయించాని కోరుతూ ప్రకటన చేయించడం, తాజాగా గిరిజన ప్రాంతాల్లో పర్యటించిన ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ టూరిజం ప్రోత్సహించాలని చేసిన వాఖ్యలు ఇందులో భాగమేనన్నారు. గత ఎన్నికల్లో గిరిజన చట్టాలను పూర్తి స్థాయిలో అమలు చేస్తామని హామీ ఇచ్చిన టిడిపి కూటమి, ఇప్పుడు అందుకు భిన్నంగా వ్యవహరిస్తుందన్నారు. షెడ్యూల్ ప్రాంతాల్లో భూములు కేటాయించాలంటే పెసా చట్టం ప్రకారం గ్రామ సభ అనుమతి అవసరమని తెలిపారు. గిరిజన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులతో గిరిజన సలహా మండలిని వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. టిఎసి అనుమతి లేకుండా గిరిజన ప్రాంతంలో భూములను కేటాయించేందుకు అవకాశం లేదన్నారు. ఈ నిబంధనలను పాటించకుండా ఏకపక్షంగా ప్రభుత్వం భూములు కేటాయింపు విషయంలో ముందుడుగు వేస్తోందన్నారు. అభివృద్ధి పేరుతో గిరిజనుల హక్కులను హరిస్తే ప్రజలు చూస్తూ ఊరుకోరని, ప్రతిఘటిస్తారని హెచ్చరించారు. గిరిజనుల ఉనికిని దెబ్బతీస్తూ, ఏజెన్సీ ఏరియాపై కార్పొరేట్ ఆధిపత్యం తీసుకురావడానికి జరుగుతున్న ప్రయత్నాలను తిరస్కరించి, ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే పోలవరం ప్రాజెక్టు కారణంగా రంపచోడవరంలో 7 మండలాలు పూర్తిగా ముంపునకు గురవుతున్నాయని, వీరికి ఎటువంటి మిగతా 7లో

నర్సింగ్ కోర్సులకు కామన్ ఎంట్రెన్స్

- వైద్య శాఖ మంత్రి సత్యకుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో నర్సింగ్ కోర్సుల్లో చేరేందుకు ప్రత్యేకంగా ఉమ్మడి ప్రవేశ పరీక్ష (సెట్) నిర్వహించనున్నారు. ఈ మేరకు సంబంధిత అధికారులకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాలు జారీ చేశారు. ఈ పరీక్షను ఏటా జూన్ రెండవ వారంలో పూర్తి చేయాలని సూచించారు. విజయవాడలోని ఎన్‌టిఆర్ విశ్వవిద్యాలయంలో నర్సింగ్ కళాశాలల అసోసియేషన్ ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. ఏటా వివిధ కారణాలతో నవంబరులో జరుగుతున్న నర్సింగ్ కోర్సుల ప్రవేశాలను ఇకపై జులై నాటికి పూర్తి చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. రాష్ట్రంలో బిఎస్సి (నర్సింగ్) కోర్సుల్ని అందించే కళాశాల్లో ఏటా 13 వేల మంది ప్రవేశిస్తున్నారు. ఇదివరకు కేంద్రం నిర్వహించే నీట్, రాష్ట్రాల స్థాయిలో ఎంసెట్ వంటి పోటీ పరీక్షల ఆధారంగానే నర్సింగ్ కోర్సుల్లో ప్రవేశాలు జరుగుతున్నాయని తెలిపారు. కొన్ని రాష్ట్రాల్లో ఇంటర్మీడియట్‌లో సాధించిన మార్కుల ఆధారంగా ప్రవేశాలు జరుగుతున్నాయని తెలిపారు. నర్సింగ్ విద్య అభ్యసించాలనుకునేవారికి ఈ విషయంలో కొన్ని అవరోధాలున్నాయని, అందువల్లే నర్సింగ్ కోర్సులకు విడిగా ఉమ్మడి ప్రవేశ పరీక్ష (సెట్) నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ పరీక్షను ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తామని, ఇంటర్‌లో బైపిసి గ్రూపు వాళ్లు పరీక్షకు అర్హులని తెలిపారు. జిఎన్ఎం నర్సింగ్ కోర్సుల్లో కూడా సెట్ ద్వారానే అడ్మిషన్లు చేపట్టేందుకు బోర్డు ఆఫ్ ఎగ్జామినేషన్స్‌ను ఏర్పాటు చేయాలని సమావేశంలో సూచన రాగా..అందుకు సానుకూలంగా స్పందించిన మంత్రి ఆ మేరకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఈ కోర్సులకు వార్షిక బోధనా రుసుము రూ.15 వేలు, నాలుగేళ్ల బిఎస్సి (నర్సింగ్) కోర్సులకు రూ.19 వేలుగా నిర్ధారించడం వల్ల నాణ్యమైన నర్సింగ్ విద్యను అందించేందుకు సమస్యలు వస్తున్నాయని అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. అయితే నిర్ధారిత ఫీజుల కంటే అధికంగా నర్సింగ్ విద్యా సంస్థలు వసూలు చేస్తున్నట్లు తమకు ఫిర్యాదులు అందుతున్నాయని ఈ విషయంలో యాజమాన్యాల వైఖరి మారాలని చెప్పారు. ఈ సమావేశంలో హై పవర్ కమిటీ అధ్యక్షులు, హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ యు.దుర్గాప్రసాదరావు, ఎన్‌టిఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్, డిఎంఇ డాక్టర్ నర్సింహం, రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి, స్టేట్ నర్సింగ్ కౌన్సిల్ కార్యదర్శి సుశీల, హెచ్‌పిసి కార్యదర్శి వేణికళ, తదితరులు పాల్గొన్నారు.

మూడు కేటగిరిలుగా సచివాలయాల విభజన

- కీలకమార్పులు చేస్తూ జిఒ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రామ, వార్డు సచివాలయాలను మూడు కేటగిరిలుగా విభజిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు గ్రామ, వార్డు సచివాలయాల శాఖ గురువారం జీఓఎంఎస్ నెంబరు3ను విడుదల చేసింది. ఇక నుంచి సచివాలయాలను ఎ, బి, సి కేటగిరీలుగా విభజిస్తున్నట్లు అందులో పేర్కొంది. 2500లోపు జనాభా ఉన్న సచివాలయాలకు ఇద్దరు, 2501 నుంచి 3500 వరకు జనాభా ఉన్న సచివాలయాలకు ముగ్గురు సిబ్బందిని కేటాయించింది. అంతకంటే ఎక్కువ జనాభా ఉంటే నలుగురు సిబ్బందిని కేటాయిస్తున్నట్లు తెలిపింది. వివిధ శాఖల కార్యదర్శులను ఆయా సచివాలయాలకు సర్దుబాటు చేయాలని నిర్ణయించింది. కార్యదర్శులకు సాధారణ విధులు కేటాయిస్తున్నట్లు తెలిపింది. గ్రామ వార్డు సచివాలయాల్లోని మల్టీపర్పస్ ఫంక్షనరీస్‌ను జనరల్ పర్పస్‌గానూ, టెక్నికల్ ఫంక్షనరీస్‌ను స్పెషిఫిక్ ఫంక్షనరీస్‌గానూ మార్పు చేశారు. ఉత్తర్వుల ప్రకారం ఆయా జిల్లాల కలెక్టర్లు సచివాలయ సిబ్బంది వివరాలను సిద్ధం చేయాలని పేర్కొన్నారు.

అదనపు కేటాయింపులపై ఆర్థిక సంఘాన్ని అడుగుదాం

- విభజన సమస్యలనూ వివరిద్దాం
- అధికారులకు సిఎం సూచన
- వచ్చేవారం తిరుపతిలో కమిషన్ భేటీ




అధికారులతో సమీక్షిస్తున్న సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

గత ఏడాది ఏర్పడిన 16వ ఆర్థిక సంఘం వద్దకు రాష్ట్ర అంశాలు తీసుకువెళ్లేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కసరత్తు చేస్తున్నారు. ఇందులో భాగంగానే ఆర్థికశాఖ అధికారులతో గురువారం కీలక సమీక్ష కూడా నిర్వహించారు. వచ్చే వారంలో తిరుపతిలో 16వ ఆర్థిక సంఘం సమావేశం జరుగనున్న నేపథ్యంలో ఏయే అంశాలను కమిషన్ దృష్టికి తీసుకువెళ్లాలన్నదానిపై ఈ సమీక్ష నిర్వహించారు.వచ్చే ఏడాది ఏప్రిల్ నుంచి 16వ ఆర్థిక సంఘం అమలులోకి వస్తుంది. ఐదేళ్లపాటు ఈ కమిషన్ పనిచేస్తుంది. దీంతో ముందుగానే అన్ని రాష్ట్రాల నుంచి వాటి అవసరాలు, ఆర్థిక పరిస్థితులపై అధ్యయనం చేయాలని కమిషన్ చైర్మన్ అర్వింద్ పంగారియా నిర్ణయించారు. ఇందులో భాగంగానే వారం రోజుల్లో తిరుపతిలో ఈ భేటీ ఉంటుందని, ఇందులో స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా పాల్గొంటారని అధికారులు చెబుతున్నారు. ఈ భేటీలో ఏయే అంశాలను ప్రస్తావించాలన్న దానిపై తాజాగా ఆర్థికశాఖతో ఆయన సమీక్షించారు. ప్రధానంగా ఆర్థిక సంఘం రాష్ట్రాలకు ఇవ్వాల్సిన పన్నుల్లో వాటా నిధులపై కీలక నిర్ణయం తీసుకుంటుంది. జనాభా ప్రాతిపదికన ఈ కేటాయింపులు ఉంటాయి. అయితే తాజాగా దక్షిణాదిలో జనాభా తగ్గుతోందని, అందువల్ల కేటాయింపుల్లో నష్టం కలుగుతోందని చంద్రబాబు భావిస్తున్నారు. అందుకే జనాభా ప్రాతిపదికన ఇచ్చేదానికన్నా ఎక్కువ నిధులు కోరేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆయన ఆర్థిక శాఖకు సూచించారు. రాష్ట్రం నుంచి కేంద్రానికి వెళ్లే పన్నులు పెరుగుతున్నా వాటా నిధులు మిగతా 7లో

2028 ఒలింపిక్స్‌లో క్రికెట్

- ఆరు జట్లతో, టి20 ఫార్మాట్‌లో నిర్వహణ
- ఆతిథ్య హోదాలో అమెరికాకు నేరుగా బెర్త్
- ఐఒసి ఎగ్జిక్యూటివ్ బోర్డు నిర్ణయం



అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న థామస్ బాచ్

రోమ్: ఒలింపిక్స్‌లో క్రికెట్‌కు మళ్లీ చోటు దక్కింది. లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్ కోసం ఈవెంట్ ప్రోగ్రామ్‌ను అంతర్జాతీయ ఒలింపిక్స్ కమిటీ(ఐఒసి) ఎగ్జిక్యూటివ్ బోర్డు తాజాగా ఆమోదించింది. 2028 ఒలింపిక్స్‌లో క్రికెట్‌కు చోటు దక్కడంతో దాదాపు శతాబ్దకాలం తర్వాత ఒలింపిక్స్‌లో క్రికెట్ భాగం కానుంది. పురుషుల, మహిళల విభాగాల్లో టి20 ఫార్మాట్‌లో మొత్తం 6జట్ల మధ్య మాత్రమే పోటీలు జరగనున్నట్లు అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ(ఐఒసి) తాజాగా వెల్లడించింది. ప్రతి జట్టులో 15మంది చొప్పున ఆరుజట్లలో కలిపి మొత్తం 90మంది ఆటగాళ్లు మాత్రమే ఒలింపిక్స్‌లో ఆడే అవకాశం దక్కనుంది. ఆతిథ్య హోదాలో అమెరికా జట్టు నేరుగా బెర్త్ దక్కించుకోగా.. మరో ఐదు జట్ల ఎంపిక కావాల్సి ఉంది. ఆ జట్ల ఎంపికకోసం ఇప్పటికే కసరత్తు త్వరలో మొదలు కానుంది. టి20 ఫార్మాట్‌లో దాదాపు 100 దేశాలు క్రికెట్ ఆడుతున్నాయి. వీటిలో నుంచి తుది జట్లను ఎంపిక చేయడం నిర్వాహకులకు సవాలుతో కూడుకున్నదే.

క్రికెట్‌తో పాటు బేస్‌బాల్- సాఫ్ట్‌బాల్, ఫ్లాగ్ ఫుట్‌బాల్, లక్రాస్ (సిక్సస్), స్క్వాష్‌కు కూడా అవకాశం కల్పించిన సంగతి తెలిసిందే. 2028 ఒలింపిక్స్‌లో మొత్తం 351 పతకాలకోసం ఈవెంట్లు నిర్వహించాలని నిర్ణయించారు. 1896 ఏథెన్స్ ఒలింపిక్స్‌లో క్రికెట్‌కు చోటు కల్పించినా.. ఎంట్రీ జట్లు లేకపోవడంతో రద్దు చేశాడు. 1900 పారిస్ వేదికగా జరిగిన ఒలింపిక్స్‌లో పురుషుల క్రికెట్‌ను మాత్రమే నిర్వహించారు. అదే తొలిసారి, చివరిసారి కూడా. అప్పుడు డెవాన్ అండ్ సోమర్‌సెట్ వండరర్స్ క్లబ్ (బ్రిటన్), ఫ్రెంచ్ అథ్లెటిక్ క్లబ్ యూనియన్ (ఫ్రాన్స్) మధ్య రెండు రోజుల మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్‌లో జట్టుకు 12 మంది చొప్పున ఆటగాళ్లు ఆడటంతో దీనికి ఫస్ట్‌క్లాస్ హోదా కూడా దక్కలేదు. తొలి ఇన్నింగ్స్‌లో బ్రిటన్ 117 పరుగులు చేయగా.. ఫ్రాన్స్ 78 పరుగులకే ఆలౌటైంది. రెండో ఇన్నింగ్స్‌ను 145/5 వద్ద బ్రిటన్ డిక్లేర్ చేసింది. ఛేదనలో ఫ్రాన్స్ 26 పరుగులకే కుప్పకూలడంతో బ్రిటన్ 158 పరుగుల తేడాతో నెగ్గింది. బ్రిటన్‌కు రజతం, ఫ్రాన్స్‌కు కాంస్యం పతకాలు దక్కాయి. ఆ తర్వాత వీటిని పసిడి, రజత పతకాలుగా మార్చారు. ఆ తర్వాత పలు కారణాలతో క్రికెట్‌ను ఒలింపిక్స్ పోటీల నుంచి పక్కనబెట్టారు.

భారీగా డిఎస్‌పిల బదిలీ

- 28 మందికి స్థానచలనం
- వెయిటింగ్‌లోని 17 మందికి పోస్టింగ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం భారీ ఎత్తున డిఎస్‌పిలను బదిలీ చేసింది. పలు కారణాలతో వెయిటింగ్‌లో గత కొంత కాలంగా పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న 17 మంది, మరో 11 మంది రెగ్యులర్ డిఎస్‌పిలకు పోస్టింగ్‌లు ఇస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. తక్షణమే బదిలీ అయిన ప్రదేశంలో రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ట్రంప్‌నకు మాంద్యం గుబులు

- 90 రోజుల పాటు సుంకాలకు విరామం
- చైనాపై 145 శాతం టారిఫ్
- బెదిరింపులకు భయపడం : చైనా
- తొందరపాటు చర్యలు తీసుకోం : భారత్

7

వక్ఫ్ సవరణ రాజ్యాంగ వ్యతిరేకం

సుప్రీంలో ఎస్‌పి ఎంపి పిటిషన్

న్యూఢిల్లీ : వక్ఫ్ (సవరణ) చట్టం రాజ్యాంగ వ్యతిరేకమని, ఈ నిబంధనలను సమీక్షించాలని కోరుతూ సమాజ్‌వాదీ పార్టీ (ఎస్‌పి) ఎంపి జియా ఉర్ రెహమాన్ బార్క్ సుప్రీంకోర్టులో గురువారం పిటిషన్ దాఖలు చేశారు. ఈ చట్టానికి చేసిన సవరణలు ముఖ్యంగా 'వక్ఫ్ బై యూజర్' అనే పదాన్ని తొలగించడం, వక్ఫ్ కౌన్సిళ్లలో ముస్లిమేతరులను చేర్చడం, ముస్లిములపై ఐదేళ్ల ఆంక్షలు విధించడం వంటివి ప్రాథమిక హక్కులను ఉల్లంఘిస్తున్నాయన్నారు. ఈ నిబంధనలను సమీక్షించాలని ఆ పిటిషన్‌లో ఎస్‌పి నేత కోరారు. ఈ నిబంధనలు అన్యాయంగా, అనవసరంగా ముస్లిముల మతపరమైన వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నాయని బార్క్ తరపు న్యాయవాది సులేమాన్ ఖాన్ పేర్కొన్నారు. రాజ్యాంగంలోని మూడవ భాగంలో పేర్కొన్న ప్రాథమిక హక్కులను ఈ నిబంధనలు ఉల్లంఘిస్తున్నాయని, ముస్లిం సమాజానికి చెందిన అనేక ఆస్తులను ఇవి లాక్కుంటాయని ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు. న్యాయవాది సులేమాన్ ఖాన్ మీడియాతో మాట్లాడుతూ, వక్ఫ్ కౌన్సిల్‌లో, రాష్ట్ర వక్ఫ్ బోర్డుల్లో ముస్లిమేతరులను చేర్చడం పూర్తి రాజ్యాంగ విరుద్ధమని విమర్శించారు. ఐదేళ్లకుపైగా ఇస్లాం మతాన్ని ఆచరిస్తున్నట్లు ముస్లిం రుజువు చేసుకోవడం తప్పనిసరి చేస్తూ ఆంక్షలు విధించడమనేది పూర్తిగా ఏకపక్షం, రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. ముస్లిమేతరుల విరాళాలపై నిషేధం కూడా రాజ్యాంగ వ్యతిరేకమన్నారు. ఈ అంశాలన్నింటినీ సుప్రీంకోర్టు సావధానంగా విచారించాలని కోరారు. తమకు న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పటికే ఈ చట్టాన్ని వ్యతిరేకిస్తూ పలువురు నేతలు కోర్టు మెట్లెక్కారు. వీరిలో ఎంఐఎం చీఫ్ ఒవైసి, ఆప్ ఎంఎల్‌ఎ అమనతుల్లా ఖాన్, కాంగ్రెస్ ఎంపి మహ్మద్‌జావేద్, ఆర్‌జెడి ఎంఎల్‌ఎ మహ్మద్ ఇజార్ ప్రభృతులు ఉన్నారు.

వడదెబ్బతో కార్మికుడు మృతి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్



తిరుపతి జిల్లా పుత్తూరు ఆరేటమ్మ గిరిజన కాలనీకి చెందిన డి.హరి (30) వడదెబ్బతో గురువారం మృతి చెందారు. ఎప్పటిలాగే గురువారం పెయింటింగ్ పనులకు వెళ్లారు. ఎండివేడిమి, ఉక్కపోతకు తాళలేక వడదెబ్బకు గురై ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. స్థానికులు గమనించి ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మరణించారు. ఆయయనకు భార్య యమున, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ప్రతి చర్య తప్పదు : వైఎస్ జగన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

'న్యూటన్ సిద్ధాతంతం ప్రకారం ' ప్రతి చర్యకూ... ప్రతిచర్య ఉంటుంది' చంద్రబాబు బంతిని ఎంత గట్టిగా కొడతాడో అంతే వేగంతో అది పైకి లేచి ఆయనకే తగులుతుంది' అని వైసిపి అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు.. తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో కర్నూలు, నంద్యాల జిల్లాల వైసిపి స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్యనేతలతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో సింగిల్ డిజిట్ కూడా రాని పరిస్థితుల్లోకి టిడిపి నేతలు వెళ్తారని అన్నారు. మనరాష్ట్రంతో పాటు తమిళనాడులో కూడా ఎన్నికల్లో ప్రజలు వన్‌సైడ్‌గా ఇచ్చే తీర్పులు చూశామని, వైసిపి కార్యకర్తలు, నేతలు అప్రమత్తంగా , ఐక్యంగా ఉండాలన్నారు. అబద్ధపు హామీలతో బాబు ప్రతి ఒక్కరినీ మోసం చేశారని, అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలను అటకెక్కించారన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలు పూర్తిగా నిర్వీర్యమయ్యాయన్నారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, వైసిపి అని గర్వంగా చెప్పుకుంటూ ప్రతి కార్యకర్త ప్రజలవద్దకు వెళ్లగలరన్నారు. విలువలు, విశ్వసనీయతే పార్టీ సిద్ధాంతమని వైఎస్ జగన్ అన్నారు. కష్టాలు అనేవి శాశ్వతంగా ఉండవని, చీకటి వచ్చిన తర్వాత వెలుతురు తప్పక వస్తుందన్నారు.

నత్తనడకన ధాన్యం కొనుగోళ్లు

- అక్కరకు రాని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు
- నష్టపోతున్న అన్నదాతలు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలు నత్తనడకన సాగుతున్నాయి. ప్రభుత్వం సవాలక్ష నిబంధనలు విధించడం, కొనుగోలు కేంద్రాలకు సిబ్బంది రాకపోవడంతో అన్నదాతలకు దిక్కుతోచడం లేదు. వాతావరణ మార్పులు, ధాన్యం నిల్వ చేసుకునే వెసులుబాటు లేకపోవడంతో తప్పని పరిస్థితుల్లో దళారులను ఆశ్రయించాల్సి వస్తోంది. ఇప్పటి వరకూ కేవలం 98 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే ప్రభుత్వం కొనుగోలు చేసింది.

ఈ ఏడాది రబీ సీజన్‌లో కాకినాడ జిల్లాలో 1.62 లక్షల ఎకరాల్లో 1.45 లక్షల మంది రైతులు వరిని పండించారు. 5.70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా. జిల్లా వ్యాప్తంగా 20 రోజుల నుంచి వరి కోతలు సాగుతున్నాయి. ఇప్పటివరకు 12 వేల ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయి.43 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చింది. కాని ఇందులో వంద మెట్రిక్ టన్నుల ధాన్యం కూడా నేటికీ కొనుగోలు చేయలేదు. ధాన్యం సేకరణకు జిల్లాలో 225 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా రైతులకు ఉపయోగపడడం లేదు. ఈ నెల మూడు నుంచి కొనుగోళ్లను ప్రారంభించామని అధికారులు ప్రకటించిన ప్పటికీ కేంద్రాల్లో పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించకపోవడం తో కొనుగోళ్లు ముందుకు సాగడం లేదు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, తేమ శాతం తదితర నిబంధనల వల్ల రైతులు దళారులను ఆశ్రయించాల్సి వస్తోంది. మరోపక్క సిబ్బంది కూడా కొనుగోలు కేంద్రాలకు పూర్తిస్థాయిలో రావడం లేదు. గత ఖరీఫ్‌లో ధాన్యం కొనుగోలుకు సంబంధించిన వేతనాలు కూడా ఇవ్వకపోవడంతో చాలామంది విధులకు గైర్హాజరవు తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో కొన్నిచోట్ల సిబ్బంది హాజరవుతున్నప్పటికీ కొనుగోళ్లు మాత్రం నత్తనడకనే సాగుతున్నాయి. ఇప్పటి వరకు రెండు కేంద్రాల నుంచి 98 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేయడం కేంద్రాల పనితీరుకు నిదర్శనం.

బస్తాకు రూ.340 నష్టం

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు సరిగా పనిచేయకపోవడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో రైతులు తక్కువ ధరకు ధాన్యాన్ని అమ్ముకోవాల్సి వస్తోంది. ప్రభుత్వం సాధారణ రకం క్వింటాలు రూ.2,300, ఎ-గ్రేడ్ రకానికి రూ.2,320 మద్దతు ధరగా ప్రకటించింది. ప్రభుత్వ మద్దతు ధర ప్రకారం 75 కిలోలకు సాధారణ రకానికి రూ.1725, ఎ-గ్రేడ్ రకానికి రూ.1740 రావాల్సి ఉంది. కానీ దళారులు రూ.1,400 మించి కొనుగోలు చేయడం లేదు. కోతలు కోసిన తర్వాత తేమ శాతం ఎక్కువగా చూపించి రూ.1000కే అడుగుతున్నారని పిఠాపురం నియోజకవర్గ పరిధిలోని పలువురు రైతులు చెబుతున్నారు. బస్తాపై రూ.340 నష్టపోవాల్సి వస్తుందని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పూర్తిస్థాయిలో కొనుగోలు కేంద్రాలను అందుబాటులోకి తీసుకొచ్చి నిబంధనలను సడలించి మద్దతు ధరకే ధాన్యాన్ని కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని రైతాంగం కోరుతోంది.



ప్రైవేటు వ్యాపారులకు ధాన్యం అమ్ముకుంటున్న రైతులు

దళారులకే అమ్ముకుంటున్నాం



ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని ఇంకా సేకరించడం లేదు. సాధారణ రకం మద్దతు ధర ప్రకారం (75 కిలోలు) రూ.1,740 అని చెబుతున్నారు. ప్రయివేటు వ్యాపారులకు రూ.1,400కు అమ్ముకోవాల్సి వచ్చింది. ఒక్కో బస్తాపై రూ.340 నష్టపోవాల్సి వచ్చింది. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా నిబంధనలు సడలించి మద్దతు ధర అందించి రైతులను ఆదుకోవాలి.

– పరిమి వెంకటేశ్వరరావు, ఎన్‌టి.రాజాపురం, గండేపల్లి మండలం

కొనుగోలు కేంద్రాలను అందుబాటులోకి తేవాలి



ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో సిబ్బంది ఎవరూ అందుబాటులో ఉండడం లేదు. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రయివేటు వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది. తేమ శాతం పేరుతో వారు తక్కువ ధర చెల్లిస్తున్నారు. వాతావరణ మార్పులు, ధాన్యం దాచుకునే వీలు లేకపోవడంతో తక్కువ రేటుకే అమ్ముకోవాల్సి వస్తోంది.

– బొజ్జ వెంకట్రావు, రైతు, పిఠాపురం



నేడు సీతారాముల కల్యాణం

- పట్టువస్త్రాలు సమర్పించనున్న ముఖ్యమంత్రి

ప్రజాశక్తి - ఒంటిమిట్ట

శ్రీసీతారామ కల్యాణోత్సవానికి ఒంటిమిట్ట సర్వాంగ సుందరంగా ముస్తాబయింది. శుక్రవారం సాయంత్రం 6:30 నుండి రాత్రి 8:30 గంటల మధ్య నిర్వహించనున్న ఈ వేడుకను వీక్షించేందుకు ఇప్పటికే పెద్ద సంఖ్యలో యాత్రికులు ఒంటిమిట్ట చేరుకున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ పరిసరాలన్నీ విద్యుత్ దీపాలతో కళకళలాడుతున్నాయి. కల్యాణోత్సవ ఏర్పాట్లపై టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్యాణోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారని తెలిపారు. కల్యాణ వేదిక ప్రాంగణం వద్ద ఉన్న 147 గ్యాలరీలలో 60 వేల మంది సౌకర్యవంతంగా కూర్చుని వీక్షించేందుకు ఏర్పాటు చేశామన్నారు. తలంబ్రాల పంపిణీ కోసం తొలిసారిగా ప్రత్యేకంగా 28 కౌంటర్లు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. కల్యాణోత్సవానికి విచ్చేసే ప్రతి ఒక్కరికి ముత్యాల తలంబ్రాలు, శ్రీవారి లడ్డూ ప్రసాదం, కంకణం, అన్నప్రసాదాలు అందించేలా పటిష్ట ఏర్పాట్లు చేపట్టామన్నారు.

మోహినీ రూపంలో శ్రీరాముడు

ఒంటిమిట్ట శ్రీకోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజు రాములవారిని మోహినీ రూపంలో అలంకరించారు. కేరళ డ్రమ్స్, భక్తజన బృందాలు చెక్కభజనలు, కోలాటాలు, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి ఊరేగింపు కోలాహలంగా సాగింది. వాహన సేవలో ఆలయ డిప్యూటీ ఇఒ నటేష్ బాబు, సూపరింటెండెంట్ హనుమంతయ్య, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నవీన్ పాల్గొన్నారు.

వైఎస్ భారతిపై అనుచిత వ్యాఖ్యలు

- టిడిపి కార్యకర్త చేబ్రోలు కిరణ్ అరెస్టు
- పార్టీ నుంచి సస్పెండ్ చేసిన అధిష్టానం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సతీమణి భారతిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన టిడిపి ఐటి విభాగం కార్యకర్త చేబ్రోలు కిరణ్‌కుమార్‌ను మంగళగిరి రూరల్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. గుంటూరు రామన్నపేటకు చెందిన కిరణ్‌కుమార్ ఓ యూట్యూబ్ ఛానల్‌లో భారతి గురించి తీవ్ర అసభ్యకరమైన వ్యాఖ్యలు చేశారని జిల్లా ఎస్‌పి సతీష్‌కుమార్ తెలిపారు. ఈ అంశంపై ఫిర్యాదు అందిన వెంటనే ఆయనను ఎన్‌టిఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం వద్ద అదుపులోకి తీసుకున్నామని వెల్లడించారు. శుక్రవారం కిరణ్‌ను కోర్టులో హాజరుపరుస్తామని వెల్లడించారు. గతంలో మాజీ మంత్రి విడదల రజనీపై కూడా అనుచిత వ్యాఖ్యలు చేయడంతోపాటు పలువురిపై పోస్టింగ్‌లు పెట్టిన ఘటనలలో కిరణ్‌కుమార్‌పై ఐదు కేసులు ఉన్నాయని ఎస్‌పి తెలిపారు. అలాగే ఇటీవల పవన్ కల్యాణ్ చిన్న కుమారుడు శంకర్‌పైనా కొంతమంది అసభ్యకరమైన పోస్టులు పెట్టారని, దీనిపై ప్రత్తిపాడు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు అయ్యిందని ఆయన వెల్లడించారు. వీరిని కూడా త్వరలో అరెస్టు చేస్తామని తెలిపారు. మహిళలు, చిన్నారులపై సామాజిక మాధ్యమాల్లో అసభ్యకరమైన పోస్టులు, వ్యక్తిగత దూషణలు చేస్తే తగిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అంతకుముందు టిడిపి అధిష్టానం చేబ్రోలు కిరణ్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసింది. మహిళలపై అసభ్యంగా మాట్లాడడం తమ పార్టీ విధానం కాదని తెలిపింది. పార్టీ నుంచి కిరణ్‌ను సస్పెండ్ చేస్తున్నట్టు పార్టీ కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.

మాజీ ఎంపి గోరంట్ల మాధవ్ అరెస్టు

చేబ్రోలు కిరణ్‌ను పోలీసులు అరెస్టు చేసి గుంటూరు ఎస్‌పి ఆఫీసుకు తరలిస్తుండగా.. మాజీ ఎంపి గోరంట్ల మాధవ్ పోలీసు వాహనాన్ని అడ్డుకున్నారు. తమ విధులకు ఆటంకం కలిగించారని గోరంట్ల మాధవ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని నగరంపాలెం పోలీసు స్టేషన్‌కు తరలించారు. విధులకు ఆటంకం కలిగించారన్న అభియోగంపై కేసు నమోదు చేశారు.

అసమానతలు లేకుండా డీలిమిటేషన్

మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్ శర్మ

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

రాజ్యాంగంలోని మౌలిక సూత్రాలను విస్మరించి కేవలం డీలిమిటేషన్ (నియోజకవర్గాల పునర్విభజన) చుట్టూ చర్చ జరిగితే బిజెపి ఉచ్చులో పడినట్లేనని మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్ శర్మ అన్నారు. అసమానతలకు తావు లేకుండా డీలిమిటేషన్ జరగాలన్నారు. 'నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) పూర్వాపరాలు - శాస్త్రీయ పద్ధతి' అనే అంశంపై గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యాన శ్రీకాకుళం నగరంలోని కేంద్ర గ్రంథాలయ సమావేశ మందిరంలో గురువారం సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య వక్తగా మాట్లాడుతూ నియోజకవర్గాల పునర్విభజన అంశం పార్లమెంట్‌లో సీట్ల సంఖ్యకు సంబంధించినది మాత్రమే కాదని.. ప్రజాస్వామ్యం, ఫెడరిలిజం, సామాజిక న్యాయం, స్వావలంబన, లౌకికతత్వం వంటి మౌలిక సూత్రాలతో ముడిపడి ఉన్న అంశమని తెలిపారు. డీలిమిటేషన్ ప్రక్రియ చేపడితే ఫెడరిలిజానికి ఎదురుకానున్న ప్రమాదాన్ని గుర్తించాల్సిన అవసరముందని పేర్కొన్నారు. అమెరికా చెప్పినట్లు వ్యవసాయం, వ్యవసాయోత్పత్తులకు సుంకాలను తగ్గిస్తే బిజెపి ప్రభుత్వానికి స్వావలంబన ఇంకేముందని ప్రశ్నించారు. రాష్ట్రాలు, వెనుకబడిన ప్రాంతాల మధ్య అసమానతలను తగ్గించేందుకు ఏర్పాటు చేసిన ప్రణాళికా సంఘాన్ని బిజెపి ప్రభుత్వం ఎత్తేయడంతో రాష్ట్రాల మధ్య అసమాన తలు పెరిగాయన్నారు. జనాభా ప్రాతిపాదికన నియోజకవర్గాల పునర్విభజన ఉండాలని తెలిపారు. 2021 నాటి జనాభా లెక్కలంటే బిజెపికి భయమని, ఆ లెక్కలు తీస్తే యూపి, బీహార్ వంటి రాష్ట్రాల్లో జనాభాతోపాటు వృత్తి, ఆదాయం, సామాజిక, ఆర్థిక, జీవన పరిస్థితులు బయటపడతాయని, మోడీకి ఆ ధైర్యం లేదన్నారు. నియోజకవర్గాల సంఖ్య పెంచుకోవడా నికి చంద్రబాబు పిల్లలను కనాలని చెప్తున్నారని, ఇది సాధ్యమయ్యే పనేనా? అని ప్రశ్నించారు. నియోజక వర్గాల పునర్విభజనపై స్పష్టమైన అభిప్రాయం చెప్పడానికీ జగన్‌కు ధైర్యం చాలడం లేదన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం జర్నలిజం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రెడ్డి తిరుపతిరావు మాట్లాడుతూ అసమానతలకు తావులేకుండా డీలిమిటేషన్ చేపట్టాల్సిన అవసరముందని తెలిపారు. ప్రముఖ న్యాయవాది పి.వి.ఎస్ సీతారామయ్య మాట్లాడుతూ ప్రజల అభిప్రాయాలు తీసుకోకుండా డీలిమిటేషన్ చేస్తామని బిజెపి ప్రభుత్వం చెప్పడం సరికాదన్నారు. గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం కోశాధికారి సుధాకరరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలు రంగాలకు చెందినవారు పాల్గొన్నారు.



సెమినార్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్ శర్మ

మహిళ ఆత్మహత్యకు కారణమైన 'ఫైవ్ స్టార్' ఫైనాన్స్ సంస్థపై చర్యలు

- ఐద్వా, వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బాపట్ల జిల్లా, భట్టిప్రోలు మండలం, వెల్లటూరు గ్రామంలో బాణావత్ పార్వతి (45) ఆత్మహత్యకు కారణమైన హౌసింగ్ ఫైనాన్స్ సంస్థ 'ఫైవ్ స్టార్'పై చర్యలు తీసుకోవాలని, దౌర్జన్యానికి పాల్పడిన ఆ సంస్థ ఏజంట్లను అరెస్ట్ చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా), వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేశాయి. బాధిత కుటుంబానికి రూ.25 లక్షలు పరిహారంగా ఇవ్వాలని డిమాండ్ చేశాయి. ఫైనాన్స్ సంస్థ ఏజెంట్లు పార్వతి ఇంటికి తాళం వేయడంతో ఆమె మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నారని ఐద్వా రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు బి.ప్రభావతి, డి.రమాదేవి గురువారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కాలంలో ఫైనాన్స్ సంస్థల ఆగడాలు పెరిగిపోతున్నా ప్రభుత్వం చోద్యం చూస్తోందని విమర్శించారు. ప్రభుత్వాలు ధరల భారం మోపడంతో ప్రజలు అధిక వడ్డీల వలలో చిక్కుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

ఫైవ్ స్టార్ హౌసింగ్ ఫైనాన్స్ సంస్థ దౌర్జన్యానికి బలైన గిరిజన మహిళ పార్వతి బాయి కుటుంబానికి, ఆ సంస్థ నుంచి రూ.25 లక్షల నష్టపరిహారం, రెండెకరాల భూమి ఇప్పించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దడాల సుబ్బారావు, వి.వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ దారుణానికి ప్రభుత్వం బాధ్యత వహించి పార్వతి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు. వ్యవసాయ కార్మికులకు, పేదలకు, కౌలుదారులకు ప్రభుత్వ బ్యాంక్‌లు రణాలు మంజూరు చేయనందునే ఇలాంటి కంపెనీలకు పేదలు బలైపోతున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఫైనాన్స్, మైక్రో ఫైనాన్స్ సంస్థ ఆగడాలను అడ్డుకోకపోతే ఈ నెల 20 తరువాత రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.

'కాకాణి'పై లుకౌట్ నోటీసులు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

మాజీ మంత్రి, వైసిపి జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై లుకౌట్ నోటీసులు జారీ చేశారు. హైకోర్టు ముందుస్తు బెయిల్ ఇవ్వడానికి నిరాకరించిన నేపథ్యంలో ఆయన విదేశాలకు పారిపోయే అవకాశం ఉన్నందున నోటీసులు జారీ చేశారు. అన్ని ఎయిర్‌పోర్టులు, సీ పోర్టులకు పోలీసులు సమాచారమిచ్చారు. ఆయనపై యాంటిస్పెటరీ బెయిల్ పిటిషన్ ఇంకా కోర్టు పరిధిలో ఉంది.కాకాణిపై ఇప్పటికే క్వార్జ్ అక్రమ తరలింపు, ఎస్‌సి,ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదైంది.కాకాణి ఆచూకీ కోసం నెల్లూరు రూరల్ పోలీసులు గాలిస్తున్నారు.

మహిళా ఉద్యోగిని వేధించిన కేసులో...

మార్కాపురం అటవీశాఖ అధికారికి శిక్ష : హైకోర్టులో అప్పీలు

ప్రజాశక్తి-మార్కాపురం (ప్రకాశం జిల్లా)

ప్రకాశం జిల్లా మార్కాపురం అటవీశాఖలో ప్రస్తుత ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ బొడ్డు వరప్రసాద్ గతంలో సూళ్లూరుపేటలో పనిచేస్తున్న సమయంలో మహిళా ఉద్యోగిని వేధించిన కేసులో నేరం రుజువు కావడంతో బుధవారం ఆయనకు శిక్ష ఖరారయ్యింది.

మూడు నెలలు జైలు శిక్షతో పాటు రూ. ఐదు వేల జరిమానా విధించింది. ఈ నేపథ్యంలో ఆయన హైకోర్టును ఆశ్రయించాడు. హైకోర్టు ఈ కేసులో వరప్రసాద్‌కు స్టే మంజూరు చేసింది. తాత్కాలికంగా శిక్ష అమలు నిలుపుదల చేసింది.

మున్సిపల్ కార్మికుల పోరుబాట

15 నుంచి ధర్నాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా మునిసిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పోరుబాట పట్టారు. ఇందులో భాగంగా ఈ నెల 15,16,17 తేదీల్లో మునిసిపల్ కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు విజయవాడ ధర్నా చౌక్‌లో గురువారం ఎపి మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన సభలో ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సభకు ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు టి.నూకరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సభ పలు తీర్మానాలు ఆమోదించి.. ఉద్యమ కార్యాచరణ ప్రకటించింది. ఈ నెల 15న ఇంజనీరింగ్, ఎన్‌ఎంఆర్‌లు,, కోవిడ్, క్లాప్ డ్రైవర్లకు జీఓ నెంబరు 36 ప్రకారం జీతాలివ్వాలని, 16న సమ్మెకాలపు ఒప్పందాలకు జీఓలు, పనిముట్లు,సెలవుల గురించి, 17న పర్మినెంట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ధర్నాలు నిర్వహించాలని సభ తీర్మానించింది. వీటితో పాటు టిడిపి కూటమి ప్రభుత్వం ఆప్కాస్ స్థానంలో ప్రైవేట్ ఏజెన్సీలు తెచ్చేందుకు చేస్తున్న ప్రయత్నాలను వెంటనే విరమిచాని, మునిసిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, ఇంజనీరింగ్ కార్మికులతో పాటు క్లాప్ డ్రైవర్లకు 36జీఓ ప్రకారం జీతాలివ్వాలని, సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఎక్స్‌గ్రేషియో పెంపు, దహన సంస్కారాల ఖర్చులు, సంక్షేమ పథకాల అమలుకు వెంటనే జీఓలు జారీ చేయాలని సభ తీర్మానించింది. ఈ సభలో ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఆఫ్కాస్ రద్దు విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించాలని, మునిసిపల్ కార్మికుల శ్రమకు గుర్తింపుగా ఉద్యోగాలు పర్మినెంట్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మునిసిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై గత 10 నెలలుగా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షణిలు చేసినా ప్రయోజనం శూన్యమని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వకుండా గత 10 రోజుల్లో సుమారు 4 వేల మంది ఉద్యోగులను తొలగించిందన్నారు. ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.సోమయ్య మాట్లాడుతూ అనారోగ్యం పాలై చనిపోయిన వారి స్థానాల్లో వారి బిడ్డలకు ఉద్యోగాలివ్వకుండా కార్మికుల కుటుంబాలను పస్తులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర కోశాధికారి ఎస్ జ్యోతి బసు మాట్లాడుతూ అర్హులైన కార్మికులకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. ఈ సభలో ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి బి ముత్యాలరావు, నాయకులు కె శ్రీనివాసరావు, ఎ జాన్‌బాబు, టి తిరుపతమ్మ, లక్ష్మీ, సరళ, నరసమ్మ, బివి రమణ, గొలగాని అప్పారావు, ఎం రవి తదితరులు ప్రసంగించారు.



ధర్నానుద్దేంచి మాట్లాడుతున్న కె.ఉమామహేశ్వరరావు

పెట్టుబడుల ఫలితాలు

క్షేత్ర స్థాయిలో కనిపించాలి

- ఉద్యోగాలు పొందినవారి వివరాలతో పోర్టల్
- ఎస్‌ఐపిబి సమావేశంలో సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రానికి పెట్టుబడులు రావడం ఎంత ముఖ్యమో, ఆ పెట్టుబడులు క్షేత్రస్థాయిలో కార్య రూపం దాల్చడం కూడా అంతే ముఖ్యమని సిఎం చంద్రబాబునాయుడు అన్నారు. సచివాలయంలో గురువారం సిఎం అధ్యక్షతన 5వ ఆంధ్రపదేశ్ రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు (ఎస్‌ఐపిబి) సమావేశం జరిగింది.ఈ సమావేశంలో 17 సంస్థల పెట్టుబడులకు ఎస్‌ఐపిబి ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ ఏదైనా ప్రాజెక్టుకు ఆమోదం తెలిపినప్పుడే ఆ సంస్థ ఎప్పుడు ఉత్పత్తి ప్రారంభిస్తుందనే తేదీపై స్పష్టత తీసుకోవాలని సూచించారు. ఐఅండ్‌సి, ఫుడ్ ప్రాసెసింగ్, ఐటి, ఎనర్జీ రంగాల్లో పెట్టు బడులు వస్తున్నాయన్నారు. తాజా ప్రతిపాదనల తో రూ.31,167 కోట్ల పెట్టుబడులు, 32,633 మంది కి ఉద్యోగాలు రానున్నాయని చెప్పారు. ఇప్పటి వరకు ఎన్ని సంస్థలు ఉత్పత్తులను ప్రారంభిం చాయి? ఎంత మందికి ఉద్యోగాలు వచ్చాయనేది వివరణాత్మకంగా రానున్న ఎస్‌ఐపిబి సమావేశంలో రిపోర్టు ఇవ్వాలని సిఎం అధికారులను ఆదేశిం చారు. ఏ సంస్థ ఎవరెవరికి ఉద్యోగం ఇచ్చిందనే వివరాలతో పోర్టల్ కూడా రూపొందించాలన్నారు. రాష్ట్ర ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ ఐటి కంపెనీలకు నామమాత్రపు ధరలకే భూ కేటాయింపులు జరిపేలా చూడాలని సిఎంను కోరారు. భూములు తక్కువ ధరకు ఇవ్వడం ద్వారా మరిన్ని ఐటి కంపెనీలను ఆకట్టుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. లోకేష్ ప్రతిపాదనపై స్పందించి న సిఎం అందుకు తగ్గట్టు ఐటి పాలసీని సవరించి తీసుకురావాలని సూచించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత జరిగిన 5 ఎస్‌ఐపిబి సమావేశాల్లో 57 సంస్థలకు సంబంధించి రూ.4,71,188 మందికి ఉద్యోగాలు దక్కనున్నాయని, గత ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో 5ఎస్‌ఐపిబి సమావేశాలు నిర్వహించిందన్నారు.

ఎస్‌ఐపిబి ఆమోదం తెలిపిన పెట్టుబడుల వివరాలు

సంస్థ పేరు	పెట్టుబడి (రూ. కోట్లలో)	కల్పించే ఉద్యోగాలు
మా మహామాయ ఇండస్ట్రీస్ లిమిటెడ్, విజయనగరం జిల్లా	2,060	1000
ప్రీమియర్ ఎనర్జీస్ లిమిటెడ్, ఎంపిసెజ్, నాయుడుపేట:	4,200	1500
ఎల్‌జి వెండర్స్:శ్రీసిటి తిరుపతి జిల్లా	839	692
పొటీరియల్ లిమిటెడ్ శ్రీసిటి తిరుపతి జిల్లా	1,055	515
స్నేహ ఫార్మ్ ప్రైవేట్ లిమిటెడ్	459	559
పెట్రా సిలికాన్ ప్రైవేట్ లిమిటెడ్: శీసత్యసాయి జిల్లా	585	477
విశా పుడ్స్ అడ్ ఫ్యూయల్స్ ప్రైవేట్ లిమిటెడ్: కృష్ణ జిల్లా	500	500
రామ్‌కో సిమెంట్స్: నంద్యాల జిల్లా	478	550
హెచ్‌ఎఫ్‌సిఎల్, ఎంఎండబ్ల్యుఎల్: శ్రీసత్యసాయి జిల్లా	1198	87
టాప్ స్టోన్ మెటల్స్, అలాయ్స్ ఇండియా(పి) లిమిటెడ్, శ్రీకాకుళం జిల్లా	32	200
టాటాకన్సల్టెన్సీ సర్వీసెస్, విశాఖపట్టణం	1370	12,000
ఉర్సాక్లస్టర్ (పి)లిమిటెడ్: విశాఖపట్టణం	5728	2,500
జెఎస్‌డబ్ల్యు నియో ఎనర్జీ లిమిటెడ్: కర్నూలు జిల్లా	660	110
రెన్యూ విక్రమ్ శక్తి ప్రైవేట్ లిమిటెడ్: అనంతపురం	3000	1860
చింతాగ్రీన్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్: తిరుపతి జిల్లా	2,400	2400
చింతాగ్రీన్ ఎ నర్జీ (పి)లిమిటెడ్: శ్రీసత్యసాయిజిల్లా	7.0000	6,900

జగన్‌కు భద్రత కల్పించడంలో ప్రభుత్వం విఫలం : బొత్స

పజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

మాజీ సిఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి భద్రతపై అనుమానం ఉందని, ఆయన పర్యటనకు తగిన భద్రత కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ అన్నారు. విశాఖ బీచ్ రోడ్డులోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన గురువారం మీడియాతో మాట్లాడుతూ.. జగన్ భద్రతపై ప్రభుత్వం అలసత్వం వహిస్తోందని, ఈ విషయమై ఇప్పటికే కేంద్రానికి లేఖ రాశామని తెలిపారు. ప్రధానిని, కేంద్ర హోం శాఖ మంత్రిని కలిసి జగన్‌కు సరైన భద్రత కల్పించాలని కోరుతామన్నారు. రాప్తాడు పర్యటన ఒక్కటే కాకుండా గుంటూరు మిర్చియార్డు, నంద్యాలలోని మహానంది పర్యటనలో కూడా జగన్‌కు భద్రత కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. కృష్ణదేవరాయలు ఒక ఎంపి స్థాయిలో ఉండి మాజీ సిఎం జగన్‌మోహన్‌రెడ్డిని ప్రొఫెషనల్ కిల్లర్ అని సంబోధించారని, విద్యా సంస్థను నడిపే వ్యక్తి ఇలా సంస్కారహీనంగా మాట్లాడడం సరికాదన్నారు. నాయకులపై దుర్భాషలాడడం పోలీసులకు ఫ్యాషన్ అయిపోయిందని, అలా మాట్లాడిన వారిపై తక్షణమే చర్యలు తీసుకుంటే ఆ తరహా ఘటనలు పునరావృతం కావని తెలిపారు. ప్రజాస్వామ్య బద్ధంగా ప్రభుత్వం పాలన చేయకుంటే శ్రీలంక, బెంగాల్ తరహా ఉద్యమాలు జరుగుతాయని హెచ్చరించారు.

యాప్‌ల వల్ల అంగన్వాడీలకు మానసిక ఒత్తిడి

- ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్ యూనియన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అంగన్వాడీ సెంటర్ల నిర్వహణకు కొత్తగా 'బాల సంజీవని' యాప్‌లో రకరకాల మార్పులు చేశారని, ఈ యాప్ వల్ల అంగన్వాడీలు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ తెలిపింది. అంగన్వాడీలకు యాప్ భారం తగ్గించాలని, ట్యాబ్‌లు ఇవ్వాలని ఐసిడిఎస్ డైరెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డికి, యూనియన్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జి.బేబిరాణి, కె.సుబ్బరావమ్మ గురువారం వినతి పత్రాన్ని అందజేశారు. కొన్ని ప్రాంతాల్లో ఇంటర్‌నెట్ సౌకర్యం సరిగా లేకపోవడం వల్ల అంగన్వాడీల ఫేస్ రికగ్నైజేషన్‌కు, లబ్ధిదారులకు ఇకెవైసి అమలు చేయడానికి ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. బాల సంజీవని యాప్ అమలుకు నెట్ వర్క్ సమస్య చాలా ఎక్కువగా ఉందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన సెల్ ఫోన్‌లలో ఈ యాప్ ఓపెన్ కావడం లేదని చెప్పారు. ఈ సందర్భంగా అంగన్వాడీలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను డైరెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు.

విద్యుద్ఘాతంతో బాలుడు మృతి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

విద్యుద్ఘాతంతో బాలుడు మృతి చెందిన సంఘటన ఏలూరు జిల్లా నూజివీడు పట్టణంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నూజివీడు పట్టణంలోని అజరయ్యపేటకు చెందిన చిట్లూరి ప్రవీణ్ (16) టైల్స్ పని చేస్తున్నాడు. నూజివీడులోని ఓ భవనంలో టైల్స్ వర్క్ చేస్తుండగా ప్రమాదవశాత్తూ విద్యుద్ఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నూజివీడు ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆంధ్రా రంజీ జట్టు మాజీ కెప్టెన్

రాజగోపాల్ యాచేంద్ర కన్నుమూత

ప్రజాశక్తి - మధురవాడ (విశాఖపట్నం)

ఆంధ్రా రంజీ క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ వెలుగోటి రాజగోపాల్ యాచేంద్ర (93) వయోభారంతో గురువారం తిరుపతి జిల్లా వెంకటగిరిలో కన్నుమూశారు. ఆయన ఆంధ్రా రంజీ క్రికెట్ టీమ్‌లో 1956 నుంచి 1965 మధ్య 15 రంజీ ట్రోఫీ మ్యాచ్‌ల్లో ఆడారు. బ్యాటింగ్, లెగ్ బ్రేక్ బౌలింగ్‌తో గుర్తింపు తెచ్చుకున్నారు. 1963 నుంచి 1965 వరకు ఆంధ్ర జట్టుకు నాయకత్వం వహించారు. ఎంతో మంది క్రీడాకారులకు ఆయన ఆదర్శంగా నిలిచారు. టేబుల్ టెన్నిస్‌లోనూ మంచి క్రీడాకారునిగా ఆయనకు పేరుంది. ఆయన మృతిపై ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు, ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని), ఎసిఎ కార్యదర్శి, రాజ్యసభ ఎంపి సానా సతీష్ బాబు సంతాపం తెలిపారు. ఆయన మరణం ఆంధ్రప్రదేశ్ క్రికెట్ రంగంలో తీరని లోటన్నారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

'కొల్లేరు' మళ్లీ కల్లోలం

- చేపల చెరువుల ధ్వంసంతో గగ్గోలు
- 3వ కాంటూరుకు కుదింపుపై అసెంబ్లీలో తీర్మానించినా అమలుకు నోచని వైనం
- జిరాయితీ, సొసైటీ భూములను వెనక్కి ఇవ్వాలని కోరుతున్న జనం



కొల్లేరులోని చేపల చెరువులను ప్రొక్లయినర్లతో ధ్వంసం చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి- ఏలూరు ప్రతినిధి

'ఆపరేషన్ కొల్లేరు' పేరుతో 2006లో చేపల చెరువులను ధ్వంసం చేసి అక్కడి ప్రజలను రోడ్డున పడేసిన ప్రభుత్వం మళ్లీ ఇప్పుడూ అదే తీరున ముందుకు సాగుతుండటంతో అక్కడి ప్రజల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. కొల్లేరును ఐదో కాంటూరు నుంచి మూడో కాంటూరుకు కుదించాలంటూ అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని పాలకులు అమలు చేయకపోవడం పట్ల వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. జిరాయితీ, సొసైటీ భూములను తమకు వెనక్కి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలో కొల్లేరు అభయారణ్యం విస్తరించి ఉంది. ఏలూరు, ఉంగుటూరు, పెదపాడు, దెందులూరు, ఆకివీడు, నిడమర్రు, భీమడోలు, కైకలూరు, మండవల్లి మొత్తం తొమ్మిది మండలాల పరిధిలో 77,138 ఎకరాల్లో కొల్లేరు ఉంది. కొల్లేరులోని బెడ్, బెల్ట్ గ్రామాలు 122 ఉండగా, దాదాపు ఐదు లక్షల జనాభా నివసిస్తున్నారు. ఇక్కడి ప్రజలకు కొల్లేరే జీవనాధారం. 1981లో జలగం వెంగళరావు ప్రభుత్వం కొల్లేరులో చేపల చెరువులను తవ్వించింది. ప్రభుత్వమే 156 సొసైటీలను ఏర్పాటు చేసి ఎస్‌సి, బిసి, ఇబిసి ప్రజలకు 5,500 ఎకరాలను పంపిణీ చేసింది. అయితే, సుప్రీంకోర్టు ఆదేశాల పేరుతో 2006లో ఆపరేషన్ కొల్లేరు పేరుతో మొత్తం 43,724 ఎకరాల పరిధిలోని 1,756 చేపల చెరువులను అప్పటి ప్రభుత్వం బాంబులు పెట్టి మరీ ధ్వంసం చేసింది. దీంతో, కొల్లేరు ప్రజలకు ఉపాధి లేకుండా పోయింది. కొల్లేరును మూడో కాంటూరుకు కుదించాలంటూ 2008, 2014ల్లో అసెంబ్లీలో తీర్మానించినా నేటికీ అమలుకు నోచుకోలేదు. జిరాయితీ భూములు 14,218 ఎకరాలు, సొసైటీ భూములు 5,500 ఎకరాలు మొత్తం 20,218 ఎకరాలను తిరిగి ప్రజలకు అప్పగించాలని అక్కడి ప్రజలు కోరుతున్నారు. ఆ భూములను అప్పగిస్తామంటూ ప్రభుత్వం గతంలో హామీ ఇచ్చి మాట తప్పింది.

.సిపిఎం ప్రజాచైతన్య యాత్రలో నాయకుల వద్ద కొల్లేరు వాసుల మొర

కొల్లేరు కాంటూరు లెక్కలు అశాస్త్రీయంగా ఉండడంతో అక్కడి ప్రజలు తీవ్రంగా నష్టపోయారు. ఆపరేషన్ కొల్లేరు పేరుతో అప్పట్లో 14,218 ఎకరాల జిరాయితీ భూముల్లోని చేపల చెరువులను ప్రభుత్వం ధ్వంసం చేసింది. దీనిపై ప్రజలు తిరగబడడంతో నష్టపరిహారం ఇస్తామని చెప్పింది. దశాబ్దాలు గడిచినా ఇప్పటికీ రూపాయి పరిహారం కూడా ఇవ్వలేదు. కొంతమంది రైతులు జిరాయితీ భూముల్లో చెరువును కొంతమేర పునరుద్ధరించుకుని చేపల సాగు చేసుకుంటున్నారు. ఇప్పుడు మళ్లీ కోర్టు ఆదేశాలంటూ చెరువులన్నింటికీ గండ్లు కొడుతున్నారు. దీంతో, తమను ఆదుకోవాలంటూ కొల్లేరు ప్రజలు ప్రభుత్వం చుట్టూ తిరుగుతున్నారు.

ప్రజాచైతన్య యాత్రలో భాగంగా సిపిఎం నాయకులు కొల్లేరులో పర్యటించగా అక్కడి ప్రజలు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. తమ సమస్యలను పరిష్కరించాలంటూ సిపిఎం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహించి అధికారులకు వినతిపత్రం అందజేశారు. జిఒ 120ని తక్షణమే రద్దు చేయాలని, మూడో కాంటూరుకు కుదించాలని, సొసైటీలను పునరుద్ధరించాలని, కొల్లేరు చుట్టుపక్కల ఫ్యాక్టరీల నుంచి వస్తున్న మురుగు నివారణకు చర్యలు తీసుకోవాలని, అటవీ శాఖాధికారుల వేధింపులు అరికట్టాలని, ఉపాధి హామీ చట్టం ద్వారా కొల్లేరు ప్రజలకు ఉపాధి పనులు కల్పించాలని, కొల్లేరు ఆపరేషన్ సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు నష్టపరిహారం అందించాలని, కొల్లేరు గ్రామాలకు రోడ్లు, డ్రెయినేజీ, విద్యుత్, తాగునీరు సదుపాయాలు కల్పించాలనే 16 డిమాండ్లను వినతిపత్రంలో పేర్కొన్నారు.



కర్నూలు కలెక్టరేట్ ముందు బైఠాయించి నిరసన తెలుపుతున్న డిఎస్‌సి అభ్యర్థులు, విద్యార్థి సంఘాల నాయకులు

మెగా డిఎస్‌సి కోసం కలెక్టరేట్ ముట్టడి

- ఇది ఆరంభం మాత్రమే : డివైఎఫ్‌ఐ రాష్ట్రకార్యదర్శి రామన్న

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

మెగా డిఎస్‌సి వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ కర్నూలు కలెక్టరేట్‌ను డిఎస్‌సి అభ్యర్థులు ముట్టడించారు. అంతకుముందు డివైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో బిర్లా కాంపౌండ్ నుంచి కలెక్టరేట్ వరకూ ర్యాలీ నిర్వహించి అక్కడే బైఠాయించారు. ఎంతసేపటికి కలెక్టర్ బయటకు రాకపోవడంతో ఒక్కసారిగా గేట్లు తోసుకుంటూ లోపలికి వెళ్లేందుకు అభ్యర్థులు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. సిఐ కలుగజేసుకుని డిప్యూటీ స్పెషల్ కలెక్టర్ నాగలక్ష్మిని కార్యాలయం నుంచి బయటకు పిలిపించి వినతిపత్రం అందజేయించారు. కలెక్టర్ బయటకు రావాల్సిందే అంటూ మూడు గంటల పాటు అభ్యర్థులు ఆందోళనకు దిగారు. చివరకు పదిమంది అభ్యర్థులను కలెక్టర్ కార్యాలయంలోకి తీసుకువెళ్లగా అక్కడి కలెక్టర్, జెసి లేరు. ఈ ఉద్యమం ఆరంభం మాత్రమే అని, భవిష్యత్తులో మరింత పెద్దఎత్తున్న ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.

అంతకు ముందు ధర్నానుద్దేశించి డివైఎఫ్‌ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామన్న మాట్లాడుతూ.. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబునాయుడు మెగా డిఎస్‌సిపై మొదటి సంతకం చేసి అభ్యర్థులను మోసం చేశారని విమర్శించారు. పది నెలలు గడిచినా మొదటి సంతకానికి దిక్కులేకపోగా... వారంలో మెగా డిఎస్‌సి అని ముఖ్యమంత్రి, త్వరలోనే మెగా డిఎస్‌సి విడుదల చేస్తామని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రకటనలు చేస్తూ అభ్యర్థులను మోసగిస్తున్నారన్నారు. వెంటనే మెగా డిఎస్‌సి విడుదల చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఎస్ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి రంగప్ప మాట్లాడుతూ.. నిరుద్యోగ ఉద్యమానికి అండగా ఉంటామన్నారు. డివైఎఫ్‌ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి శిరీష, డివైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర, జిల్లా ఉపాధ్యక్షులు అబ్దుల్లా, జిల్లా సహాయ కార్యదర్శి హుస్సేన్‌బాష, నిరుద్యోగ నాయకులు చంద్రశేఖర్, వినయ్, జగన్ మోహన్ , పలువురు డిఎస్‌సి అభ్యర్థులు పాల్గొన్నారు.

544-డి నిర్వాసితులకు న్యాయం చేయండి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి రాంభూపాల్

ప్రజాశక్తి-తాడపత్రి రూరల్

అనంతపురం జిల్లాలో జరుగుతున్న 544-డి రోడ్డు విస్తరణకు సంబంధించి దాని పరిధిలో ఇళ్లు, భూములు కోల్పోయే రైతులకు ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం పరిహారం ఇచ్చి న్యాయం చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి రాంభూపాల్ డిమాండ్ చేశారు. అనంతపురం జిల్లా తాడిపత్రి మండల పరిధిలోని ఎరుగుంటపల్లి గ్రామంలో 544-డి రోడ్డు విస్తరణలో ఇళ్లు, భూములు కోలోతున్న బాధితులతో సిపిఎం, రైతుసంఘం ఆధ్వర్యంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 544-డి రోడ్డు ఏర్పాటుతో రైతులు, కార్మికులు, ప్రజలు నివాసముండే ఇళ్లు రోడ్డు విస్తరణలో పోతున్నాయని, ఇందుకు సంబంధించి అధికారులు 2018లో సర్వే నిర్వహించారని తెలిపారు. సర్వే సమయంలో రెవెన్యూ అధికారులు స్వయంగా పరిశీలనకు వచ్చినప్పుడు గ్రామసభ నిర్వహించి జరగబోయే నష్టం చూపించి రెట్టింపు పరిహారం ఇస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు దానిని అమలు చేయడం లేదన్నారు. ప్రస్తుతం పట్టా భూమి, అసైన్డ్ భూమి రెండింటికీ ఒకే పరిహారం ఇచ్చేలా నిర్ణయం చేసి నిర్వాసితులకు మోసం చేశారన్నారు. ఏడేళ్ల కిందట ఉన్న విలువను కట్టి అరకొర పరిహారం చెల్లించడం నిర్వాసితులకు అన్యాయం చేయడమే అన్నారు. రోడ్డు విస్తరణలో ఇళ్లు, భూములు కోల్పోయే బాధితులకు పూర్తి స్థాయిలో న్యాయం చేసిన తర్వాతనే పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఒ నల్లప్ప, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు జగన్మోహన్ రెడ్డి, రైతుసంఘం మండల కార్యదర్శి రాజారామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



544-డి నిర్వాసితులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

అప్పల బాధతో రైతు ఆత్మహత్య



నరసింహమూర్తి (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - కంచిలి

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన శ్రీకాకుళం జిల్లా కంచిలి మండలంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... మండలంలోని పెద్ద కొజ్జిరియాకు చెందిన రైతు బల్లెడ నరసింహమూర్తి (58) తనకున్న ఎకరా పొలంతో పాటు మరో ఏడెకరాల భూమిని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. జీడి, మామిడి పంటల పెట్టుబడి కోసం నాలుగేళ్లుగా ప్రయివేటు వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు చేశారు. ఆ అప్పు వడ్డీతో కలిసి రూ.15 లక్షలు అయ్యింది. ఓ వైపు రుణదాతల ఒత్తిడి.. మరోవైపు నాలుగేళ్లుగా ఆశించిన మేర దిగుబడి రాకపోవడంతో మనస్తాపానికి గురయ్యారు. బుధవారం ఉదయం తోటకు వెళ్లి వస్తానని చెప్పి వెళ్లిన నరసింహమూర్తి రాత్రి ఇంటికి రాకపోవడంతో ఆందోళనకు గురైన కుటుంబసభ్యులు తోటకు వెళ్లి వెతికారు. గ్రామ సమీపంలోని ఒక జీడి చెట్టు కింద విగతజీవిగా పడి ఉన్న నరసింహమూర్తిని గమనించారు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పోలీసులు సోంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పారినాయుడు తెలిపారు. నరసింహమూర్తికి భార్య నీలవేణి, కుమారులు శ్రీను, ప్రవీణ్ ఉన్నారు.

పెంచిన ఆస్తి పన్ను రద్దు చేయాలి

- మంత్రి నారాయణకు సిపిఎం నేతల వినతి

ప్రజాశక్తి - విజయవాడ

పెంచిన ఆస్తి (ఇంటి) పన్ను తగ్గించాలని, ఆస్తి విలువ ఆధారిత ఇంటి పన్ను విధానం రద్దు చేయాలని కోరుతూ గురువారం రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పి నారాయణకు సిపిఎం నాయకులు వినతి పత్రం అందజేశారు. విజయవాడలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ కళాశాలలో రాష్ట్ర మున్సిపల్ కమిషనర్ల సమావేశానికి విచ్చేసిన మంత్రి నారాయణను సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ తదితరులు కలిశారు. ఏప్రిల్ 1వ తేదీ నుండి పెంచిన ఆస్తి పన్ను తగ్గించాలని, ఆస్తి విలువ ఆధారిత పన్ను ప్రవేశపెడుతూ గత ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టం 44/2020, జిఒ నెంబర్ 198 రద్దు చేయాలని కోరారు. పన్ను చెల్లింపు ఒక నెల ఆలస్యమైనా 24 శాతం వడ్డీ వసూలు చేయడం సరికాదని, మే ఆఖరు వరకు జరిమానా లేకుండా ఆస్తిపన్ను బకాయిలు చెల్లించే అవకాశం కల్పించాలని కోరారు. మంత్రి నారాయణ స్పందిస్తూ పెంచిన ఆస్తి పన్ను ఉపసంహరణ విషయాన్ని పరిశీలిస్తామని చెప్పారు. కానీ స్పష్టమైన హామీ మాత్రం ఇవ్వలేదు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బోయి సత్యబాబు, బి రమణరావు, పి కృష్ణ, ఎన్ నాగేశ్వరరావు, కోరాడ రమణ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి నారాయణకు వినతిపత్రం సమర్పిస్తున్న సిపిఎం నాయకులు సిహెచ్.బాబూరావు, డి.కాశీనాథ్ తదితరులు

పౌర, ప్రజా సంఘాలు ఆందోళనలకు సిద్ధం కావాలి : సిపిఎం పిలుపు

పెంచిన ఆస్తి పన్నుకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా పౌర సంఘాలు, ప్రజా సంఘాలు ఆందోళనలకు సిద్ధం కావాలని సిహెచ్ బాబూరావు పిలుపునిచ్చారు. మంత్రి నారాయణకు వినతిపత్రం సమర్పించిన అనంతరం మీడియాతో బాబూరావు మాట్లాడుతూ టిడిపి, జనసేన, బిజెపిలు ఎన్నికల్లో ఇచ్చిన హామీని విస్మరించి ప్రజలపై ఒకేసారి రూ.320 కోట్ల మేర భారం మోపడం సరికాదన్నారు. ప్రతి ఏడాది 15 శాతం పన్ను పెంచే విధానాన్ని కొనసాగించడం శోచనీయమన్నారు. ఈ నేపథ్యంలో ఆందోళనకు సిద్ధం కావాలని కోరారు. రాష్ట్రంలో 124 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ఏడాదికి రూ.1200 కోట్లగా ఉన్న ఆస్తిపన్ను డిమాండ్ ఇప్పుడు రూ.2150 కోట్లకు చేరిందన్నారు. ఈ సంవత్సరంలో రూ.320 కోట్ల మేర అదనపు భారం పడిందని, దీని వల్ల డిమాండ్ సుమారు రూ.2500 కోట్లకు చేరుకుందని వివరించారు. స్థానిక సంస్థలకు నిధులిచ్చి అభివృద్ధి చేపట్టాల్సింది పోయి ప్రజలను పన్నుల పేరుతో పీల్చి పిప్పిచేయడం అన్యాయమన్నారు. పన్నుల పెంపు భారం ప్రభావం ప్రత్యక్షంగా ఇంటి యజమానులపై, పరోక్షంగా అద్దెదారులపై పడుతుందన్నారు. చిన్న, మధ్యతరగతి వ్యాపారులు, పరిశ్రమలదారులపై మరింత భారం పడుతుందని తెలిపారు.

'కియా'లో దొంగలెవరో .?

- 900 కారు ఇంజన్లు మాయం
- ఇండెంట్‌లోనే మతలబు ఉందా..?
- దొంగతనంపై యాజమాన్యం మౌనం



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ సమీపంలోని ఎర్రమంచి వద్ద ఏర్పాటు చేసిన అంతర్జాతీయ కియా కార్ల పరిశ్రమలో కారు ఇంజన్ల దొంగతనం పెద్ద చర్చనీయాంశంగా మారింది. ఒకటి కాదు... రెండు కాదు ఏకంగా 900 ఇంజన్లు దొంగతనం జరిగినా యాజమాన్యం నుంచి ఇప్పటి వరకు ఎటువంటి ప్రకటనా వెలువడకపోవడం మరింత విస్మయానికి గురిచేస్తోంది. అసలు ఇంత పెద్ద దొంగతనం ఏ రకంగా జరిగి ఉంటుందన్నది ఇప్పుడు సర్వత్రా నడుస్తున్న చర్చ. దొంగతనం జరిగిన వస్తువులు చిన్న విడి భాగానివి కావు.. ఏకంగా కార్లకు అమర్చే ఇంజన్లు. ఇంతటి ప్రాముఖ్యత, విలువతో కూడిన వస్తువులను దొంగలించడం ఎలా సాధ్యమై ఉంటుందన్న సందేహాలు అందరిలోనూ నెలకొన్నాయి. దీనిపై అన్ని విధాలుగా విచారణ చేపడుతున్నామని పోలీసులు చెబుతున్నారు. ఇంత పెద్ద సంఖ్యలో ఇంజన్లు దొంగతనం జరగాలంటే బయటి వ్యక్తుల నుంచి సాధ్యమయ్యేది కాదని, లోపలున్న వ్యక్తుల ప్రమేయం ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు.

కియా సంస్థ 2019 డిసెంబరు నుంచి కార్ల ఉత్పత్తులను సత్యసాయి జిల్లా పెనుకొండ సమీపంలో కొత్తగా ఏర్పాటు చేసిన ప్లాంట్‌లో ప్రారంభించింది. ఏడాదికి సగటున మూడు నుంచి నాలుగు లక్షల కార్ల తయారీ ఇక్కడ జరుగుతూ ఉంటుంది. ఈ కార్లకు విడి భాగాలు తయారీ చేసే పరిశ్రమలు కూడా ఇక్కడే ఏర్పాటయ్యాయి. అయితే కారు ఇంజన్లు మాత్రం హ్యుందాయ్ కంపెనీ నుంచి కియా కొనుగోలు చేస్తుంది. ఈ ఇంజన్లు తమిళనాడులోని సిర్‌పెరంబూరు నుంచి వస్తాయి. అత్యధికం 1.6 లీటర్లు, నాలుగు సిలిండర్లు కలిగినవి ఉంటాయి. ఒక్కో ఇంజను విలువ సుమారు రూ.ఐదు లక్షలకుపైగా విలువ ఉండే అవకాశం ఉందని మెకానికల్ నిపుణులు చెబుతున్నారు.

యాజమాన్యం మౌనం వెనుక సందేహాలు

900 ఇంజన్లు ఒకేసారి పోలేదని, 2020 నుంచి ఇప్పటి వరకు పోయినవిగా తెలుస్తోంది. ఈ ఇంజన్ల దొంగతనం గోల్‌మాల్ వెనుక ఇండెంట్ విషయంలోనే మతలబు నడిచిందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఒక్కోసారి నాలుగు ఇంజన్లు ఇండెంట్ పెడితే ఐదు పంపినట్లుగా రికార్డుల్లో ఉందన్న ప్రచారం నడుస్తోంది. అంటే యాజమాన్యం లెక్కల్లోనూ కొంత గందరగోళం నెలకొనడంతో అవకాశంగా తీసుకున్న కొందరు ఇంజన్ల దొంగతనానికి పాల్పడి ఉంటారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ మొత్తం వ్యవహారాన్ని నిశితంగా దర్యాప్తు చేసి 900 ఇంజన్లు ఏ రకంగా బయటకు పోయాయన్నది పరిశీలిస్తామని శ్రీసత్యసాయి జిల్లా పోలీసులు చెబుతున్నారు.

దొంగతనం వ్యవహారంపై మాత్రం కియా యాజమాన్యం ఇప్పటి వరకు పెదవి విప్పడం లేదు. ఇందులో ఏ మాత్రం పెదవి విప్పినా ఇండింట్ వ్యహారాలు వెలుగులోకి వస్తాయన్న ఉద్దేశంతోనే మౌనంగా ఉంటోందన్న విమర్శలూ వ్యక్తమవుతున్నాయి. పోలీసులు సమగ్ర దర్యాప్తు చేపడితే ఇంజన్ల మాయం వ్యవహారం మొత్తం బయటపడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.



ఏలూరులో ఉద్యాన శాఖ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కోకో రైతులు

'కోకో'కు ధరల స్థిరీకరణ పథకం వర్తింపజేయాలి

- ఉద్యాన శాఖ కార్యాలయాన్ని ముట్టడించిన రైతులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కోకో గింజల ధర తగ్గింపుపై రైతులు కదంతొక్కారు. ఏలూరులోని జిల్లా ఉద్యాన శాఖాధికారి కార్యాలయాన్ని ఆంధ్రప్రదేశ్ కోకో రైతు సంఘం ఆధ్వర్యంలో కోకో రైతులు గురువారం ముట్టడించారు. కంపెనీలకు అనుకూలంగా ఉద్యాన శాఖాధికారులు కోకో గింజలకు తక్కువ ధర ప్రచారం చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. కోకో గింజలకు ధరల స్థిరీకరణ పథకం వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ కోకో రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొల్లు రామకృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ.. కోకో గింజల కొనుగోలు, ధర సమస్యలను పరిష్కరించకపోవడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సమక్షంలో జరిగిన సమావేశంలో ఈ నెల 7వ తేదీనాటికి ధరల ఒప్పంద నిర్ణయం ప్రకటిస్తామని అధికారులు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇంతవరకు ధరలు ప్రకటించకుండా కంపెనీలు చెప్పిన తక్కువ ధరను ఉద్యాన శాఖాధికారులు ప్రచారం చేయడం దుర్మార్గమన్నారు. అధికారులు తప్పుడు ప్రచారం మాని రైతులకు న్యాయం చేయాలని కోరారు. కోకో గింజలకు అంతర్జాతీయ మార్కెట్ ధర ఇచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం ప్రకటన వెంటనే చేయాలని డిమాండ్ చేశారు. ధరల స్థిరీకరణ పథకం వర్తింపజేసి కోకో రైతులను ఆదుకోవాలన్నారు. లేనిపక్షంలో కోకో రైతుల పోరాటం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రైతులతో ఉద్యాన శాఖ అధికారి మాట్లాడారు. మోండలీజ్ కంపెనీ ధరల ప్రచారం నిలుపుదల చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు గుడిబండి వీరారెడ్డి, కోనేరు సతీష్ బాబు, పానుగంటి అచ్యుతరామయ్య, కె.రామిరెడ్డి, కొసరాజు రాధాకృష్ణ, కోకో రైతులు పాల్గొన్నారు.

12న వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా దేశవ్యాప్త ఆందోళన

- సిపిఐ నేత కె.నారాయణ

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

'ఏకపక్షంగా వక్ఫ్ బిల్లును సవరించడం లౌకిక వ్యవస్థకు చీకటిరోజును తలపిస్తోంది' అని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. తిరుపతిలోని సిపిఐ కార్యాలయంలో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. వక్ఫ్ భూములను స్వాధీనం చేసుకోవడమంటే ముస్లింలను ఆర్థికంగా దెబ్బకొట్టే కుట్రలో భాగమేనని తెలిపారు. వక్ఫ్ సవరణ బిల్లుపై ఇప్పటికే సుప్రీం కోర్టులో సవాల్ చేశామని తెలిపారు. వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ఈ నెల 12న దేశవ్యాప్తంగా ఆందోళనకు పిలుపునిచ్చినట్లు చెప్పారు.

అడవుల్లో మావోయిస్టుల ఏరివేత ముమ్మాటికీ దుర్మార్గమేనని తెలిపారు. భావజాలాన్ని అణచడంలో తప్పులేదని, మనుషులను చంపడమే పనిగా పెట్టుకోవడం సరైన విధానం కాదన్నారు. అనంతపురం జిల్లా రామగిరి పర్యటనలో పోలీసులపై జగన్ అనుచిత వ్యాఖ్యలను ఆయన ఖండించారు. అమెరికా భారీగా సుంకాలు విధించడం ముమ్మాటికీ ట్రేడ్ యుద్ధమేనని తెలిపారు. ఆయా దేశాలు అమెరికాపై తిరుగుబాటు చేస్తుంటే, మోడీ ఎందుకు అమెరికాకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ప్రశ్నించారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు, శివారెడ్డి, జిల్లా కార్యదర్శి పి.మురళి పాల్గొన్నారు.

కార్గో విమానాల్లో 600 టన్నుల ఐఫోన్‌ల ఎగుమతులు

న్యూఢిల్లీ: అమెరికా ప్రభుత్వం అడ్డగోలుగా వేస్తోన్న టారిఫ్‌ల నేపథ్యంలో ఆపిల్ కంపెనీ ముందు జాగ్రత్తగా తన ఉత్పత్తులను అమెరికాకు తరలించుకుంటుంది. అధిక పన్నుల నుంచి తప్పించుకోవడానికి వీలుగా భారత్ నుంచి 600 టన్నులు లేదా సుమారు 15 లక్షల ఐఫోన్లను ప్రత్యేక కార్గో విమానాల్లో అమెరికాకు తరలించినట్లు రిపోర్టులు వస్తోన్నాయి. ఇటీవల ట్రంప్ చైనాపై 125 శాతం, భారత్‌పై 26 శాతం, ఇతర దేశాలపైనా భారీగా సుంకాలు వేస్తోన్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. కాగా.. చైనా మినహా మిగితా దేశాలపై 90 రోజుల వరకు సుంకాల అమలును వాయిదా వేశారు.

తగ్గిన టిసిఎస్ లాభాలు

న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద టెక్నాలజీ కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్) నికర లాభాల్లో తగ్గుదల చోటు చేసుకుంది. గడిచిన ఆర్థిక సంవత్సరం (2024-25) మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికం (క్యూ4)లో 2 శాతం తగ్గుదలతో రూ.12,224 కోట్ల లాభాలను ప్రకటించింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రమైఆసికంలో రూ.12,434 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇదే సమయంలో రూ.61,237 కోట్లుగా ఉన్న రెవెన్యూ.. గడిచిన క్యూ4లో రూ.64,479 కోట్లకు పెరగడం విశేషం. ఆర్థిక ఫలితాల సందర్భంగా రూ.1 ముఖ విలువ కలిగిన షేర్‌పె రూ.30 చొప్పున తుది డివిడెండ్‌ను చెల్లించేందుకు కంపెనీ బోర్డు నిర్ణయించింది. వరుసగా రెండో త్రైమాసికంలోనూ మెరుగైన ఆర్డర్ బుక్ సాధించామని టిసిఎస్ సిఇఒ కృతివాసన్ తెలిపారు. వార్షిక ఆదాయం 30 బిలియన్ డాలర్లను దాటడం పట్ల సంతోషం వ్యక్తంచేశారు. గడిచిన క్యూ4లో కొత్తగా 625 మంది ఉద్యోగులను తీసుకున్నామని ఆ సంస్థ హెచ్‌ఆర్ చీఫ్ మిలింద్ లక్కడ్ పేర్కొన్నారు. మొత్తం ఉద్యోగుల సంఖ్య 6.07 లక్షలకు చేరిందన్నారు.

తృణ ధాన్యాల ఉత్పత్తుల్లోకి తెనాలి 'డబుల్ హార్స్'

- తెలుగు రాష్ట్రాల మార్కెట్లోకి విడుదల
- 50 ఎక్స్‌క్లూజివ్ స్టోర్లను తెరుస్తాం
- గ్రూప్ సిఎండి మోహన్ శ్యామ్ ప్రసాద్ వెల్లడి



ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

పప్పులు, ధాన్యాల విక్రయాల్లో ఉన్న తెనాలి డబుల్ హార్స్ గ్రూప్ తాజాగా తృణ ధాన్యాల ఉత్పత్తుల విభాగంలోకి మిల్లెట్ మార్వెల్స్ పేరుతో ప్రవేశించింది. ఈ బ్రాండ్ కింద ధాన్యాలు, నూడుల్స్, కుకీస్, రెడీ టు కుక్ విభాగంలో 18 రకాల ఉత్పత్తులను అందుబాటులోకి తెచ్చింది. వీటిని గురువారం హైదరాబాద్‌లో అపోలో హాస్పిటల్స్ గ్రూప్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ సంగీత రెడ్డి, తెనాలి డబుల్ హార్స్ గ్రూప్ సిఎండి మోహన్ శ్యామ్ ప్రసాద్ విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్యామ్ ప్రసాద్ మీడియాతో మాట్లాడుతూ.. వీటిని తొలుత తెలుగు రాష్ట్రాల్లో అందుబాటులోకి తెస్తున్నామని చెప్పారు. గడిచిన 2024-25లో తమ గ్రూప్ ఆదాయం తొమ్మిది శాతం పెరిగి రూ.535 కోట్లుగా నమోదయ్యిందన్నారు. మిల్లెట్స్ ఆవిష్కరణలతో ఈ ఏడాది ఆదాయంలో 15 శాతం వృద్ధిని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఏడాదిలో తెలుగు రాష్ట్రాల్లో 25 చొప్పున మొత్తంగా 50 ప్రత్యేక అవుట్‌లెట్‌లను తెరువాలని నిర్దేశించుకున్నామన్నారు. ప్రస్తుతం ఎపిలో ఐదారు ఉన్నాయన్నారు. ఫ్రాంచైజీ పద్ధతిలోనూ స్టోర్లను ఇవ్వనున్నామన్నారు. తెనాలిలోని తమ తయారీ యూనిట్‌లో గంటకు 18 టన్నుల ఉత్పత్తులను ప్రాసెస్ చేస్తున్నామని చెప్పారు. త్వరలోనే ఆర్గానిక్ ఉత్పత్తుల్లోకి ప్రవేశించనున్నామన్నారు. తమ ఉత్పత్తులు ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో లభిస్తాయన్నారు.

సంపాదకీయం

ఇంధన భారం!

అచ్చే దిన్ గురించి అస్తమానూ కబుర్లు వల్లించే మోడీ ప్రభుత్వం సామాన్య జనం నెత్తిన మళ్లీ గ్యాస్ బండ భారం మోపింది. అటు పెట్రోలు, డీజిల్ పైనా రూ.2ల చొప్పున సుంకం బనాయించింది. 'ఏడ్చిపోదురు గాక నాకేటి వెరపు?' అన్న చందంగా జనంపై భారాలు మోపటం మోడీ హయాంలో ఇదే మొదటిసారి కాదు. ప్రజలు కోవిడ్ కష్టకాలంలో విలవిల్లాడిపోయిన సందర్భాల్లో కూడా వంట గ్యాస్, పెట్రో భారాలు మోపిన ఘనత కేంద్ర ప్రభుత్వానిది. ఎల్‌పిజిపై ప్రజలకు బోలెడంత రాయితీ ధారబోస్తున్నామంటూ బొంకి, నెమ్మది నెమ్మదిగా సబ్సిడీ మొత్తానికి సర్వమంగళం పాడిన మోసకారితనం మోడీ అండ్ కోది. దాదాపు పదేళ్ల క్రితం నగదు బదిలీపై గొప్పగా ఢంకా బజాయించి, సబ్సిడీ సొమ్మును నేరుగా వినియోగదారుల ఖాతాల్లోనే జమ చేస్తామంటూ చెప్పారు. ఆ తరువాత 14.2 కేజీల సిలిండరు ధరను రూ.420 నుంచి రూ.1100 వరకూ పెంచుకుంటూ పోయారు. ప్రారంభంలో రూ.రెండొందలకు పైగా ఖాతాల్లో జమైన రాయితీ సొమ్ము ఇప్పుడు రూ.15ల నామమాత్రానికి కరిగిపోయింది. ఈ విధంగా దేశంలోని 32.83 కోట్ల మంది ఎల్‌పిజి వినియోగదారులను చెప్పాపెట్టకుండా రాయితీని తెగ్గోసి, మోసగించింది బిజెపి ప్రభుత్వం.

పాతికేళ్ల క్రితం వరకూ ఏడాదికొకసారి పెట్రో ఉత్పత్తుల ధరలను సవరించటం, పూలింగ్ పద్ధతిలో ధరల సర్దుబాటు చేయటం విధానంగా ఉండేది. దానిని పూర్తిగా నిర్వీర్యం చేసి, అంతర్జాతీయ ఇంధన మార్కెట్టులోని హెచ్చుతగ్గులకు అనుగుణంగా ఎప్పటికప్పుడు ధరల్లో మార్పులు ఉంటాయని కేంద్ర పాలకులు ప్రకటించారు. ధరలు పెరిగినప్పుడు పెంచటం, తగ్గినప్పుడు తగ్గించటం సహజంగానే జరిగిపోతుందని చెప్పుకొచ్చారు. నిజానికి ఆచరణలో జరుగుతున్నదేమిటి? భారం పెరిగితే జనం మీదికి నెట్టటం, ధర తగ్గితే చమురు కంపెనీల ఖాతాల్లోకి మళ్లించటం మామూలుగా మారింది. అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు తగ్గినప్పుడల్లా ఎక్సైజ్ సుంకాన్ని పెంచటం రివాజు అయింది. 2014 నవంబరు నుంచి 2016 జనవరి వరకూ తొమ్మిదిసార్లు సుంకాన్ని పెంచారు. వినియోగదారులకు దక్కాల్సిన తగ్గింపును ప్రభుత్వమే కొట్టేయటం మోసకారితనం కాక మరేమిటి?

అంతర్జాతీయ చమురు మార్కెట్లో నెలకొన్న పరిస్థితుల రీత్యా వాస్తవానికి పెట్రో ఉత్పత్తుల ధరలు గణనీయంగా తగ్గాల్సి ఉంది. 2014 నాటితో పోలిస్తే ఇప్పుడు 41 శాతం మేర చమురు ధరలు తగ్గాయి. దానిని యథాతథంగా అమలు చేస్తే లీటరు పెట్రోలు, డీజిలు ధరలు రూ.70ల లోపే ఉండాలి. అమెరికా ఆంక్షల నేపథ్యంలో రష్యా మనకు గతంలో కన్నా తక్కువ ధరకే ముడి చమురును విక్రయిస్తోంది. ఈ అవకాశాన్ని దేశీయ కార్పొరేటు కంపెనీలు అధిక లాభాలు ఆర్జించటానికి మోడీ ప్రభుత్వం అందిస్తోంది తప్ప ఆ తగ్గింపును ప్రజల వైపు మళ్లించటం లేదు. పైగా ఎన్నికల వేళ చమురు ధరల ఆధారంగా లబ్ధి పొందేందుకు కుయుక్తులకు దిగుతోంది. కోవిడ్ విపత్తు కాలంలోనూ ప్రజలపై కనికరం చూపని మోడీ ప్రభుత్వం... ఐదు రాష్ట్రాల ఎన్నికల సమయంలోనూ, సార్వత్రిక ఎన్నికల తరుణంలోనూ తగ్గింపు జిమ్మిక్కులు ప్రదర్శించింది. రూ.1050 వరకూ పెంచిన వంట గ్యాస్‌పై రూ.200, రూ.111 వరకూ పెంచిన పెట్రోలు ధరపై రూ.2లు తగ్గించి, పెద్ద ఉపశమనం చేకూర్చినట్టు ప్రచారం చేసుకొంది. కార్పొరేట్ల సేవ, అధికార యావ తప్ప ప్రజలపై భారాలు తగ్గించే బాధ్యతాయుత ఆచరణ బిజెపి ప్రభుత్వానికి లేదనటానికి తాజా పెంపు ఉదాహరణ.

తగిన ఆదాయాలు లేక ప్రజల్లో కొనుగోలు శక్తి రోజురోజుకీ తగ్గిపోతున్న వాస్తవం అనేక రూపాల్లో కళ్ల ముందు కనిపిస్తోంది. కోవిడ్ తరువాత నిత్యావసరాల ధరలు భారీగా పెరిగి, మళ్లీ కిందికి చూడడం లేదు. ధరలను అదుపులోకి తేవాల్సిన పాలకులు ఆ పని చేయకపోగా, అవి మరింత పెరగటానికి కారణమయ్యే ఎల్‌పిజి, పెట్రో ధరలను పెంచటం బాధ్యతారాహిత్యం. పేదల జీవితాల్లో వెలుగులు నింపటానికి అంటూ తీసుకొచ్చిన ఉజ్వల పథకం వినియోగదారులపైనా రూ.50ల పెంపు గ్యాస్ వినియోగాన్ని పక్కన పెట్టి, మళ్లీ కట్టెల మోపు వైపు నెట్టటానికే ఉపయోగపడుతుంది. కాబట్టి, పెంచిన ఎల్‌పిజి ధరను ఉపసంహరించటంతో పాటు రాయితీని భారీగా పెంచాలి. అన్ని తరగతులపైనా, నిత్యావసర ధరల పైనా ప్రభావం చూపే ఈ పెంపును తక్షణం ఉపసంహరించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం కూడా కేంద్రంపై ఒత్తిడి తేవాలి.

మంచి మాట




విజయం మనల్ని ఊరికే వరించదు. దాని వెనుక ఎంతో కృషి, పట్టుదల, త్యాగం దాగుంటాయి.

- పీలే, అమెరికన్ నటుడు.

వ్యాఖ్య

పన్నులపై ఒకడుగు వెనక్కు తగ్గిన ట్రంప్!

అసలు పన్నుల వాయిదా నిర్ణయానికి దారితీసిందేమిటి? మొదటి కారణంగా చెప్పుకోవాలంటే ఏప్రిల్ ఐదున 150 సంస్థల పిలుపు మేరకు 20 లక్షల మంది జనం నిరసన ప్రదర్శనలు చేశారు. వెనక్కు తగ్గకపోతే మరింత పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. తొలుత మద్దతు ప్రకటించిన ద్రవ్య పెట్టుబడిదారులు, ఇతరులు కూడా పర్యవసానాలను చూసి వైఖరి మార్చుకుంటున్నారు. ఒక్కరంటే ఒక్క ఆర్థికవేత్త కూడా సానుకూలంగా మాట్లాడిన ఉదంతం లేదు. ట్రంప్ అధికారానికి వచ్చిన తరువాత భారీగా పెరుగుతుందని ఆశించిన ఎలన్ మస్క్ సంపద ఇప్పటి వరకు 135 బిలియన్ డాలర్లు హరించుకుపోయింది. చైనా సహా ఎవరి మీదా పన్నులు వేయవద్దని, పునరాలోచించాలని ట్రంప్‌ను మస్క్ గట్టిగా కోరినట్లు 'వాషింగ్టన్ పోస్టు' పత్రిక రాసింది. చైనా వెనక్కు తగ్గకపోగా ఐరోపా సమాఖ్య కూడా ప్రతిఘటనకు పిలుపు ఇచ్చింది. పన్నుల విధింపులో కీలక పాత్ర పోషించిన సలహాదారు పీటర్ నవారో, మరో కీలక సలహాదారు ఎలాన్ మస్క్ వీధులకెక్కి విమర్శించుకుంటున్నారు. ఈ పరిణామాలతో గోడ మీద పిల్లులు కూడా వ్యతిరేక శిబిరంలో చేరే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.



డొనాల్డ్ ట్రంప్‌కు తత్వం తలకెక్కుతోందా! ప్రపంచ దేశాలతో రాజీకి వస్తున్నాడా!! మూడు నెలల పాటు తాను ప్రకటించిన పన్నుల యుద్ధాన్ని వాయిదా వేస్తున్నట్లు చేసిన ప్రకటన దేనికి సూచిక? గతంలో మాదిరి ఈసారి కూడా చైనా మీద ఏదో ఒక సాకుతో వాయిదా లేదా సుంకాల తగ్గింపు చర్యలకు పాల్పడే అవకాశాలు లేకపోలేదు. ప్రపంచ మార్కెట్ల మీద చైనా ఎలాంటి గౌరవం ప్రదర్శించని కారణంగా 125 శాతం విధిస్తున్నట్లు, దాని మీద ఎలాంటి సంప్రదింపులు ఉండవని ట్రంప్ చెప్పటం మేకపోతు గాంభీర్యం తప్ప మరొకటి కాదు. యావత్ ప్రపంచం మీద పన్ను పోరు ప్రకటించిన అతగాడి నిర్వాకం కారణంగా స్టాక్‌మార్కెట్లు పతనమయ్యాయన్నది తెలిసిందే. మూడు నెలల వాయిదా గురించి కొద్ది రోజుల క్రితమే సామాజిక మాధ్యమంలో వచ్చిన వార్తలను ట్రంప్ యంత్రాంగం తోసి పుచ్చింది. మూడు నెలల వాయిదా ప్రకటనతో ప్రపంచ వ్యాపితంగా స్టాక్‌మార్కెట్లు కోలుకున్నాయి. చిత్రం ఏమిటంటే చైనా మీద విధించిన 125 శాతంపై వెనక్కు తగ్గేది లేదన్న తరువాత కూడా చైనా స్టాక్ మార్కెట్లు మిగతా వాటితో పాటు గురువారం నాడు పెరిగాయి. ఈ పూర్వరంగంలో చైనా మీద ప్రతి సుంకాలు ఎందుకు ప్రభావం చూపలేదు? పర్యవసానాలు ఏమిటి? అసలు ట్రంప్ ఎందుకు వెనక్కు తగ్గాడనే చర్చ, విశ్లేషణలు ప్రారంభమయ్యాయి.


మూడు నెలల వాయిదాకు దోహదం చేసిన అంశాలేమిటి? తమ మంత్రిత్వశాఖలు, వాణిజ్య ప్రతినిధితో 75 దేశాలు సంప్రదింపులు జరిపినట్లు ట్రంప్ చెప్పుకున్నాడు. రిపబ్లికన్ పార్టీ ప్రజాప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతూ మనకు ఫోన్లు చేస్తున్న దేశాల వారు ప్లీజ్ ప్లీజ్ సర్ ఒప్పందం చేసుకోండి, నేను ఏదైనా చేస్తాను అని చెబుతున్నారన్నాడు. అబద్ధాలు, గొప్పలు చెప్పటంలో ఆరితేరిన ట్రంప్ గురించి తెలిసినప్పటికీ...చైనా మాత్రం తగ్గేదేలే అని చెప్పింది. మిత్ర పక్షంగా ఉన్న ఐరోపా సమాఖ్య 23 బిలియన్ డాలర్ల మేరకు అమెరికా వస్తువుల మీద పన్ను విధించనున్నట్లు ప్రకటించింది, కెనడా కూడా అదే బాటలో ఉంది. మనం అటూ ఇటూ ఏదీ చెప్పకుండా గోడమీద పిల్లి వాటాన్ని ప్రదర్శిస్తున్నాం. ఎక్కువ పన్నులు విధించిన దేశాల నుంచి సరకులను మనదేశానికి దిగుమతి చేసుకొని వాటిని తిరిగి ఎగుమతి చేయవద్దని మన వాణిజ్య మంత్రి పియూష్ గోయల్ మన ఎగుమతిదార్లను హెచ్చరించారు. పిటిఐ వార్త మేరకు చైనా, ఇతర ఆసియన్ దేశాల సరకులను మన దేశం నుంచి ఎగుమతి చేయవద్దని చెప్పారట. అలా జరుగుతోందని గతంలో ఎన్నడూ మన ప్రభుత్వం చెప్పలేదు. ఇప్పుడు అలా మాట్లాడారంటే ఎవరి మెప్పు పొందేందుకో అర్థం చేసుకోవచ్చు. ఇక్కడ మరో సందేహం కూడా తలెత్తుతోంది. గతంలో అలా చేసి ఉంటే అసలు నిజంగా మన ఎగుమతులు పెంచామని బిజెపి పాలకులు కొట్టుకుంటున్న డబ్బా మీదనే అనుమానం వస్తోంది.

అసలు పన్నుల వాయిదా నిర్ణయానికి దారితీసిందేమిటి? మొదటి కారణంగా చెప్పుకోవాలంటే ఏప్రిల్ ఐదున 150 సంస్థల పిలుపు మేరకు 20 లక్షల మంది జనం నిరసన ప్రదర్శనలు చేశారు. వెనక్కు తగ్గకపోతే మరింత పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. తొలుత మద్దతు ప్రకటించిన ద్రవ్య పెట్టుబడిదారులు, ఇతరులు కూడా పర్యవసానాలను చూసి వైఖరి మార్చుకుంటున్నారు. ఒక్కరంటే ఒక్క ఆర్థికవేత్త కూడా సానుకూలంగా మాట్లాడిన ఉదంతం లేదు. ట్రంప్ అధికారానికి వచ్చిన తరువాత భారీగా పెరుగుతుందని ఆశించిన ఎలన్ మస్క్ సంపద ఇప్పటి వరకు 135 బిలియన్ డాలర్లు హరించుకుపోయింది. చైనా సహా ఎవరి మీదా పన్నులు వేయవద్దని, పునరాలోచించాలని ట్రంప్‌ను మస్క్ గట్టిగా కోరినట్లు వాషింగ్టన్ పోస్టు పత్రిక రాసింది. చైనా వెనక్కు తగ్గకపోగా ఐరోపా సమాఖ్య కూడా ప్రతిఘటనకు పిలుపు ఇచ్చింది. పన్నుల విధింపులో కీలక పాత్ర పోషించిన సలహాదారు పీటర్ నవారో, మరో కీలక సలహాదారు ఎలాన్ మస్క్ వీధులకెక్కి విమర్శించుకుంటున్నారు. ఈ పరిణామాలతో గోడ మీద పిల్లులు కూడా వ్యతిరేక శిబిరంలో చేరే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. స్వదేశంలో పెట్టుబడులు పెట్టి వస్తూత్పత్తి చేయాలన్న పిలుపుకు పెద్ద స్పందన కనిపించటం లేదు. మూడు నెలల కాలంలో లొంగుబాటును ప్రదర్శించే దేశాల మీద కొన్ని ఒప్పందాలను రుద్ది లబ్ధి పొందే ఎత్తుగడ కూడా దీని వెనుక ఉండవచ్చు. ఈ వ్యవహారం కూడా త్వరలోనే బట్టబయలు కానుంది, ఎవరు ఎలా స్పందిస్తారో తెలియదు. ఒకడుగు వెనక్కు వేసిన ట్రంప్‌ను దారికి తేవాలంటే అమెరికన్లు మరింతగా వీధుల్లోకి రావాలి. బాధిత దేశాలన్నీ సమైక్యం కావాల్సిన అవసరం ఉంది. పోరాడే వారే కాదు, జయచంద్రులు కూడా ఉన్నారు. ద్రోహానికి పాల్పడిన జయచంద్రను ఉపయోగించుకున్న వారే చివరికి హతమార్చారన్న కథ పునరావృతం అవుతుందా? చూద్దాం!

/ ఫీచర్స్ అండ్ పాలిటిక్స్ /

సెటైర్

నీ స్మార్ట్ మీటర్ ఒకసారి బిగించారా..! జనాల జేబులకు చిల్లులే..! ఈ ప్రైవేటు విద్యుత్ పంపిణీ సంస్థలు ఏ అర్ధరాత్రి ఎంత కరెంటు చార్జీలు పెంచుతాయో తెలియదు. ఈ మీటరుకు 9 వేలు నుండి 13 వేల రూపాయల వరకు నెలవారీ బిల్లులో ప్రజలే చెల్లించాలి..! నిపుణులు చెబుతున్నట్లు ఈ స్మార్ట్‌మీటర్ల వల్ల మన ఆధార్, ఫోన్ నెంబర్లతో లింక్ పెట్టడం వల్ల వ్యక్తిగత గోప్యతకు ముప్పు, వీటిని ఎవరైనా హ్యాకింగ్ చేసి మన కరెంటు చోరీ చేసే అవకాశాలున్నాయి. ఈ మీటర్‌తో వచ్చే రేడియేషన్ ఫ్రీక్వెన్సీ వల్ల ఆరోగ్య సమస్యలు వస్తాయి...!



ఇ'స్మార్ట్' బాగోతం...!

వచ్చేస్తున్నా .. మీ రాష్ట్రంలోకి వచ్చేశా.. మీ ఊళ్లోకి...మీ ఇంట్లోకి వచ్చేస్తున్నా..! అంటూ తెగ సంబరపడుతూ గంతులేసుకుని ఓ ఇంటికొచ్చిన కరెంట్ 'స్మార్ట్ మీటర్'తో...., ఆగాగు.. నీకంటే ముందే నేను ఇక్కడ ఉన్నాను. నీకంత సీను లేదు అన్నది 'పాత కరెంటు మీటరు'.

నన్ను ఆపడానికి నీకు కాదు కదా? ఆ పైవాడికి కూడా సాధ్యం కాదు, నన్ను ఏరి కోరి మన దేశానికి, రాష్ట్రానికి తెచ్చుకుంటే మధ్యలో నీ గోల ఏంటి..! అన్నది స్మార్ట్‌మీటర్.

నా కంటే నీ గొప్ప ఏంటి..? ప్రశ్నించింది పాత మీటర్..? అలా అడుగు..నా గొప్పేంటో చెబుతాను. నేను అదాని (అదాని ఎనర్జీ సొల్యూషన్స్ లిమిటెడ్) దత్త పుత్రికను, నేను న్యూ టెక్నాలజీతో చిప్ ఆధారంగా పనిచేస్తాను. రియల్ టైమ్ డేటా ఇస్తాను. దాన్ని బట్టి టైమ్ ఆఫ్ డే బిల్లింగ్ (ఏ సమయంలో కరెంటు ఎక్కువ వాడుతున్నారో ఆ సమయంలో కరెంటు రేట్లు పెంచుకోవచ్చు), ఇంట్లో ఏ వస్తువుకు ఎంత కరెంట్ వాడుతున్నారో డేటా ఇస్తాను. నా రీడింగ్ తీయడానికి మీటర్ రీడర్లు అవసరం లేదు, నన్ను ముందుగా మీ మొబైల్ ద్వారా రీచార్జ్ చేసుకోవాలి...! బిల్లు కట్టకపోతే ఫీజు పీకాల్సిన పనిలేదు, దానంతట అదే కరెంట్ ఆగిపోతుంది! అన్నిటికంటే సామాన్యులకు కునుకు లేకుండా చేస్తాను. నా కార్పొరేట్ సామ్రాట్‌కు కోట్లు కురిపిస్తాను..! నన్ను ఇప్పటికే అమెరికా, కెనడా, జపాన్ తదితర పెద్ద పెద్ద దేశాల్లో వాడుతున్నారు..! ఇంతకంటే నా గొప్ప ఇంకేం చెప్పాలి అన్నది స్మార్ట్‌మీటర్..!

ఓహో..నువ్వు ఆ సెకీ ఒప్పందంలో లంచమిచ్చి అమెరికా కోర్టులో అడ్డంగా దొరికిపోయిన అదాని పుత్రికవా..! నీ అదాని కహానీ నా దగ్గర చెప్పకు. ఇప్పటికే దేశంలో వనరుల్ని అప్పనంగా దోచుకుని అపర కుబేరుడైన మీ సారు... మన మోడీ సారుకు మంచి స్నేహితుడేగా... అందుకే నీకు ఈ ధైర్యం...! అన్నది పాతమీటరు.

మా అదానీ సారుకు తిరుగే లేదు... ఎన్ని కేసులున్నా...ఎన్ని ఆరోపణలున్నా.. చూసుకోవడానికి మహామహులు పైనున్నారు. అందుకే నీలాంటి పాతమీటర్లు బాగానే పని చేస్తున్నా... రివాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీం (ఆర్‌డిఎస్‌ఎస్) ద్వారా దేశంలో 20 కోట్లు, రాష్ట్రంలో సుమారు 2 కోట్లు స్మార్ట్ మీటర్లు బిగించడానికి మా అదానీ సారుకే కాంట్రాక్టు ఇచ్చారు. ఇదేమైనా ఇప్పటి ఒప్పందం అనుకుంటున్నావా..! గతంలో జగన్ సారు ఉన్నప్పుడే వ్యవసాయ పంపుసెంట్లకు స్మార్ట్ మీటర్లు బిగించడం ప్రారంభించారు అన్నది 'స్మార్ట్ మీటర్'.

అప్పుడే కదా..బాబుగారి సన్ లోకేష్ బాబు నిన్ను ఎక్కడైనా బిగిస్తే పగలగొట్టమని చెప్పారు. గుర్తు లేదా?అని ఎదురు ప్రశ్న వేసింది పాత మీటర్..!

అప్పుడు పగులగొట్టమన్న సారే... ఇప్పుడు మొత్తం విద్యుత్ కనెక్షన్లన్నీ ఇళ్లతో సహా నాతో (స్మార్ట్‌మీటర్)నే నింపమని 3,713 కోట్లతో, వీటి తయారీ, సరఫరా, ఏర్పాటు, నిర్వహణ అన్నీ మా అదాని సారుతోనే రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది అన్నది స్మార్ట్‌మీటర్..! అవునవును..? వీటిలో కూడా బోలెడంత అవకతవకలు జరిగాయని, అదాని సోలార్ ఎనర్జీ సెకీ ఒప్పందంలో జగన్ ప్రభుత్వంపై వచ్చిన అవినీతి ఆరోపణల్ని నేడు బాబు గారు కూడా ఎక్కడా నోరు మెదపకుండా ఉండిపోయారని లోకం కోడై కూస్తున్నది నీకు తెలియదా...అన్నది 'పాత మీటర్'!

ఇంతకీ నన్ను ఎందుకు వద్దంటున్నావో తెలుసుకోవచ్చా... అన్నది స్మార్ట్‌మీటర్..!

నీలాంటి స్మార్ట్‌మీటర్లు మన లాంటి దేశాలకు ఇంకా అవసరం లేదు. ఎందుకంటే దేశంలో కరెంటంతా మీ అదాని సారు లాంటి ప్రైవేటు వారి చేతుల్లోకి పోయి, ప్రభుత్వ థర్మల్ విద్యుత్‌ను నిర్వీర్యం చేసి, అవసరం లేకపోయినా అధిక రేట్లుకు కరెంట్ కొనడానికి మీ అదాని లాంటి సంస్థలతో ఒప్పందాలు చేసుకుని ప్రజలపై ఆ రేట్లు భారాన్ని రుద్దుతున్నారు. అందులో భాగంగానే సెకీ ఒప్పందంలో 2 వేల కోట్లు అవినీతి జరిగిందని జగమెరిగిన సత్యం..! ఆ అమెరికా కోర్టు కేసుతో మన పక్కనే ఉన్న శ్రీలంక, బంగ్లాదేశ్, కెన్యా, లాంటి దేశాలు మీ అదాని సారుతో జరిగిన ఒప్పందాలు రద్దు చేసుకున్నాయి. వాళ్లకున్న తెలివి కూడా మన వాళ్లకు లేకపాయే..! మన దేశంలో తన మిత్రుడికి ఎటువంటి నష్టం కలుగకుండా అక్కడ మోడీ సారూ... ఇక్కడ బాబుగారు ఇద్దరూ ఆ ఒప్పందాల్ని కొనసాగిస్తున్నారు అన్నది.. పాత మీటరు.


నీ స్మార్ట్ మీటర్ ఒకసారి బిగించారా..! జనాల జేబులకు చిల్లులే..! ఈ ప్రైవేటు విద్యుత్ పంపిణీ సంస్థలు ఏ అర్ధరాత్రి ఎంత కరెంటు చార్జీలు పెంచుతాయో తెలియదు. ఈ మీటరుకు 9 వేలు నుండి 13 వేల రూపాయల వరకు నెలవారీ బిల్లులో ప్రజలే చెల్లించాలి..! నిపుణులు చెబుతున్నట్లు ఈ స్మార్ట్‌మీటర్ల వల్ల మన ఆధార్, ఫోన్ నెంబర్లతో లింక్ పెట్టడం వల్ల వ్యక్తిగత గోప్యతకు ముప్పు, వీటిని ఎవరైనా హ్యాకింగ్ చేసి మన కరెంటు చోరీ చేసే అవకాశాలున్నాయి. ఈ మీటర్‌తో వచ్చే రేడియేషన్ ఫ్రీక్వెన్సీ వల్ల ఆరోగ్య సమస్యలు వస్తాయి...! ఈ స్మార్ట్‌మీటర్లు బిగించిన చోట్ల మీటర్లు గిర్రున తిరుగుతూ వందల్లో వచ్చే బిల్లులు వేలల్లోకి వెళ్లిపోయిన ఘటనలు అప్పుడే చూస్తున్నాం..! దీనిలో పెద్ద కుంభకోణం ఏమిటంటే.. ఇది ప్రజల అవసరం కోసం కాదు. అదానీ లాంటి కార్పొరేట్ సంస్థలకు లబ్ధి చేకూర్చడానికి, కరెంటు పెత్తనమంతా ప్రైవేటు వాళ్లకే అప్పజెప్పడానికే ఈ స్మార్ట్ మీటర్లు తెస్తున్నారు. అందుకే ఆ మోడీ సారు విద్యుత్ బిల్లు -2020ని తెచ్చి ప్రజలపై రుద్దారు..! ఇప్పటి వరకు పనిచేస్తున్న మీటర్ రీడర్లు వేలాది మందికి ఉన్న ఉపాధి పోయి రోడ్డున పడుతున్నారు. అనేక దేశాల్లో ఈ మీటర్లను వ్యతిరేకిస్తున్నారు. మన దేశంలో కూడా యు.పి. లాంటి చోట్ల వ్యవసాయానికి బిగించిన స్మార్ట్ మీటర్లు పీకి ప్రభుత్వ కార్యాలయాల్లో పడేసి నిరసనలు తెలిపారు. భవిష్యత్‌లో రైతులకిచ్చే ఉచిత కరెంట్‌కు, ఇతర సబ్సిడీలకు మంగళం పాడినట్లే..! ఇప్పటికే ప్రజలు గతంలో ఎప్పుడో వాడిన కరెంటుకు ట్రూ అప్, సర్ చార్జీల పేరుతో వాడిన కరెంటు కంటే ట్యాక్సులే ఎక్కువ కట్టాల్సి వస్తోంది. చిన్నా, చితక వ్యాపారాలు, పరిశ్రమలు ఈ బిల్లులు భరించలేక మూతబడి ఉన్న ఉద్యోగాలు పోతాయి..! నీ స్మార్ట్‌మీటర్ దెబ్బకు ఇది మరింత భారమై ప్రజలు మళ్లీ గుడ్డి దీపాలతో ఉండాల్సి వస్తుంది..! గ్రామాల్లో, పట్టణాల్లో ఈ బిల్లులు చెల్లించలేక ఉన్న వీధి లైట్లు పోయి చీకట్లో మగ్గాల్సి వస్తుంది...! కాబట్టి నీ లాంటి స్మార్ట్ మీటర్లు ఎవరి ప్రయోజనాల కోసం వచ్చాయో... వాటి వల్ల వచ్చే ప్రమాదాలేమిటో... స్మార్ట్‌మీటర్లు వద్దేవద్దని ఆ కమ్యూనిస్టులు ఇప్పటికే పెద్ద పోరాటం చేస్తున్నారు. నీ ఇ'స్మార్ట్' బాగోతం బయట పడడం ఖాయం.. అన్నది పాత మీటర్...!

అబ్బా అనవసరంగా దీన్ని గెలికాను అని గొణుక్కుంటూ సైలెంట్ అయ్యింది స్మార్ట్ మీటర్!

- వి.వి.శ్రీనివాసరావు,
సెల్: 9490098799

సందర్భం

మహనీయుల స్ఫూర్తితో కులవివక్షను తరిమికొడదాం



మహనీయులైన పూలే, అంబేద్కర్ జయంతి, వర్ధంతుల సందర్భంగా దండలేసి దండాలు పెట్టి వారి ఆశయాలు నెరవేర్చినట్టు భావిస్తుంటారు కొందరు. కానీ పూలే, అంబేద్కర్ లు తమ వ్యక్తిగత జీవితంలో అనుభవించిన కుల వివక్షను పారదోలటానికి ప్రత్యక్ష ప్రతిఘటనా ఉద్యమాలు నిర్మించారు. వారి అడుగుజాడల్లో పయనిస్తున్న కె.వి.పి.ఎస్...మన సమాజంలో నేటికీ కొనసాగుతున్న కులవివక్షపై ప్రత్యక్ష ప్రతిఘటనా ఉద్యమాలకు శ్రీకారం చుట్టింది. ఏప్రిల్ 11 నుండి 14వ తేదీ వరకు మహనీయులు పూలే, అంబేద్కర్‌ల స్ఫూర్తితో ... క్షేత్ర స్థాయిలో కుల వివక్షపై సమగ్ర సర్వేలు చేయాలని నిర్ణయించింది. ప్రత్యక్ష పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చింది.

కుల వివక్ష ఇప్పుడు ఎక్కడ ఉంది? ఇప్పుడంతా మారిపోయింది. అందరూ కలిసి తింటున్నారు, కలిసి తిరుగుతున్నారు, హోటళ్లలో, జాతరల్లో, ఉత్సవాల్లో అన్నింట్లో కలిసే ఉంటున్నారు. ఇంకా వివక్ష ఎక్కడుంది? ఈ మధ్య కాలంలో ఇలాంటి వాదనలు, మాటలు తరచూ మనువాదుల నుండి వినిపిస్తున్నాయి. మోడీ పాలనలో దేశం చాలా మారిందంటున్నారు. వివక్ష లేనే లేదంటున్నారు. కానీ...నేటికీ నిచ్చెన మెట్ల కులజాఢ్యం అణగారిన ప్రజల్ని పట్టి పీడిస్తూనే ఉంది.

మాల, మాదిగ పల్లెల్లో ప్రత్యక్షంగా, పట్టణాల్లో పరోక్షంగా కనిపిస్తూనే ఉంది. అయితే గతంలో ఉన్నంత మొరటుగా ఇప్పుడు లేకపోవచ్చు కానీ, తీవ్రమైన కులవివక్ష రూపం మార్చుకుని మరో రూపంలో కొనసాగుతున్నది. శాస్త్ర, సాంకేతిక రంగం ఇంత అభివృద్ధి చెంది మంచి ఫలితాలు సాధిస్తుంటే ఇదేం కులవివక్ష అనుకోవచ్చు. స్వాతంత్ర్యం రాకముందు, వచ్చిన తర్వాత కొనసాగడానికి అగ్రవర్ణాల ఆధిపత్యంతో నడిచే పాలక వర్గ ప్రభుత్వాలే కారణం అని చెప్పవచ్చు.

మన రాష్ట్రంలోనూ దళితులపై దుర్మార్గమైన దాడులు, దౌర్జన్యాలు, లైంగిక దాడులు, అత్యాచారాలు ఎక్కువగా జరుగుతున్నాయని జాతీయ నేర విభాగం నివేదికలు తెలుపుతున్నాయి.



అంద్ర మాల్యాద్రి

వివిధ సందర్భాల్లో కుల వివక్ష బయట పడుతుంటుంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో గ్రామాల్లో నేటికీ రచ్చ బండల మీద కూర్చోనీయకపోవడం, రాయలసీమ ప్రాంతంలో పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వంటలపై వివక్ష పాటించడం, ఎక్కువ ప్రాంతాల్లో గుడిలోకి రానీయకపోవడం, హోటళ్లలో రెండు గ్లాసుల పద్ధతి వంటి అనేక పలు ఇతర రూపాల్లో కులవివక్ష కొనసాగుతున్నది. చదువుకున్న ఉద్యోగులపైనా కులవివక్ష ప్రభావం కనిపిస్తున్నది.

నగరాల్లో శాకాహారులకు మాత్రమే ఇళ్లు అద్దెకిస్తారు. ఎస్సీ, ఎస్టీ, ముస్లిం, మైనార్టీలకు అద్దెకు ఇవ్వరు. పైగా 'శాకాహారులకు మాత్రమే ఇల్లు అద్దెకు ఇవ్వబడును' అని తమ ఇంటి గోడలు, గేట్ లకు బోర్డులు పెడుతున్నారు.

అమలుకు నోచుకోని పున్నయ్య కమిషన్ నివేదిక

నేటికీ జస్టిస్ పున్నయ్య సిఫారసులు అమలు కావడంలేదు. కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కె.వి.పి.ఎస్) ఉమ్మడి రాష్ట్రంలో వేలాది మంది కార్యకర్తలతో సుమారు మూడు వేల గ్రామాల్లో సామాజిక, ఆర్థిక, రాజకీయ సమస్యలుపై సర్వే చేసింది. వచ్చిన అనేక సామాజిక సమస్యలు, అంటరానితనం, కులవివక్ష, రెండు గ్లాసుల పద్ధతిపై అనేక పోరాటాలను గ్రామాల్లో ప్రత్యక్షంగా నిర్వహించింది. దీనికి తోడు అసెంబ్లీ లోపల ఎమ్మెల్యేలు పట్టుబట్టడం వల్ల నాటి చంద్రబాబు ప్రభుత్వం దిగొచ్చి హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ పున్నయ్యతో ఎస్సీ, ఎస్టీ ఏక సభ్య కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఇది కె.వి.పి.ఎస్ సాధించిన మొదటి విజయం.

జస్టిస్ పున్నయ్య కమిషన్ రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి 164 రకాల కులవివక్ష రూపాలను గుర్తించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. పరిష్కారం కోసం సూచనలు చేసింది. కమిషన్ ఏర్పాటు చేసిన పాలకులు ఆ సూచనలను చిత్తశుద్ధితో అమలు చేయాలి కదా! నేటికీ పున్నయ్య సిఫారసు చేసిన నలభై అంశాల్ని సర్కార్ పట్టించుకోవడం లేదు. ఫలితంగా ఇప్పటికీ కులవివక్ష రూపాలు కొనసాగుతున్నాయి.

వారంలో ఒకరోజు ప్రభుత్వ అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు కుల వివక్షను గుర్తించి దాన్ని రూపుమాపడానికి ప్రయత్నించాలని పున్నయ్య కమిషన్ ప్రధానంగా సిఫారసు చేసింది. కానీ ఎక్కడా ఆ సిఫారసు అమలుకు నోచుకోవటం లేదు. 1955 పౌర హక్కుల పరిరక్షణ చట్టం ప్రకారం ప్రతి నెలా చివరి రోజు కులవివక్ష, అంటరానితనంపై చైతన్య సదస్సులు నిర్వహించాలని పేర్కొన్నది. కానీ దాన్ని కూడా ఎక్కడా అమలు జరపటం లేదు. దళితులపై దాడులు, దౌర్జన్యాలు జరిగిన సందర్భంలో ఏకైక రక్షణ కవచంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టాన్ని పూర్తిగా నీరుగారుస్తున్నది. 41 సి.ఆర్.పి.సి కింద స్టేషన్ బెయిలిస్తూ దాడులు మరింతగా పెంచడానికి ఊతమిచ్చే విధంగా వ్యవహరిస్తున్నది.

మనువాదంతో పెరుగుతున్న కులవివక్ష

ఆరెస్సెస్-బిజెపి మనువాద మతోన్మాద విధానాలు పల్లె వాతావరణాన్ని చెదరగొడుతున్నాయి. కులవివక్ష, అంటరానితనాన్ని మరింతగా పెంచి పోషిస్తున్నాయి. చిన్నజీయర్‌స్వామి లాంటి ఆధ్యాత్మికవేత్త 'కులం ఉండాల్సిందే, కులం పోకూడదు. ఒక మనిషి శరీరానికి కాళ్లు చేతులు ఎంత అవసరమో, దేశానికి కులాలు అంత అవసరం' అని ప్రబోధిస్తున్నారు. గ్రామ సీమల్లో దళితులు అంబేద్కర్ విగ్రహాలు నెలకొల్పడానికి ప్రయత్నిస్తే పోటీగా ఆరెస్సెస్ ఇతరులను రెచ్చగొట్టి, ఇతర నాయకుల విగ్రహాలను పెట్టి ప్రజల మధ్య ఘర్షణలను సృష్టించి కులాల కుంపటిని రగలించి రాజకీయాలు నడుపుతున్నది. 'కుల వివక్షత, అంటరానితనం, నేరం. చట్ట విరుద్ధం' అని భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 15 పేర్కొంటున్నాయి. కానీ ప్రజా ప్రతినిధులుగా ఎన్నికై రాజ్యాంగంపై ప్రమాణం చేసినవారు కుల వివక్ష రూపుమాపడానికి ఎటువంటి ప్రయత్నం చేయకపోగా పరోక్షంగా దాన్ని బలపరుస్తున్నారు.


కులవివక్షపై కె.వి.పి.ఎస్ ఉద్యమం

మహనీయులైన పూలే, అంబేద్కర్ జయంతి, వర్ధంతుల సందర్భంగా దండలేసి దండాలు పెట్టి వారి ఆశయాలు నెరవేర్చినట్టు భావిస్తుంటారు కొందరు. కానీ పూలే, అంబేద్కర్‌లు తమ వ్యక్తిగత జీవితంలో అనుభవించిన కుల వివక్షను పారదోలటానికి ప్రత్యక్ష ప్రతిఘటనా ఉద్యమాలను నిర్మించారు. వారి అడుగుజాడల్లో పయనిస్తున్న కె.వి.పి.ఎస్...మన సమాజంలో నేటికీ కొనసాగుతున్న కుల వివక్షపై ప్రత్యక్ష ప్రతిఘటనా ఉద్యమాలకు శ్రీకారం చుట్టింది. ఏప్రిల్ 11 నుండి 14వ తేదీ వరకు మహనీయులు పూలే, అంబేద్కర్‌ల స్ఫూర్తితో...క్షేత్ర స్థాయిలో కుల వివక్షపై సమగ్ర సర్వేలు చేయాలని నిర్ణయించింది. ప్రత్యక్ష పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చింది.

సమాజ హితం కోరుకునే వ్యక్తులు, శక్తులు, ప్రజాసంఘాలు, సామాజిక సంఘాలు, రాజకీయ పార్టీలు స్వచ్ఛందంగా సంపూర్ణంగా మద్దతు తెలియజేస్తూ ఈ ఉద్యమాల్లో భాగస్వాములు కావాలని కె.వి.పి.ఎస్ పిలుపునిస్తోంది. చాప కింద నీరులా సాగుతున్న మనువాద సంస్కృతి, కుల వివక్ష, అంటరానితనం పూర్తిగా రూపుమాపబడాలంటే ప్రజలు ఐక్యంగా పూనుకోవాలి. కులవివక్షను ప్రతిఘటించి పారదోలాలి.

/ వ్యాసకర్త కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కె.వి.పి.ఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సెల్ : 9490300366 /

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ : editpageps @gmail.com



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తదితరులు

'యనమల'తోనే రాజకీయాల్లో కీలక సంస్కరణలు

- అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి - తుని(కాకినాడ జిల్లా).

రాజకీయాల్లో కీలక సంస్కరణ రూపొందించిన ఘనుడు యనమల రామకృష్ణుడు అని అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. కాకినాడ జిల్లా తునిలోని సాయి వేదికలో 'యనమల రామకృష్ణుడు 42 వసంతాల రాజకీయ ప్రస్తావన' పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం గురువారం జరిగింది. తుని ఎమ్మెల్యే యనమల దివ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో స్పీకర్ ముఖ్య అతిథిగా హాజరై పుస్తకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యనమల రామకృష్ణుడు తెలుగుదేశం పార్టీలో కీయాశీలక పాత్ర పోషించారని తెలిపారు.

మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ పార్టీ కష్ట కాలంలో ఉన్నప్పుడు యనమల కీలకంగా వ్యవహరించారన్నారు. స్పీకర్‌గా, ఆర్థిక శాఖ మంత్రిగా సేవలందించారని తెలిపారు. హోం మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ మూడు రాజధానుల నిర్మాణం సరైందికాదని, దాని అడ్డగించడంలో యనమల కీలకపాత్ర పోషించారని గుర్తు చేశారు. అనంతరం యనమల రామకృష్ణుడిని గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, ఎంపి సానా సతీష్, ఎమ్మెల్యేలు నిమ్మకాయల చినరాజప్ప, వనమాడి కొండబాబు, బుచ్చియ్య చౌదరి, పంతం నానాజీ తదితరులు పాల్గొన్నారు.

ఆక్వా రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలి

- ఎపి కౌలురైతు సంఘం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అమెరికా అధ్యక్షులు డోనాల్డ్‌ట్రంప్ విధానాల ఫలితంగా దేశంలో ప్రత్యేకించి రాష్ట్రంలో రొయ్యలు సాగు చేస్తున్న రైతులు, కౌలు రైతులు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని ఆక్వా రైతులను కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్రకమిటీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆక్వా రైతులు ఎగుమతి చేసే ప్రతి రూ.100లో రూ.36లు పన్నుల రూపంలో కట్టాలని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆక్వాసాగులో కూడా రాష్ట్రంలో 40 శాతం కౌలుదారులు ఉన్నారన్నారు. ఆక్వా రంగంలో పోటీదారు దేశాలైన ఈక్వెడార్, ఇండోనేషియో వంటి దేశాలపై అమెరికా ఎలాంటి సుంకాలు విధించలేదని, ఫలితంగా ఉత్పత్తి, పోటీరంగంలో మన దేశం వెనుకబడి పోతుందన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాట్లాడకపోవడం దారుణమని హరిబాబు పేర్కొన్నారు, ప్రభుత్వం తక్షణమే ఆక్వా రైతులను ఆదుకోవాలని, కనీసమద్దతు ధర ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పోసానిపై ఆ సెక్షన్ ఎలా పెడతారు?

- సూళ్లూరుపేట ఇన్‌స్పెక్టర్ చర్యపై హైకోర్టు ఆగ్రహం

ప్రజాశక్తి, అమరావతి

నటుడు పోసాని మురళీకృష్ణపై సూళ్లూరుపేట ఇన్స్పెక్టర్ ఉద్దేశపూర్వకంగానే కేసు నమోదు చేసి కోర్టు ధిక్కారానికి పాల్పడ్డారని హైకోర్టు ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. మీపై కోర్టుధిక్కార చర్యలు ఎందుకు తీసుకోరాదో చెప్పాలని ఇన్‌స్పెక్టర్‌కు ఫాం 1 నోటీసులు జారీ చేసింది. విచారణను ఈ నెల 25కి వాయిదా వేసింది. అప్పటి వరకు పోసానిపై కేసులో తదుపరి చర్యలన్నీ నిలుపుదల చేస్తూ గురువారం మధ్యంతర ఉత్తర్వులను జారీ చేసింది. సోషల్ మీడియా పోస్టులను వ్యవస్థీకృత నేరంగా పరిగణిస్తూ బిఎన్ఎస్ సెక్షన్ 111 కింద కేసు నమోదు చేయడంపై మండిపడింది. తమ ఆదేశాలున్నా కూడా పోసానిపై అదనపు సెక్షన్లు నమోదు చేయడాన్ని ఆక్షేపించింది. అరుదుగా వినియోగించాల్సిన సెక్షన్ 111ను ఎలా అమలు చేస్తారని తిరుపతి జిల్లా, సూళ్లురుపేట ఇన్స్పెక్టర్‌ను నిలదీసింది. మీపై కోర్టు ధిక్కార చర్యలు ఎందుకు తీసుకోరాదో స్వయంగా తమ ముందు హాజరై వివరణ ఇవ్వాలని ఆదేశిస్తూ జస్టిస్ నూనెపల్లి హరినాథ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. టిటిడి ఛైర్మన్, టివి 5 యజమాని బొల్లినేని రాజగోపాల్ నాయుడుని పోసాని దూషించారంటూ టీవీ 5 ఉద్యోగి బొజ్జా సుధాకర్ గత ఏడాది సూళ్లూరుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసులో పోలీసులు పోసానికి సెక్షన్ 35(3) కింద జారీ చేసిన నోటీసుల్లోని సెక్షన్లే కాకుండా బీఎన్ఎస్ సెక్షన్ 111తో పాటు పలు ఇతర సెక్షన్లను జత చేయడంపై ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు.

అప్పుడు మీరేంచేశారు..?

- మద్యం అవినీతి నిగ్గుతేలుస్తాం : మంత్రి రవీంద్ర

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి



అనంతపురంలో ఐఎంఎఫ్‌ఎల్ డిపోను ప్రారంభిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

అధికారంలో ఉండగా మీరేమి చేశారో గుర్తులేదా, వైసిపి ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారిని ఎంత మందిపై తప్పుడు కేసులు పెట్టారో.. మర్చిపోయారా అని వైసిపి నేతలను ఎక్సైజ్, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ప్రశ్నించారు. అనంతపురం జిల్లా రూరల్ మండలం సోములదొడ్డి, సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం పాలసముద్రం వద్ద ఎక్సైజ్ డిపోల నూతన భవనాలను గురువారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలం పాపిరెడ్డిపల్లి గ్రామానికి విచ్చేసిన సందర్భంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి... పోలీసుల బట్టలూడదీస్తామన్న వ్యాఖ్యలు అత్యంత దుర్మార్గమైనవన్నారు. వారి హయాంలో పోలీసులను ఏ రకంగా ఉపయోగించుకున్నారో గుర్తుకు లేదా అని ప్రశ్నించారు. చంద్రబాబునాయుడు ఇంటిపై దాడి చేయడానికి వచ్చిన వారికి ఉద్యోగోన్నతులు, మున్సిపల్ ఛైర్మన్ పదవి ఇవ్వలేదా అని ప్రశ్నించారు. ఇన్ని దుర్మార్గాలు చేసిన వారు ఇక్కడ ఒక్క ఘటన జరిగితే దాన్ని రాజకీయం చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు.

వైసిపి హయాంలో మద్యం అమ్మకాల్లో పెద్దఎత్తున అవినీతి చోటు చేసుకుందని చెప్పారు. లక్ష కోట్ల రూపాయల వరకు డిజిటల్ లావాదేవీల్లేకుండా చెల్లింపులు జరిగాయని చెప్పారు. ఈ అవినీతిని నిగ్గుతేల్చే పనిలో ఉన్నామన్నారు. రాష్ట్రంలో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అక్రమ మద్యాన్ని అరికట్టామని చెప్పారు. ప్రభుత్వం ఆదాయం పెరిగే విధంగా అన్ని రకాల చర్యలూ తీసుకున్నట్టు వివరించారు.

క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ చట్టంలో సవరణలు అవసరం : ఐఎంఎ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో అమలవుతున్న క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ చట్టంలో కొన్ని సవరణలు తప్పనిసరిగా తీసుకురావాల్సిన అవసరం ఉందని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఎ) రాష్ట్ర అధ్యక్షులు జి.నందకిషోర్ తెలిపారు. విజయవాడలోని ఐఎంఎ రాష్ట్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... క్లినిక్, చిన్న, మధ్యతరహా ఆసుపత్రులకు (50 పడకలలోపు) ఈ చట్టం నుంచి మినహాయింపు ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ఐఎంఎ కోరిక మేరకు చాలా రాష్ట్రాల్లో 50 పడకల ఆసుపత్రులను ఈ చట్టం నుంచి మినహాయించినట్లు తెలిపారు. వైద్యులపై దాడుల విషయంలో కేంద్ర ప్రభుత్వం సూచించిన విధంగా రాష్ట్ర చట్టాల్లో సవరణలు చేయాలని కోరారు. రాష్ట్రంలో 2008 చట్టం తీసుకువచ్చారని, దీనికి మార్పులు చేయాలన్నారు. ప్రస్తుతం వైద్యం ఖరీదుగా మారడానికి ప్రభుత్వాలు విధించే పన్నులే చాలా వరకూ కారణమని తెలిపారు.

విశాఖ స్టీల్‌పై ప్రభుత్వ వైఖరిని స్పష్టం చేయాలి : సిపిఐ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విశాఖ స్టీల్ ప్లాంట్ అభివృద్ధి పట్ల రాష్ట్ర ప్రభుత్వ వైఖరి స్పష్టం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కును కాదని మిట్టల్ స్టీల్ ప్లాంట్ కోసం పాకులాడటం తగదన్నారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. అనకాపల్లిలో ఏర్పాటు చేయనున్న మిట్టల్ స్టీల్‌కు క్యాపిటివ్ మైన్స్, పోర్టు కేటాయించవాలసిందిగా పరిశ్రమల శాఖ మంత్రి టి.జి భరత్ కేంద్రాన్ని కోరడం సరైంది కాదన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ ఉద్యోగులు, కార్మికులు, ప్రజలు పెద్దఎత్తున ఉద్యమిస్తున్నప్పటికీ ప్రభుత్వాలకు పట్టకపోవడం శోచనీయమన్నారు. 32 మంది ప్రాణ త్యాగాలతో ఆంధ్రుల హక్కు విశాఖ ఉక్కుగా సాధించుకున్న ఈ ఫ్యాక్టరీని ప్రభుత్వ రంగంలో కొనసాగించకపోతే పాలకులు చరిత్ర హీనులుగా మిగిలిపోవడం కాయమన్నారు. కేంద్ర ప్రభుత్వ కుటిలయత్నాలకు రాష్ట్ర ప్రభుత్వం సై అనడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు.

పరుపుల ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదం

● విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు ● రూ.3 కోట్ల ఆస్తి నష్టం

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా పరుపులు తయారు చేసే ఫ్యాక్టరీలో ఒక్కసారిగా మంటలు చెలరేగి రూ.మూడు కోట్ల విలువైన పరుపులు దగ్ధమయ్యాయి. ఈ ఘటన దెందులూరు మండలం సోమవరప్పాడు పంచాయతీ వీరభద్రపురంలో గురువారం మధ్యాహ్నం చోటు చేసు కుంది. ఇందుకు సంబంధించిన వివరాల ప్రకారం... వీరభద్రపురం గ్రామంలో దుర్గా వైర్ అండ్ ఇంటక్స్ అనే పేరుతో సోఫాలు, పరుపులు తయారుచేసే ఫ్యాక్టరీ నిర్వహిస్తున్నారు. ఇక్కడ తయారుచేసిన సోఫాలు వివిధ ప్రాంతాలకు సరఫరా అవుతుంటాయి. ఈ క్రమంలో గురువారం మధ్యాహ్నం ఫ్యాక్టరీలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఫ్యాక్టరీలో దూది స్పాంజీల వల్ల అప్పటికే పెద్ద ఎత్తున చెలరేగాయి. దీంతో అందులో పని చేస్తున్న సిబ్బంది వెంటనే బయటకు పరుగులు తీశారు. యాజమాన్యం ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో మూడు ఫైర్ ఇంజన్లు ఘటనా స్థలానికి చేరుకుని చాలాసేపు శ్రమించి మంటలను అదుపు చేశారు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే మంటలు చెలరేగాయని అగ్నిమాపక సిబ్బంది ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. విషయం తెలుసుకున్న దెందులూరు తహశీల్దార్ బి.సుమతి ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రమాద సమయంలో లోపల ఎవరూ చిక్కుకోకుండా ఉండడంతో పెను ప్రమాదం తప్పిందని, దాదాపు రూ.మూడు కోట్ల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని ప్రాథమిక అంచనాకు వచ్చామని తెలిపారు.

'స్మార్ట్'గా బిగించేస్తున్నారు..!

● ఇప్పటికే 1.13 లక్షల మీటర్లు బిగింపు
● కొత్త మీటర్లతో పెరుగుతున్న విద్యుత్ బిల్లులు
● బెంబేలెత్తుతున్న వినియోగదారులు



ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా స్మార్ట్ దోపిడీ మొదలైంది. విడతల వారీగా విద్యుత్ వినియోగదారులకు స్మార్ట్ మీటర్లను బిగిస్తున్నారు. దీంతో పలువురికి గతంలో కంటే ఎక్కువ బిల్లులు వస్తున్నాయి. బిల్లులను చూసి వినియోగ దారులు షాక్ అవుతున్నారు. ప్రస్తుతానికి స్మార్ట్ మీటర్లకు పోస్ట్ పెయిడ్ విధానంలో బిల్లులు వసూలు చేస్తుండగా భవిష్యత్తులో ప్రీ పెయిడ్ విధానాన్ని తీసుకురానున్నారు. సెల్‌ఫోన్ మాదిరి రీఛార్జ్ చేయకుంటే ఇంటికి విద్యుత్ సరఫరా ఆగిపోతుంది. స్మార్ట్ మీటర్లు తమ పాలిట శాపంగా మారుబోతు న్నాయని వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు.. ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా 12.24 లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఈ సర్వీసులన్నీ త్వరలో స్మార్ట్ మీటర్ల కిందకు రాబోతున్నాయి. స్మార్ట్ మీటర్లను అందించే వెసులు బాటును ఆదాని గ్రూప్ సంస్థకు ప్రభుత్వం ఇచ్చినట్లు తెలిసింది. విడతలవారీగా జిల్లాలో స్మార్ట్ మీటర్లను అమలు చేసేందుకు విద్యుత్ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. మొదటి విడతగా ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాల్లో స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయగా రెండో విడతలో వ్యాపార సముదాయాలకు, పరిశ్రమలకు, వ్యవసాయ బోర్లకు విద్యుత్ స్మార్ట్ మీటర్లను బిగించే ప్రక్రియను ప్రారంభించారు. ఇప్పటివరకూ 1,13,225 స్మార్ట్ మీటర్లను బిగించారు. ఆ తరువాత మూడో విడతగా గృహాలకు ఈ స్మార్ట్ మీటర్లను పెట్టనున్నారు. ప్రస్తుతానికి స్మార్ట్ మీటర్లకు పోస్ట్‌పెయిడ్ విధానం లోనే బిల్లులు వసూలు చేస్తున్నారు. కర్నూలు 45వ వార్డులో అజీముద్దీన్‌నగర్ నివాసంలో ఉంటున్న వెల్డింగ్‌షాపు యజమాని జెఎండి ఉస్మాన్‌బాషకు పాతమీటర్లు ఉన్నప్పుడు నెలకు రూ.3380 వచ్చేది. స్మార్ట్ మీటరు బిగించాక మొదటి బిల్లు రూ.30,758 వచ్చింది. కెపాసిటర్ వాడినందుకు వచ్చింద ని విద్యుత్ అధికారులు చెబుతున్నారు. ఇంతబిల్లు ఎలా కట్టాలి తగ్గించాలని వినియోగదారుడు ఉస్మాన్‌బాష అధికా రులను కోరితే తగ్గించే అవకాశం లేదని, చెల్లించాల్సిందేనని అధికారులు చెబుతున్నారు. ఇలా ఆయనతో పాటు పలువురికి స్మార్ట్ మీటర్లు పెట్టిన తరువాత విద్యుత్ బిల్లులు అధికంగా వస్తున్నాయి. దీంతో వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో స్మార్ట్ మీటరకు ప్రీపెయిడ్ విధానాన్ని అమలు చేయనున్నారు. నిత్యం వాడే సెల్ ఫోన్ లాగే స్మార్ట్ మీటర్లకు ముందుగానే రీఛార్జ్ చేసుకోవాల్సి ఉంటుంది. రీఛార్జ్ చేసుకోవడం మరిచిపోతే కరెంట్ దానికదే కట్ అయిపోతుంది. మళ్లీ రీఛార్జ్ చేసుకుంటేనే కరెంట్ వస్తుంది. ఈ తతంగాన్ని గ్రామీణ ప్రాంతాల్లో చేసుకోలేరనే వాదనలు ప్రజల నుండి వినిపిస్తున్నాయి.

మీటర్ రీడర్లపై దెబ్బ

ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా 2.50 లక్షల స్మార్ట్ మీటర్లు పెట్టాలని ప్రభుత్వం టార్గెట్ ఇచ్చినట్లు విద్యుత్ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. స్మార్ట్ మీటర్ల వల్ల మీటర్ రీడర్ల ఉద్యోగాలకు ప్రమాదం ఏర్పడనుంది. స్మార్ట్ మీటర్ల వల్ల ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న 527 మంది మీటర్ రీడర్లు ఉపాధి కోల్పోనున్నారు.

స్మార్ట్ మీటర్లు పెట్టకుండా అడ్డుకోండి : డి.గౌస్ దేశాయ్, సిపిఎం జిల్లా కార్యదర్శి.

రాష్ట్ర ప్రభుత్వం గుట్టుచప్పుడు కాకుండా ఇళ్లకు స్మార్ట్ మీటర్లు పెట్టడం చాలా దుర్మార్గం. కర్నూలు జిల్లాలో కర్నూల్ నగరంలోని అజుముద్దీన్ నగర్ లో ఉస్మాన్ అనే వినియోగదానికి వచ్చిన బిల్లు చూస్తుంటే ప్రజలు రాబోయే కాలంలో కరెంటు వదిలేసి మళ్లీ బుడ్డి దీపాలకు వెళ్లాల్సిన పరిస్థితి వస్తుంది. మూడు వేలు రావలసిన బిల్లు 30వేలు వచ్చిందంటే సామాన్య ప్రజలు ఎలా కట్టుకోవాలో చంద్రబాబు నాయుడు సమాధానం చెప్పాలి. గతంలో బాదుడే బాదుడు అని చెప్పిన ఈ ముఖ్యమంత్రి ఇప్పుడు ఎందుకు స్మార్ట్ మీటర్లు తెచ్చి ప్రజలపైన భారం వేస్తున్నాడు. ప్రజలు కూడా దీన్ని గమనించాలి. ఎన్నికల ముందు ఒక మాట ఎన్నికలు దాటిన తర్వాత ప్రజలపై భారాలు మోసే మాట మాట్లాడమంటేనే ఇలాంటి రాజకీయ నాయకులను రీకాల్ చేసే పద్ధతి రావాలి. ప్రజలు మేలుకోకపోతే తర్వాత బాధపడతారు. అందుకోసం స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించండి. స్మార్ట్ మీటర్లు పెట్టకుండా అడ్డుకోండి. బడా కంపెనీలు ఊడిగా చేయడం కోసమే ఈ ప్రభుత్వాలు ఉన్నాయి. సామాన్య ప్రజలకు వినియోగదారులకు మేలు చేసే ఒక్క కార్యక్రమం కూడా టిడిపి కూటమి ప్రభుత్వం చేయడం లేదు.

200 యూనిట్లపైన కాల్చే అందరికీ.. : ఈ.విజయభాస్కర్, విద్యుత్ శాఖ డిఈ.

2019-20లోనే స్మార్ట్ మీటర్లు పెట్టాలని ప్రభుత్వం నుండి ఆదేశాలు ఉన్నాయి. మోటర్లు, వాటర్ ప్లాంట్లు, వెల్డింగ్ షాపుల యజమానులు ఖచ్చితంగా కెపాసిటర్లు బిగించుకోవాలి. కెపాసిటర్లను వాడితే ఎంత ప్రయోజనమో, అంతే ప్రమాదం కూడా ఉంది. కెపాసిటర్లు పెట్టుకున్న వారు మోటర్లు ఆన్ చేసినప్పుడు ఆన్ అయ్యేటట్లు మోటారు ఆఫ్ చేస్తే ఆఫ్ అయ్యే విధంగా ఏర్పాట్లు చేసుకొని ఉంచాలి. లేనిపక్షంలో విపరీతమైన బిల్లులు వచ్చే ప్రమాదం ఉంది. 200 యూనిట్లపైగా కాల్చే వారందరికీ స్మార్ట్ మీటర్లు పెట్టాలని ఉంది. అంచలంచలుగా ప్రజల్లో అవగాహన కల్పించి స్మార్ట్ మీటర్లను పెంచాలని ప్రభుత్వము ఆలోచన.

శ్రీరామిరెడ్డి కార్మికుల వినూత్న నిరసన

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

నెలల తరబడి వేతనాలు ఇవ్వకుంటే గడ్డితిని బతకాలా అంటూ శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరా కార్మికులు అధికారులు, ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పెండింగ్ వేతనాలు, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగుతోంది. సమ్మెలో భాగంగా గురువారం ఉదయం కళ్యాణదుర్గం శ్రీరామిరెడ్డి తాగునీటి పంప్‌హౌస్ వద్ద కార్మికులు పచ్చిగడ్డి తింటూ వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అచ్యుత్ ప్రసాద్ మాట్లాడుతూ వేతనాల కోసం కార్మికులు సమ్మె చేపట్టి ఐదు రోజులు కావస్తున్నా అధికారుల్లో చలనం రావడం లేదన్నారు. వేతనాల కోసం ప్రతి నెలా కార్మికులు సమ్మె చేయాల్సిన పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వం కార్మికుల పట్ల కనకరం లేకుండా వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాలు అందక కుటుంబాలు పస్తులుండాల్సిన పరిస్థితి ఉందన్నారు. నిత్యం ఈ సమస్యపై పోరాటం చేస్తున్నా అధికారులు, ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి వెంటనే పెండింగ్ వేతనాలన్నింటినీ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి రంగనాథ్, ఎస్ఎఫ్ఐ నాయకుడు భవిత్, శ్రీరామిరెడ్డి యూనియన్ నాయకులు వన్నూరు స్వామి, పి.నరేష్, అల్లాబకాస్, చిత్తప్ప, గురుమూర్తి, జి.వెంకటేశులు, మురళి పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు 'కోవె' కృషి ప్రశంసనీయం

● చేనేత, జౌళి శాఖ కమిషనర్ రేఖా రాణి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మహిళా సాధికారతకు, వ్యాపార అభివృద్ధికి కాన్ఫెడరేషన్ ఆఫ్ ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్స్ (కోవె) చేస్తున్న కృషి ప్రశంసనీయమని చేనేత, జౌళి శాఖ కమిషనర్ రేఖా రాణి అన్నారు. కోవె ఎపి చాప్టర్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని విజయవాడలోని ఒక హోటల్ గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ... కోవె సంస్థ మహిళా వ్యాపారవేత్తల అభివృద్ధికి అందిస్తున్న తోడ్పాటులో ప్రభుత్వ సహకారం ఉంటుందన్నారు. మహిళా చేనేత కార్మికుల ఆరోగ్య పరీక్షల కోసం హెల్త్ కార్డు వంటి సదుపాయాలను కల్పించాలని సూచించారు. స్వచ్ఛాంధ్రలో భాగంగా చేనేత, టైలర్‌ల వద్ద వృద్ధాగా ఉన్న క్లాత్‌ను ఉపయోగించి సంచుల తయారీ దిశగా ప్రయత్నాలు చేస్తున్నామని, ఇందుకు అవసరమైన సామాగ్రి, యంత్రాల కొనుగోలుకు ప్రభుత్వం రాయితీ ఇస్తుందన్నారు. కోవె సంస్థ భవిష్యత్తులో చేనేత క్లస్టర్ల స్థాపనకు సహకరిస్తుందని చెప్పారు. ప్రస్తుతం 'చేనేత రథం' అనే ఉపాధి హామీ పథకంతో నేరుగా నేతన్నల నుంచి ఉత్పత్తులను వాహనాలలో నగరంలోని వీధుల్లో విక్రయాలను జరిపే కార్యక్రమం చేపట్టామని తెలిపారు. ఎపి కోవె చాప్టర్ నూతన అధ్యక్షురాలు యార్లగడ్డ గీతా శ్రీకాంత్, కార్యదర్శులుగా విజయలక్ష్మీ, జయలక్ష్మీ, కోశాధికారిగా యాళ్ల పద్మలత, ఇతర సభ్యులు ఈ సందర్భంగా ప్రమాణ స్వీకారం చేశారు. కోవె ఆంధ్ర ప్రదేశ్ చాప్టర్ నూతన అధ్యక్షురాలు యార్లగడ్డ గీతా శ్రీకాంత్ మాట్లాడుతూ... రాష్ట్రంలో మహిళా వ్యాపారవేత్తలను తయారు చేసేందుకు కోవె చర్యలు తీసుకుంటుందన్నారు. గ్రామీణ మరియు గిరిజన ప్రాంతాలలో వ్యాపార అభివృద్ధి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోవె జాతీయ కార్యదర్శి అపర్ణ, సహాయ కార్యదర్శి రాధికా, ఎంఎస్ఎంఇ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.సుదర్శన్‌బాబు, నాబార్డు డిజిఎం మురారి మోహన్ బెహరా, ఎపి ఛాంబర్ ప్రెసిడెంట్ పి.భాస్కరరావు తదితరలు పాల్గొన్నారు.

వల్లభనేని వంశీ బెయిల్ విచారణ 16కి వాయిదా

ప్రజాశక్తి, అమరావతి

గన్నవరం టిడిపి ఆఫీసుపై దాడి కేసులో తనకు బెయిల్ ఇవ్వాలంటూ వైసిపి మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ వేసిన పిటిషన్‌పై విచారణ ఈ నెల 16కి వాయిదా పడింది. ఇదే అంశంపై మరో నిందితునిపై ఎస్‌సి, ఎస్‌టి కేసు నమోదు చేయడంపై విజయవాడ ప్రత్యేక కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేసిన కేసును కూడా బెయిల్ పిటిషన్‌తో జత చేయాలని హైకోర్టు రిజిస్ట్రీని ఆదేశించింది. రెండింటినీ కలిపి విచారిస్తామని జస్టిస్ తల్లాప్రగడ మల్లికార్జునరావు గురువారం ప్రకటించారు. గన్నవరం టిడిపి ఆఫీసులో కంప్యూటర్ ఆపరేటర్‌గా చేసే సత్యవర్ధన్ చేసిన ఫిర్యాదు ఆధారంగా వంశీని పోలీసులు అరెస్టు చేశారు. దీంతో పాటు ఎస్‌సి ఎస్‌టి చట్టం కింద నమోదు చేసిన కేసులోను బెయిల్ కోసం వంశీ హైకోర్టును ఆశ్రయించారు.

భర్తను కడతేర్చిన భార్యకు జీవితఖైదు

అనంతపురం క్రైం : భర్తను హత్య చేసిన కేసులో భార్యకు జీవిత ఖైదుతో పాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ గురువారం తీర్పు వెలువడింది. వివరాల మేరకు.. యల్లనూరు మండలం శింగవరం గ్రామానికి చెందిన బత్తిని సుమకుమారిని సుమారు 17ఏళ్ల కిందట స్థానిక అశోక్‌నగర్‌కు చెందిన రాజేంద్రప్రసాద్‌కు ఇచ్చి పెళ్లి చేశారు. వీరికి ఇద్దరు కూతుర్లు ఉన్నారు. అయితే భార్య వివాహేతర సంబంధం భర్తకు తెలిసి మందలించాడు. ఈనేపథ్యంలో భర్తను అడ్డు తొలగించుకునేందుకు 02.11.2021వతేదీ రాత్రి ఇంట్లో బత్తిని సుమకుమారి తన భర్తను రోకలిబండతో కొట్టి చంపింది. మృతుని అన్న విజయ్ కుమార్ ఫిర్యాదు ఢమేరకు 02.11.2021 అప్పటి అనంతపురం1 టౌన్ సీఐ ప్రతాప్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనంతపురం అడిషనల్ 7వ సెషన్స్ జడ్జి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. ఈకేసులో జడ్జి హరిత...15 మంది సాక్షులను విచారించి నేరం రుజువైనందున గురువారం ముద్దాయికు జీవిత ఖైదు, రూ.1000 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

టిటిడికి వంద సైకిళ్లు విరాళం

ప్రజాశక్తి -తిరుమల

తిరుమల శ్రీవారికి గురువారం చెన్నైకి చెందిన మురుగప్ప గ్రూప్ టీఐ సైకిల్స్ ఆఫ్ ఇండియా సంస్థ వంద సైకిళ్లు విరాళంగా అందజేసింది. కంపెనీ ప్రతినిధులు సైకిళ్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి టిటిడి డిప్యూటి ఇఒ లోకనాథంకు అందజేశారు.

సిఎం పర్యటనకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి (ఏలూరు జిల్లా)

ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనకు అన్ని ఏర్పాట్లూ పూర్తయ్యాయని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. గురువారం ఆయన ఏలూరు జిల్లా వడ్లమాను గ్రామంలో శుక్రవారం ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, జిల్లా ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్‌తో కలిసి పరిశీలించారు.

ట్రంప్‌నకు మాంద్యం గుబులు

- 90 రోజుల పాటు సుంకాలకు విరామం
- చైనాపై 145 శాతం టారిఫ్
- బెదిరింపులకు భయపడం : చైనా
- తొందరపాటు చర్యలు తీసుకోం : భారత్
- యుఎస్ అధ్యక్షుడిపై ఇన్‌సైడర్ ట్రేడింగ్ ఆరోపణలు

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ఉన్నట్టుండి ప్రపంచ దేశాలపై వేస్తున్న సుంకాలను మూడు నెలల పాటు నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. ఈ విరామానికి ప్రధాన కారణం ఆ దేశం మాంద్యం భారిన పడనుందనే నివేదికలే. దీనికి తోడు సుంకాలను ఆపాలని పెట్టుబడిదారుల ఒత్తిడి పని చేసిందని రిపోర్టులు వస్తోన్నాయి. ట్రంప్ అధిక టారిఫ్‌లు ఈ నెల 9 నుంచే అమల్లోకి రావాల్సి ఉంది. చివరి నిమిషంలో ట్రంప్ వీటిని తాత్కాలికంగా నిలిపివేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న 46 దేశాలు, యూరోపియన్ యూనియన్‌పై సుంకాలు విధించిన తర్వాత, గ్లోబల్ మార్కెట్లలో నెలకొన్న గందరగోళం, మాంద్యం ముప్పు కారణంగా ట్రంప్ తన నిర్ణయంపై వెనక్కి తగ్గారని బ్లూమ్‌బర్గ్ ఓ రిపోర్ట్‌లో పేర్కొంది. ఎవరెన్ని చెప్పినా వెనక్కు తగ్గనని చెప్పిన ట్రంప్, చివరి నిమిషంలో టారిఫ్‌లకు బ్రేక్ వేయడం విశేషం. చైనా నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై సుంకాన్ని మాత్రం 125 శాతం నుంచి 145 శాతానికి పెంచుతున్నట్లు ట్రంప్ గురువారం ప్రకటించడం ఆందోళనకరం. మార్చి నాటికి ఈ సుంకాలు 10 శాతంగా ఉండగా.. ఇటీవల 34 శాతానికి పెంచారు. ఆ తర్వాత క్రమంగా హెచ్చించడం గమనార్హం.

పెట్టుబడిదారుల నుంచి తీవ్ర ఒత్తిడి

పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారుల నుంచి ట్రంప్‌నకు తీవ్రమైన నిరసన, ఒత్తిడి ఎదురైంది. సుంకాలు పెంచుకుంటూ వెళ్లడం స్వయంకృతాపరాధం అవుతుందని, తాను తీసిన గోతిలో తానే పడడం వంటిదని చాలా మంది నిపుణులు హెచ్చరించారు. అమెరికాలో మరో ఆర్థిక మాంద్యానికి ట్రంప్ కారణమవుతున్నారని పరిశోధనా సంస్థలు విశ్లేషించాయి. సుంకాలు పెంచుకుంటూ వెళ్లడం ఆర్థిక అణు యుద్ధంతో సమానమని పేర్కొన్నాయి. దాని పరిణామాలను అమెరికానే ఎక్కువగా భరించాల్సి వస్తుందని హెచ్చరించాయి.

అమెరికాతో తొందరపాటు లేదు
మంత్రి పియూష్ గోయల్



అమెరికాతో ప్రతిపాదిత వాణిజ్య ఒప్పందం విషయంలో తొందరపాటు చర్యలు తీసుకోవడం లేదని వాణిజ్య శాఖ మంత్రి పియూష్ గోయల్ అన్నారు. దేశానికి ప్రయోజనం కలిగే విధంగా సరైన ఫలితాలను రాబట్టేందుకు ప్రభుత్వం సంప్రదింపులు జరుపుతుందన్నారు. యుఎస్ టారిఫ్‌ల విధింపు నేపథ్యంలో ఎగుమతి సెజ్‌లు, పరిశ్రమ వర్గాలతో మంత్రి సమావేశమయ్యారు. ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం నెలకొన్న సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, అందుబాటులో ఉన్న అవకాశాలను మంత్రి వివరించారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు, సులభతర వాణిజ్యం కోసం ప్రధాని మోడి, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఫిబ్రవరిలోనే ఓ ఒప్పందం చేసుకున్నారన్నారు. దీనివల్ల ఇరు దేశాల వాణిజ్యం 500 బిలియన్ డాలర్లకు చేరుతుందని, ఇది గతంకంటే రెండున్నర రెట్లు అధికమని అన్నారు.



ఈ పరిణామాలపై చైనా దీటుగా నిలిచింది. చాలా వాణిజ్య భాగస్వామ్య దేశాలు ప్రతీకార సుంకాలు వేయకుండా చర్చల కోసం తమను సంప్రదించడంతో తాత్కాలికంగా సుంకాల చర్యలను నిలిపివేశామని ట్రంప్ పేర్కొనడం విశేషం.

చుక్కానిలా భారత్ : ఎన్ఎస్ఇ సిఇఒ చౌహాన్

అల్లకల్లోల ప్రపంచంలోనూ భారత్ చుక్కానిలా ఎదుగోతందని ఎన్ఎస్ఇ ఎమ్‌డి, సిఇఒ అశిష్ కుమార్ చౌహాన్ పేర్కొన్నారు. భారత మార్కెట్లు గరిష్ట స్థాయి నుంచి 1.5 ట్రిలియన్ డాలర్లు తగ్గినప్పటికీ.. మూలధన మార్కెట్లు దీర్ఘకాలిక వృద్ధి పథాన్ని కలిగి ఉన్నాయన్నారు. 2014లో భారత మార్కెట్ల క్యాప్ 1 ట్రిలియన్ డాలర్ల కంటే తక్కువగా ఉండగా.. ఇప్పుడు 5 ట్రిలియన్ డాలర్లకు చేరుకుందన్నారు. ఎస్ఐపి రూపంలో ప్రతి నెలా మార్కెట్లలోకి 2.5-3 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వస్తున్నాయన్నారు.

అమెరికా బెదిరింపులకు భయపడం : చైనా

అమెరికా ఆధిపత్య, బెదిరింపు ధోరణులను గట్టిగా తిప్పికొడతామని చైనా ప్రకటించింది. ఆ దేశ విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రతినిధి లీన్ జియాన్ గురువారం మీడియాతో మాట్లాడారు. 'తన సార్వభౌమాధికారం, భద్రత, అభివృద్ధి, ప్రయోజనాలను కాపాడుకోవడానికి, ముఖ్యంగా అంతర్జాతీయ న్యాయబద్ధత, న్యాయం, బహుళపక్ష వాణిజ్యం, ఉమ్మడి ప్రయోజనాలను కాపాడుకోవడానికి అవసరమైన ప్రతిఘటనా చర్యలు చైనా తీసుకుంటుంది. న్యాయబద్ధంగా ఉన్న చైనా వైఖరికి ప్రపంచవ్యాప్తంగా మద్దతు లభిస్తుంది. అమెరికా చర్యలకు ఎలాంటి మద్దతు లభించదు. చివరికి విఫలమవుతుంది' అని పేర్కొన్నారు. సుంకాలపై చర్చల్లో చైనా పాల్గొంటుందా అన్న ప్రశ్నకు చైనా వాణిజ్య మంత్రిత్వశాఖ (ఎంఒఎఫ్‌సిఒఎం) ప్రతినిధి హీ యోంగ్కియాన్ సమాధానమిస్తూ చైనా వైఖరి స్పష్టంగా, స్థిరంగా ఉందని అన్నారు. అమెరికా చర్చించాలనుకుంటే తమ తలుపులు తెరిచే ఉంటాయని, పరస్పర గౌరవం, సమానత్వం ఆధారంగా చర్చలు జరపాల్సి ఉంటుందని చెప్పారు.

అమెరికా ఉత్పత్తులపై 34 శాతం నుంచి 84 శాతానికి సుంకాలను పెంచుతామని, అమెరికా సంస్థలన్నింటినీ ఆ జాబితాలో చేర్చుతామని, డబ్ల్యుటిఒలో దావా వేస్తామని చైనా బుధవారం ప్రకటించిన సంగతి తెలిసిందే.

ఇన్‌సైడర్ ట్రేడింగ్..

అధిక టారిఫ్‌లను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ట్రంప్ ప్రకటించే ముందు సోషల్ మీడియాలో తన కంపెనీ షేర్లకు డిమాండ్ వచ్చేలా ఆయన పోస్టులు పెట్టారు. అంతా సక్రమంగా జరుగుతుందని.. అమెరికా ఇంతకుముందుతో పోలిస్తే మరింత మెరుగ్గా రాణిస్తుందని ట్రూత్ సోషల్‌లో పోస్టు పెట్టారు. కాసేపటి తర్వాత కొనుగోలు చేయడానికి ఇదే సరైన సమయమంటూ.. చివర్లో డిజెటి అని జోడించారు. ట్రంప్‌నకు చెందిన మీడియా అండ్ టెక్నాలజీ గ్రూప్ కార్పొరేషన్‌ను డిజెటిగా పిలుస్తారు. అనంతరం మార్కెట్లు భారీగా పెరగడం, ఆయన కంపెనీ షేర్లు కూడా ర్యాలీ చేశాయి. ఈ పరిణామంతో ట్రంప్ ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కు పాల్పడ్డారని లేదా మార్కెట్ అవతవకలకు పాల్పడ్డారని డెమొక్రాట్లు విమర్శించారు. దీనిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

నన్ను లక్ష్యంగా చేసుకోవడమే వారి ఉద్దేశం

- కుమార్తెపై కేసుకు సంబంధించి పినరయి విజయన్

తిరువనంతపురం : 'చట్టవిరుద్ధ చెల్లింపుల'కు సంబంధించిన కేసులో తన కుమార్తెపై సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ కార్యాలయం (ఎస్ఎఫ్ఐఒ) తీసుకుంటున్న చర్యను తాను కానీ, తన పార్టీ కానీ తీవ్రంగా పరిగణించడం లేదని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ తెలిపారు. అది తనపై ఏ విధంగానూ ప్రభావం చూపదని ఆయన స్పష్టం చేశారు. తనను లక్ష్యంగా చేసుకోవడమే వారి ఉద్దేశమని, ఆ విషయం తనకు తెలుసునని చెప్పారు. 'మీకు నా రక్తం కావాలన్న విషయం నాకు తెలుసు. కానీ దానిని మీరు అంత సులభంగా పొందలేరు' అని వ్యాఖ్యానించారు. ఎస్ఎఫ్ఐఒ కేసు కోర్టులో ఉన్నదని, దానిని చట్ట ప్రకారమే ఎదుర్కొంటామని చెప్పారు. ప్రైవేటు మైనింగ్ కంపెనీ సిఎంఆర్ఎల్ నుండి పొందిన సొమ్ముపై తన కుమార్తెకు చెందిన ఐటి సంస్థ ఆదాయపు పన్ను, జిఎస్‌టి చెల్లించిందన్న వాస్తవాన్ని మీడియా విస్మరించిందని పినరయి తెలిపారు. చట్టవిరుద్ధ చెల్లింపుల కుంభకోణం కేసులో ఇప్పటికే ఎస్ఎఫ్ఐఒ విచారణను ఎదుర్కొంటున్న పినరయి కుమార్తెపై కేసు నమోదు చేసేందుకు ఇడి సన్నాహాలు చేస్తోందని వచ్చిన వార్తల నేపథ్యంలో ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఎస్ఎఫ్ఐఒ కేసులో పినరయి కుమార్తెపై ప్రాసిక్యూషన్ చర్యలు చేపట్టేందుకు కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అనుమతి మంజూరు చేసినట్లు మీడియాలో వార్తలు వచ్చాయి.



రుతుస్రావం పేరుతో వివక్షను నిరసిస్తూ ఆందోళన చేస్తున్న విద్యార్థినులు (ఫైల్)

'రుతుస్రావం' పేరుతో మెట్లపైనే బాలికకు పరీక్ష

- కోయంబత్తూరులో ప్రైవేట్ పాఠశాల నిర్వాకం

కోయంబత్తూరు : రుతుసావ్రం జరిగిందన్న పేరుతో 8వ తరగతి బాలికను గది వెలుపల మెట్లపై కూర్చోబెట్టి పరీక్ష రాయించడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఈ ఘటన తమిళనాడులోని కోయంబత్తూరు జిల్లా పొల్లాచ్చికి సమీపంలో ఇటీవల జరిగింది. సోషల్ మీడియాలో ఈ వీడియో వైరల్‌గా మారడంతో అధికారులు విచారణ జరుపుతున్నారు. పొల్లాచ్చి ఎఎస్‌పి శ్రీస్తిసింగ్ మీడియాకు తెలిపిన వివరాల ప్రకారం బాధితురాలు సెంగుట్టాయిపాళయంలోని మెట్రిక్యులేషన్ పాఠశాలలో చదువుతున్నారు. ఇటీవల పాఠశాలలో వార్షిక పరీక్షలు నిర్వహిస్తున్నారు. రుతుస్రావంతో ఉన్న తన కుమార్తెకు ఇన్‌ఫెక్షన్లు సోకకుండా తరగతి గదిలో ప్రత్యేక డెస్క్‌ను ఏర్పాటు చేయాలని బాధితురాలి తల్లి ముందుగా క్లాస్ టీచర్‌ను కోరారు. ఈ విషయంపై ప్రిన్సిపాల్‌తో మాట్లాడాలని టీచర్‌ను సూచించారు. దీంతో ఈ నెల 7న కుమార్తెను పాఠశాల వద్ద దింపిన తల్లి ప్రిన్సిపాల్‌ను కలిసి తన విజ్ఞప్తి తెలిపారు. ఆమె వెళ్లిన తరువాత తరగతి గది వెలుపల కూర్చోబెట్టి విద్యార్థిని చేత పరీక్ష రాయించారు. ఇంటికి వెళ్లిన తరువాత బాలిక కాళ్ల నొప్పితో బాధపడింది. బుధవారం జరిగిన మరొక పరీక్షకు హాజరైన బాలికను తరగతి గది వెలుపల మెట్లపై కూర్చోబెట్టారు. దీన్ని చూసిన బాలిక బంధువులు తల్లికి సమాచారం ఇచ్చారు. తల్లి వెంటనే పాఠశాలకు వచ్చి ఈ దృశ్యాన్ని రికార్డు చేశారు. ఈ విషయంపై మెట్రిక్యులేషన్ స్కూల్స్ డైరెక్టర్ ఎ.పళనిసామి మాట్లాడుతూ పాఠశాల యాజమాన్యం నుంచి వివరణ కోరినట్లు తెలిపారు. అధికారులు విచారణ చేస్తున్నారని, నివేదిక అందిన తరువాత తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. చిన్నారులకు ఉచిత, నిర్బంధపు విద్యా హక్కు చట్టం 2009 సెక్షన్ 17 (చిన్నారులపై మానసిక, శారీరక వేధింపుల నిషేధం) కింద పాఠశాల ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు కరస్పాండెంట్ ఉత్తర్వులు జారీ చేశారు.

మరింత మెరుగ్గా పారిశుధ్య నిర్వహణ

- పన్నుల వసూళ్లు పెరుగుదల
- మంత్రి నారాయణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మునిసిపాలిటీలు మరింత మెరుగ్గా పారిశుధ్య నిర్వహణ చేపట్టాలని రాష్ట్ర మునిసిపల్ శాఖ మంత్రి పి.నారాయణ అధికారులను ఆదేశించారు. విజయవాడలోని స్కేల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్‌లో గురువారం మునిసిపల్ కమిషనర్ల రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మునిసిపల్‌శాఖపై ప్రజల్లో సంతృప్తి శాతం పెరిగేలా మునిసిపల్ కమిషనర్లు పనితీరు ఉండాలన్నారు. మునిసిపల్ కమిషనర్లు శాలిడ్‌వేస్ట్, లిక్విడ్ వేస్ట్‌లతో పాటు తాగునీరు, స్ట్రీట్ లైట్‌లు, రోడ్లకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పేదలను ఇబ్బంది పెట్టకుండా పన్నుల వసూళ్లు పెరిగేలా కృషి చేయాలని మంత్రి నారాయణ అధికారులకు సూచించారు. మునిసిపాలిటీల్లో ఎస్టాబ్లిష్‌మెంట్, మౌళిక వసతుల కల్పనలో ఖర్చులను రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందన్నారు. నెల్లూరు మునిసిపాలిటీలో 2014-19 సంవత్సరాల్లో పన్నుల వసూళ్లలో కొత్త విధానాన్ని అమలు చేశామన్నారు, ఫలితంగా రూ.1,067కోట్లు వసూలయ్యాయని చెప్పారు.. రెవెన్యూ ఖర్చుపోగా రూ.40కోట్లు మిగులు ఆదాయం అప్పట్లోనే తీసుకురాగలిగామన్నారు. 14-19 మధ్య కాలంలో తానే మునిసిపల్‌శాఖ మంత్రిగా పనిచేశానని, ఆ సమయంలో మునిసిపాలిటీల్లో ఒక్క రూపాయి కూడా పన్నులు పెంచలేదన్నారు. పురపాలక,పట్టణాభివృద్ధిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్ సురేష్‌కుమార్ మాట్లాడుతూ నగరాల్లో 1.5కోట్ల జనాభా ఉందని, ఇది రాబోయో కాలంలో 2.5 కోట్లకు పెరుగుతుందని దాని ప్రకారం వసతులను మెరుగుపరుచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండి అనిల్‌కుమార్, మెప్మా ఎండి తేజ్‌భరత్, టిడ్కో ఎండి సునీల్‌కుమార్‌రెడ్డి, గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఎండి ఎంకెవి శ్రీనివాసులు ,పట్టణ ప్రణాళికా విభాగం డైరెక్టర్ విద్యుల్లత, పబ్లిక్ హెల్త్ ఇఎన్‌సి మరియన్న , మునిసిపల్ కార్పొరేషన్ చైర్మన్లు పాల్గొన్నారు.

పెన్షన్ జాప్యానికి 8 శాతం వడ్డీ

- బ్యాంక్‌లకు ఆర్‌బిఐ ఆదేశాలు

న్యూఢిల్లీ : పదవీ విరమణ చేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పెన్షన్ల పంపిణీపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) కీలక నిర్ణయం తీసుకుంది. పెన్షన్ చెల్లింపులలో ఏదైనా జాప్యం జరిగితే సంబంధిత బ్యాంక్‌లు ఖాతాదారునికి ఏడాదికి 8 శాతం వడ్డీని చెల్లించాలని ఆర్‌బిఐ ఆదేశాలు జారీ చేసింది. పెన్షనర్లకు వారి బకాయిలను ఆలస్యంగా చెల్లించినందుకు పరిహారం చెల్లించడానికి వీలుగా ఈ సర్క్యులర్‌ను రూపొందించినట్లు తెలిపింది. "పెన్షన్ చెల్లించే బ్యాంకులు పెన్షన్ లేదా బకాయిలను జమ చేయడంలో జాప్యం జరిగితే, గడువు తేదీ తర్వాత జరిగే ఆలస్యానికి సంవత్సరానికి 8 శాతం స్థిర వడ్డీ రేటుతో పరిహారం చెల్లించాలి" అని సర్క్యులర్‌లో స్పష్టం చేసింది. ఈ పరిహారం పెన్షనర్ల నుండి ఎటువంటి క్లెయిమ్, ఫిర్యాదు అవసరం లేకుండా బ్యాంకులే స్వతహాగా అందించాల్సి ఉంటుంది. షెడ్యూల్ చేయబడిన చెల్లింపు తేదీ తర్వాత సంభవించే ఏవైనా ఆలస్యాలకు వడ్డీ రేటుతో పరిహారం అందించాలని పేర్కొంది. ఇది 2008 అక్టోబర్ 1 నుండి ఆలస్యమైన అన్ని చెల్లింపులకు వర్తిస్తుందని తెలిపింది. ఆర్‌బిఐ నుండి సూచనల కోసం వేచి ఉండకుండా పెన్షన్ చెల్లింపులను పూర్తి చేయాలని బ్యాంకులకు సూచించింది. వృద్ధాప్యంలో ఉన్న పెన్షనర్లకు శ్రద్ధ, సానుభూతితో కూడిన సేవలను అందించాలని పేర్కొంది.

సరిహద్దు నిర్వహణపై చర్చలు

- భారత్-పాక్ ఆర్మీల బ్రిగేడ్ కమాండర్ స్థాయి సమావేశం

జమ్మూ : నియంత్రణ రేఖ వెంబడి సరిహద్దు నిర్వహణ అంశంపై చర్చించడానికి భారత్-పాకిస్థాన్ ఆర్మీలు గురువారం బ్రిగేడ్ కమాండర్ స్థాయిలో సమావేశం నిర్వహించాయి. జమ్ముకాశ్మీర్‌లోని పూంచ్ జిల్లా చకన్-డా-బాగ్ క్రాస్ పాయింట్ వద్ద ఈ సమావేశం జరిగిందని అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో ఎల్‌ఓసి వెంబడి రోజువారీ కార్యక్రమాల నిర్వహణపై ప్రధానంగా చర్చించినట్లు చెప్పారు. ఈ సమావేశంలో చొరబాటు యత్నాలు, కాల్పుల విరమణ ఉల్లంఘటనలు, బాంబు పేలుళ్ల ఘటనలు వంటి అంశాలను భారత అధికారులు లేవనెత్తినట్లు చెప్పారు. వాటిపై నిరసన వ్యక్తం చేసినట్లు అధికారులు తెలిపారు ఈ నెలలో ఇలాంటి సమావేశం జరగడం ఇది రెండోసారి. ఈ నెల 2న చకన్-డా-బాగ్ క్రాసింగ్ పాయింట్ ప్రాంతంలోనే 75 నిమిషాల పాటు బ్రిగేడ్ కమాండర్ స్థాయిలో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సరిహద్దుల వెంబడి శాంతిని కాపాడుకోవాల్సిన అవసరంపై చర్చించారు.

ఆర్‌టిఐ చట్టాన్ని నాశనం చేసే డిపిడిపి యాక్ట్

- తక్షణమే రద్దు చేయాలి : ఇండియా బ్లాక్

న్యూఢిల్లీ : డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ యాక్ట్ (డిపిడిపి)లోని సెక్షన్ 44(3) సమాచార హక్కు చట్టం (ఆర్‌టిఐ) ని నాశనం చేస్తుందని ప్రతిపక్ష ఇండియా బ్లాక్ విమర్శించింది. తక్షణమే దాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేసింది. ఇక్కడ గురువారం జరిగిన సంయుక్త మీడియా సమావేశంలో కాంగ్రెస్ నేత గౌరవ్ గగోయ్, జాన్ బ్రిట్టాస్ (సిపిఎం), ఎంఎం అబ్దుల్లా (డిఎంకె), ప్రియాంక చతుర్వేది (శివసేన-యుబిటి), జావేద్ అలీ ఖాన్ (ఎస్‌పి), నావల్ కిషోర్(ఆర్‌జెడి) పాల్గొన్నారు. ఈ సమావేశంలో గగోయ్ మాట్లాడుతూ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో సహా ఇండియా బ్లాక్ పార్టీలకు చెందిన 120మందికి పైగా ఎంపీలు ఈ సెక్షన్‌ను రద్దు చేయాలని కోరుతూ సంయుక్త మెమొరాండంపై సంతకాలు చేశారన్నారు. ఐటి మంత్రి అశ్విని వైష్ణవ్‌కు ఈ మెమొరాండాన్ని అందజేయనున్నట్లు తెలిపారు. సెక్షన్ 44(3)ని ఆర్‌టిఐ చట్టం, 2005లోని సెక్షన్ 8(1)(జె)కి ప్రత్యామ్నాయంగా మార్చడానికి ప్రయత్నిస్తోందని గగోయ్ తెలిపారు. వ్యక్తిగత సమాచారమేదైనా దాన్ని వెల్లడించడం ప్రజా కార్యకలాపాలకు గానీ లేదా ప్రజా ప్రయోజనాలకు గానీ సంబంధం లేదని భావించినా, లేదా గోప్యతపై అనవసరపు దాడి చేస్తుందని భావించినా సదరు సమాచారాన్ని నిలిపివేయడానికి ఆర్‌టిఐ చట్టంలోని సెక్షన్ 8(1)(జె) అనుమతిస్తుంది. ఈ ఆంక్ష లేదా పరిమితి విధించడమనేది ఒక ముఖ్యమైన అంశానికి లోబడి వుంటుంది. ఇలా వెల్లడించిన సమాచారానికి విస్తృత ప్రజా ప్రయోజనాలు వున్నాయని కేంద్ర పౌర సమాచార అధికారి, రాష్ట్ర పౌర సమాచార అధికారి లేదా అప్పిలేట్ అథారిటీ నిర్ణయించినట్లైతే దీన్ని అందుబాటులో వుంచుతారు. డిపిడిపి చట్టంలోని సెక్షన్ 44(3), ఆర్‌టిఐ చట్టంలోని సెక్షన్ 8(1)(జె)ని సవరిస్తుంది. ఇది, ప్రజా ప్రయోజనాలు లేదా మరే ఇతర అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండానే ప్రభుత్వ సంస్థలు వ్యక్తిగత సమాచారానికి సంబంధించిన సమాచారాన్ని దాచడానికి అనుమతిస్తుంది. డిపిడిపి చట్టంలోని సెక్షన్ 44(3)ని పౌర హక్కుల కార్యకర్తలు సహా పలువురు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని అన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న గౌరవ్ గగోయ్, చిత్రంలో జాన్ బ్రిట్టాస్, ప్రియాంక చతుర్వేది

చదివేందుకు పుస్తకాలేవి?

- కొత్త పాఠ్య పుస్తకాల విడుదలలో ఎన్‌సిఇఆర్‌టి విఫలం
- గత వారమే ప్రారంభమైన పాఠశాలలు
- ఆందోళనలో విద్యార్థులు, తల్లిదండ్రులు


న్యూఢిల్లీ : విద్యా పరిశోధన, శిక్షణ జాతీయ మండలి (ఎన్‌సిఇఆర్‌టి) తాను నిర్దేశించుకున్న కాలక్రమాన్ని తానే ఉల్లంఘిస్తోంది. నాలుగు తరగతుల విద్యార్థులకు అందుబాటులో ఉంచాల్సిన పాఠ్యపుస్తకాలకు అతీగతీ లేకపోవడంతో పాఠశాలలు గందరగోళంలో పడుతున్నాయి. 2025-26 విద్యా సంవత్సరం నుండి 4, 5, 7, 8 తరగతుల విద్యార్థుల కోసం నూతన పాఠ్య పుస్తకాలు ప్రవేశపెడతామని ఎన్‌సిఇఆర్‌టి గతంలోనే ప్రకటించింది. సంవత్సరం క్రితమే పాఠ్య పుస్తకాల రూపకల్పన కోసం ప్రయత్నాలు ప్రారంభించింది. సకాలంలో ఆ పనిని పూర్తి చేయడంలో విఫలమైంది. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. గత సంవత్సరం కూడా 3, 6 తరగతుల విద్యార్థులకు నూతన పాఠ్య పుస్తకాలు ప్రచురించడంలో జాప్యం జరిగింది. ఏప్రిల్‌లో విద్యా సంవత్సరం ప్రారంభమైతే ఆగస్టులో 6వ తరగతి గణితం, సాంఘిక శాస్త్ర పుస్తకాలు అందుబాటులోకి వచ్చాయి. ఈ ఏడాది కూడా గత వారమే అన్ని పాఠశాలలు ప్రారంభమయ్యాయి. ఎన్‌సిఇఆర్‌టి ఇప్పటి వరకూ నాలుగో తరగతి విద్యార్థుల కోసం హిందీ, ఇంగ్లీషు పుస్తకాలను, ఏడో తరగతి విద్యార్థులకు ఇంగ్లీషు పుస్తకాన్ని మాత్రమే విడుదల చేసింది. ఏడో తరగతి హిందీ పాఠ్య పుస్తకం ఇంకా రాలేదు. కొత్త పుస్తకాలను ఎన్‌సిఇఆర్‌టి వెబ్‌సైటులో ఇంకా అప్‌లోడ్ చేయలేదు. 4, 5, 7, 8 తరగతుల విద్యార్థులకు మరే కొత్త పాఠ్య పుస్తకం అందుబాటులో లేదు. 5, 8 తరగతులకు సంబంధించిన అన్ని సబ్జెక్టులకూ ఎన్‌సిఇఆర్‌టి బ్రిడ్జి కోర్సులు రూపొందించి వాటిని తన వెబ్‌సైటులో అప్‌లోడ్ చేసింది. ఎన్‌సిఇఆర్‌టి సిలబస్‌ను, పాఠ్య పుస్తకాలను ఎలాంటి మార్పులు లేకుండా సిబిఎస్‌ఇ అనుసరిస్తోంది. పాఠ్య పుస్తకాల లభ్యతకు ఎన్‌సిఇఆర్‌టి కాలక్రమాన్ని నిర్దేశించిందని గత నెల 26న జారీ చేసిన సర్క్యులర్‌లో సిబిఎస్‌ఇ తెలియజేసింది. ఆ సర్క్యులర్ ప్రకారం... లాంగ్వేజెస్ మినహా నాలుగో తరగతికి చెందిన అన్ని సబ్జెక్టుల పుస్తకాలు ఈ నెల 10వ తేదీకి అందుబాటులో ఉండాలి. ఏడో తరగతి సైన్స్ పుస్తకాలు 10న, లెక్కల పుస్తకాలు 20న రావాల్సి ఉంటుంది. పదో తేదీ వచ్చినా అవి ఇంకా అందుబాటులో లేవు. ఇక ఐదో తరగతి పుస్తకాలు జూన్ 15కు, ఎనిమిదో తరగతి పుస్తకాలు జూన్ 20 నాటికి విద్యార్థుల చేతిలో ఉండాలి. ఐదు, ఎనిమిది తరగతుల విద్యార్థులు పాత పాఠ్య ప్రణాళిక నుండి కొత్త దానికి సులభంగా మారేందుకు వీలుగా ఎన్‌సిఇఆర్‌టి బ్రిడ్జి కోర్సులను రూపొందించింది.

పాత పుస్తకాలతోనే బోధన : విద్యార్థి తండ్రి

ఢిల్లీలోని ఓ ప్రైవేటు పాఠశాల పాత పాఠ్య పుస్తకాలతోనే విద్యా బోధన కొనసాగిస్తోందని అందులో చదువుతున్న విద్యార్థి తండ్రి తెలిపారు. 'మా అబ్బాయి చదువుకునే స్కూలులో పాత సిలబసే చెబుతున్నారు. సిలబస్ మారితే విద్యార్థులకు కష్టమవుతుంది. సమయం తక్కువగా ఉండడంతో కొత్త సిలబస్‌ను వారు ఎలా పూర్తి చేయగలుగుతారు?' అని ఆయన ప్రశ్నించారు.

భారత్‌కు తహవ్వూర్ రాణా

- అరెస్టు చేసిన ఎన్ఐఎ



న్యూఢిల్లీ : ముంబయిపై ఉగ్రదాడులు 2008 సూత్రధారి తహవ్వూర్ హుస్సేన్ రాణాను భారత్‌కు అమెరికా అప్పగించింది. అమెరికా నుంచి తహవ్వూర్ రాణాను తీసుకొచ్చిన ప్రత్యేక విమానం గురువారం సాయంత్రం ఢిల్లీ విమానాశ్రయంలో ల్యాండయింది. జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ), నేషనల్ సెక్యూరిటీ గార్డ్ (ఎన్ఎస్‌జి)కు చెందిన అధికారులతో కూడిన బృందం రాణాను అమెరికాలోని లాస్ ఏంజెల్స్ నుంచి ఈ ప్రత్యేక విమానంలో తీసుకొచ్చింది. విమానాశ్రయంలో దిగిన వెంటనే రాణాను ఎన్ఐఎ అదుపులోకి తీసుకుంది. విచారణ కోసం ఎన్ఐఎ ప్రధాన కార్యాలయానికి తీసుకెళ్లారు. గురువారం రాత్రి రాణాను పాటియాలా హౌస్ కోర్టులో ప్రవేశపెట్టేందుకు ఏర్పాటు చేశారు. ముందుజాగ్రత్తగా కోర్టు ప్రాంగణాన్ని పోలీసులు ఖాళీ చేయించారు. అక్కడ నుంచి మీడియా ప్రతినిధులను బయటకు పంపారు. 64 ఏళ్ల రాణా పాకిస్తాన్ సంతతికి చెందిన కెనడియన్-అమెరికన్.

పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నరేందర్‌మాన్

మరోవైపు ఈ కేసులో విచారణ, ఇతర విషయాల కోసం ప్రముఖ న్యాయవాది నరేందర్ మాన్‌ను మూడేళ్ల పాటు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నియమించింది. రాణా తరుపున ఢిల్లీ లీగల్ సర్వీసెస్ అథారిటీ నుంచి న్యాయవాది పియూష్ సచ్‌దేవ్ ప్రాతినిధ్యం వహించనున్నారు.

ముంబయి ఉగ్రదాడుల కేసులో రాణాపై 2011లోనే ఎన్ఐఎ ఛార్జిషీట్ దాఖలు చేసింది. లష్కరే తోయిబా చీఫ్ హాఫీజ్ సయీద్ ఆదేశాల మేరకు ఈ దాడులకు ప్రణాళిక, నిఘా కార్యకలాపాలను నిర్వహించిన డేవిడ్ హెడ్లీ సహచరుడిగా ఎన్ఐఎ ఆరోపించింది. హెడ్లీ భారత్‌కు రావడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను రాణా పూర్తి చేసినట్లు తెలిపింది. తరువాత వీరిని 2009లో అమెరికాలో అక్కడి అధికారులు అరెస్టు చేశారు. అప్పట్ని నుంచి వీరి అప్పగింత కోసం భారత్ పోరాటం చేస్తూ వస్తోంది. హెడ్లీ అమెరికా పౌరుడు కావడంతో అప్పగించడానికి నిరాకరించిన ఆ దేశం రాణాను అప్పగించింది.

పాలస్తీనా దేశాన్ని జూన్‌లో గుర్తిస్తాం : మాక్రాన్

పారిస్ : పాలస్తీనా దేశాన్ని జూన్‌లో గుర్తిస్తామని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మాక్రాన్ చెప్పారు. ఇందుకు ప్రతిగా మధ్య ప్రాచ్యంలోని కొన్ని దేశాలు ఇజ్రాయిల్‌ను గుర్తించగలవని అన్నారు. పాలస్తీనాను సార్వభౌమాధికార దేశంగా దాదాపు 150 దేశాలు గుర్తించినా అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్ వంటి ప్రధాన పశ్చిమ దేశాలు ఇప్పటివరకు గుర్తించలేదు. "పాలస్తీనా దేశాన్ని గుర్తించే దిశగా మేం ముందుకు సాగాల్సిన అవసరం వుంది. బహుశా కొద్ది నెలల్లో అది జరగవచ్చు, ఎవరినో బుజ్జగించడానికి నేను ఇది చేయడం లేదు. ఒక దశలో ఇది సరైందని భావిస్తున్నందున ఈ చర్య తీసుకుంటున్నాం." అని ఫ్రాన్స్ 5 టెలివిజన్‌తో ఇంటర్వ్యూ సందర్భంగా మాక్రాన్ వ్యాఖ్యానించారు. పాలస్తీనాను ఎవరైతే సమర్ధిస్తారో వారు కూడా అందుకు ప్రతిగా ఇజ్రాయిల్‌ను గుర్తించాలని సూచించారు. ఇజ్రాయిల్‌ను గుర్తించని దేశాల్లో సౌదీ అరేబియా, ఇరాన్, ఇరాక్, సిరియా, యెమెన్ వంటి దేశాలు వున్నాయి. సౌదీ అరేబియా అధ్యక్షతన జరిగే సమావేశంలో జూన్‌లో తమ లక్ష్య సాధన దిశగా అడుగులు పడతాయని మాక్రాన్ పేర్కొన్నారు.

గిరిజన ప్రాంతాలను కార్పొరేట్లకు కట్టబెట్టే కుట్ర

(మొదటి పేజీ తరువాయి)

పునరావాసమూ కల్పించలేదన్నారు. మరోవైపు అదానీ, గ్రీన్‌కో లాంటి సంస్థలకు 5 పంప్డ్ స్టోరేజి పవర్ ప్రాజెక్టులు కేటాయించారని తెలిపారు. దీంతో ఏజెన్సీ ప్రాంతం అంతా సర్వనాశనం అవుతుందని, గిరిజనుల ఉనికే దెబ్బతిటోందన్నారు. ఈ ప్రాంతంలో నిరుద్యోగం అధికంగా ఉందని, చదువుకున్న గిరిజనులకు ఉద్యోగాలు లేవని చెప్పారు. జిఒ 3 పునరుద్ధరించడానికి చంద్రబాబు చేసిన వాగ్దానం మరిచిపోయారన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ తన పర్యటనలో జిఒ 3, షెడ్యూల్ 5, నిరుద్యోగం, ఇతర సమస్యల గురించి ప్రస్తావించకుండా కేవలం టూరిజం గురించి మాత్రమే చెప్పడాన్ని తప్పుబట్టారు. రంపచోడవరం వర్క్‌షాపులో టూరిజం అభివద్ధి చెందితే హెూటల్స్‌లో బాయ్స్ ఉద్యోగాలు గిరిజనులకు వస్తాయని చెప్పడం అర్ధరహితమన్నారు. చదువుకున్న గిరిజన యువకులు హెూటల్స్‌లో బాయ్‌గా పని చేయాలని చెబుతున్నారని, అభివద్ధి అంటే ఇదేనా అని ప్రశ్నించారు. గిరిజనుల భూములపై వారి హక్కులను లాగేసుకుని వారిని జీతగాళ్ళుగా మార్చనున్నారని తెలిపారు. ఈ ప్రయత్నాన్ని స్థానికులు తిప్పికొట్టాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం లోపాయికారీ విధానాలు మానుకొని ఆదివాసీలకు కల్పించిన రాజ్యాంగ హక్కులు కాపాడాలని కోరారు. గతంలో బాక్సైట్‌కు వ్యతిరేకంగా జరిగిన పోరాటాన్ని ఆయన గుర్తు చేశారు. గిరిజన సలహా మండలిని ఏర్పాటు చేసి, వారి అభిప్రాయాలు తెలుసుకోవాలని, పెసా చట్టం ప్రకారం గ్రామ సభలు నిర్వహించి గిరిజనుల అభిప్రాయాలు తీసుకోవాలన్నారు. గిరిజన ప్రాంతంలోకి కార్పొరేట్ సంస్థలను అనుమతించి భూగర్భసంపద కొల్లగొట్టుకుపోయే విధానాలను ప్రజలు తిరస్కరించాలని కోరారు.

ట్రంప్ టారిఫ్ యుద్ధంపై మాట్లాడుతూ దేశ ఆత్మగౌరవాన్ని అమెరికాకు ప్రధాని నరేంద్రమోడీ తాకట్టపెట్టారని ఆగ్రహం వెలిబుచ్చారు. పేరుకు రోజూ దేశ భక్తి గురించి మాట్లాడుతున్నారని అన్నారు. అమెరికా అధ్యక్షులు ట్రంప్ చేసిన వ్యాఖ్యలు విన్నవారెవరికైనా ఆగ్రహావేశాలు కలుగుతాయని చెప్పారు. భారత్ సహా అన్ని దేశాలను బూతులు తిడుతుంటే కనీసం ఆత్మగౌరవం గల దేశం స్పందించదా, ఇది భరత మాతను తాకట్టు పెట్టడం కాదా అని ప్రశ్నించారు. చర్చలు జరుపుతున్నామని, మనకే ఎక్కువ లాభమని విదేశాంగశాఖ మంత్రి జయశంకర్ చెప్పడాన్ని తప్పుబట్టారు. సుంకాలపై 90 రోజులు మినహాయింపు ఇస్తే దేశానికి ఉపశమనం కలుగుతుందా అని ప్రశ్నించారు. అమెరికా పెంచిన సుంకాల వల్ల ఆక్వా, వ్యవసాయం, జౌళి రంగాలు ఇబ్బందులు పడుతున్నాయన్నారు. తాజాగా ఫార్మా రంగంపైనా సుంకాలు పెంచనున్నట్లు అమెరికా ప్రకటించిందని తెలిపారు. ఈ సుంకాలను ఎదుర్కొవడానికి ప్రభుత్వం ఎందుకు సిద్ధపడటం లేదో చెప్పాలన్నారు. దేశభక్తి గల ప్రభుత్వం అమెరికా సుంకాలకు వ్యతిరేకంగా ఉన్న అన్ని దేశాలను కలుపుకుని పోరాటం చేయాలన్నారు. మోడీ ప్రభుత్వం అందుకు సిద్ధంగా లేదని నిస్సిగ్గుగా లొంగుబాటు ప్రదర్శిస్తుందని చెప్పారు. రైతులు, పారిశ్రామికవేత్తల ప్రయోజనాలను తాకట్టుపెట్టి దెబ్బతీయాలని ప్రయత్నిస్తోందన్నారు. ఇప్పటికే అధిక ధరలు చెల్లించి అమెరికా నుంచి పెట్రోల్ డీజిల్‌ను దిగుమతి చేసుకుంటున్నట్లు చెప్పారు. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారల్‌కు 60 నుంచి 75 డాలర్ల లోపు ధరలు తగ్గితే దేశంలో పెట్రోల్ డిజిల్ ధరలు తగ్గించకుండా ఎక్సైజ్ డ్యూటీ పేరుతో పన్నులు విధించి కేంద్రమే తన ఖజానాలో వేసుకుటుందని తెలిపారు. ఈ విధంగా రూ.38 వేల కోట్లు కొల్లగొడుతోందన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలను లీటరుకు రూ.2 తగ్గించాలని, పెంచిన గ్యాస్ ధర రూ.50ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సొసైటీ ఫర్ కమ్యూనల్ హార్మొని సంస్థ ఈ నెల 13వ తేదీన విజయవాడలో సమైక్యతా శంఖారావం నిర్వహిస్తుందని దీనికి సిపిఎం పూర్తి మద్దతు తెలియజేస్తోందన్నారు. పార్టీలకు, రాజకీయాలకు అతీతంగా జరుగుతున్న కార్యక్రమైనందున జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

అదనపు కేటాయింపులపై ఆర్థిక సంఘాన్ని అడుగుదాం

(మొదటి పేజీ తరువాయి)

ఆశించిన స్థాయిలో పెరగకపోవడాన్ని ఈ సమీక్షలో ప్రస్తావించినట్లు తెలిసింది. 2023-24లో రూ. 44,699 కోట్లు రాగా, 2024-25లో కేవలం 4,665 కోట్ల పెంచి, రు. 49,364 కోట్లు మాత్రమే ఇవ్వాలని నిర్ణయించడం తెలిసిందే. మొత్తం కేంద్ర పన్నుల్లో రాష్ట్రానికి 4.047 శాతం మాత్రమే కేటాయింపులు జరిగాయి. దీనిని పెంచుకునేలా ఆర్థిక సంఘానికి ప్రతిపాదించాలని భావిస్తున్నట్లు సమాచారం. ఇక కేంద్ర ప్రాయోజిత పథకాలకు వచ్చే నిధుల వాటాపైనా ప్రత్యేకంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆర్థికశాఖను ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రతియేటా అంచనాలకన్నా తక్కువగా నిధులు వస్తున్న విషయాన్ని ఆర్థిక సంఘం దృష్టికి తీసుకువెళ్లాలని సూచించినట్లు సమాచారం. స్థానిక సంస్థలకు వచ్చే నిధులపైనా నిర్దిష్ట ప్రతిపాదనలు సిద్ధం చేయాలని నిర్ణయించారు. రాష్ట్ర విభజన అనంతర పరిణామాలను ఆర్థిక సంఘానికి వివరించాలని, విభజన సందర్భంగా ఇచ్చిన హామీలు కూడా ఇంతవరకు అమలు కాని విషయాన్ని ఆర్థికసంఘం దృష్టికి తీసుకుపోవాలని సిఎం సూచించారు.





మీకోసం


సగ్గుబియ్యం వడియాలు పెట్టుకునేటప్పుడు ఉడికిన సగ్గుబియ్యంలో కొంచెం మజ్జిగ కలిపితే వడియాలు తెల్లగా వస్తాయి.

జీవన సౌరభం

అనుభవం నేర్పిన పాఠాలకు విలువ ఎక్కువ. ఆచరిస్తూ చెప్పే మాటలకు ఆదరణ ఎక్కువ. ఇష్టంతో చేసే పనులకు విజయాలు ఎక్కువ.

JEEVANA జీవన the family

తగిన శాస్తి!



వైశాఖి వనంలో ఉండే జిత్తుల మారి నక్క తన మిత్రుడైన కుందేలుతో కలిసి అడవిలో ఉత్తర ప్రాంతంలో జరిగే సంబరాలకు బయల్దేరింది. దారిలో నక్కకి ఒక ముల్లు కనిపించింది. కానీ దాన్ని తీయకుండా ముందుకు కదిలింది! ఆ విషయం కుందేలుకు తెలియదు. కొంత దూరం వెళ్ళాక మరొక ముల్లు కుందేలుకి కనిపించింది. అది దానిని తీసి దూరంగా పడేసింది. 'ఎందుకు ముల్లుని తీసి పక్కన పడేసావ్?' అని అడిగింది నక్క. 'ఎందుకేంటి ఎవరైనా చూసుకోకుండా దానిమీద కాలు వేస్తే ఇబ్బంది కదా? అందుకని' అంది కుందేలు.

'ఎవరికో గుచ్చుకుంటే నీకెందుకు?' అంది నక్క. 'అదే పొరపాటు. ఇబ్బంది ఎవరికైనా ఒకటే. మనం సురక్షితంగా ఉండాలని కోరుకోవడం మంచిదే. అయితే ఇతరులకు ఇబ్బంది కలిగేలా ప్రవర్తించకూడదు. మన శక్తి ఉన్నంతవరకు ఇబ్బందులను తొలగించే ప్రయత్నం చేయాలి. లేదా ఆ విషయమై ఇతరులను అప్రమత్తం చేయాలి' అంది కుందేలు. తర్వాత ఇద్దరూ ముందుకు కదిలారు.

సంబరాలు జరిగే ప్రదేశానికి చేరుకున్న ఇరువురూ అక్కడ చాలా సేపు గడిపిన తర్వాత చీకటి పడుతుండగా తిరిగి ఇంటి బాట పట్టారు. కొంత దూరం వెళ్ళాక 'అమ్మ చచ్చాన్రో!' అంటూ కింద పడింది నక్క. 'ఏమైంది నక్క బావ?' అని కుందేలు నక్కని అడిగింది. 'నా కాలికేదో గుచ్చుకున్నట్లు ఉన్నది' అంటూ బాధగా మూలిగింది నక్క.

కుందేలు వెంటనే మిణుగురుల సహాయం తీసుకుని వాటి వెలుతురులో నక్క కాలును చూసింది. పెద్ద ముళ్ళు ఒకటి గుచ్చుకుంది. శక్తినంతా ఉపయోగించి బలంగా దాన్ని బయటికి లాగింది. 'ఇంతకుముందు ఈ దారిలో మనం వెళ్ళినప్పుడు నాకు ఒక ముల్లు కనిపించింది. దాన్ని తీశాను. దీన్ని చూడలేదు. ఒకవేళ చూసి ఉంటే తీసేవాడిని.. అప్పుడు నీకు గుచ్చుకునేది కాదు!' అని కుందేలు ఎంతో బాధగా నక్కతో చెప్పింది.

'నువ్వే నన్ను క్షమించాలి మిత్రమా. ఇందాక మనం వెళుతున్నప్పుడు నేను ఒక ముల్లును చూసాను. తకావాలనే దాన్ని తీయలేదు. అదే ఇప్పుడు నాకు గుచ్చుకున్నట్టు ఉంది. ఎవరికో జరిగితే మనకెందుకులే అని ప్రవర్తించినందుకు నాకు తగిన శాస్తి జరిగింది. ఇకనుంచి ఆ విధంగా ప్రవర్తించను నాకు బుద్ధి వచ్చింది' అంది నక్క. నక్కలో వచ్చిన మార్పుకు కుందేలు ఎంతో సంతోషపడి, నక్కను మెల్లగా వైద్యుడైన ఎలుగుబంటి వద్దకు తీసుకెళ్లింది.

– ఏడుకొండలు కళ్ళేపల్లి,
మచిలీపట్నం,
94908 32338.



నేను గీసిన బొమ్మ



టి.కౌశిక్ అభిరామ్,
6వ తరగతి,
అరవింద హైస్కూల్,
సిబిఎస్ఇ
కుంచనపల్లి, గుంటూరుజిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

మామిడి మనిషి



చెట్లను ప్రేమించే వాళ్లు మన చుట్టూ చాలామంది ఉంటారు. వాటిని పెంచే క్రమంలో పూలు, పళ్ల గురించి ఎంతో అనుభవం గడిస్తారు. వాటికిచ్చే ఎరువులు, రసాయనాలపై శాస్త్రవేత్తల్లా పెద్ద రీసెర్చ్ కూడా చేస్తారు. అయితే ఇప్పుడు ఈ చెట్ల ప్రేమికులంతా ఉత్తరప్రదేశ్‌కి చెందిన కరీముల్లా గురించి తప్పక తెలుసుకోవాలి. ముఖ్యంగా మామిడికాయలు విరివిగా దొరికే ఈ వేసవికాలంలో ఆయన పరిచయం అవసరం.

కరీముల్లా తనకి ఎంతో ఇష్టమైన మామిడిచెట్లపై చేసిన ప్రయోగాలు ప్రపంచవ్యాప్తంగా ఆయన్ని ప్రత్యేకమైన వ్యక్తిగా నిలిపాయి. 'భారతదేశ మామిడి మనిషి'గా గిన్నిస్‌బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ఆయన పేరు లిఖించబడింది. 7వ తరగతి కూడా పాసవ్వని వ్యక్తి ఒకే మామిడి చెట్టుకు ఏకంగా 300 రకాల మామిడి పళ్లను కాయించడం వెనుక చేసిన కృషికి గాను భారతప్రభుత్వం ఆయన్ని పద్మశ్రీ బిరుదుతో కూడా సత్కరించింది.

కరీముల్లా చేసిన ప్రయోగాలు చూసినవారెవరైనా ఆయన పెద్ద శాస్త్రవేత్త అనుకోవడం ఖాయం. వ్యవసాయ శాస్త్రవేత్తలే ఆశ్చర్యపోయేలా చేసిన ఘనత కరీముల్లా సొంతం. అయితే కరీముల్లాని ఎవరైనా ప్రశంసలతో ముంచెత్తుతుంటే చాలా వినయంగా వాటిని తిరస్కరిస్తాడు. విజయాల గురించి మాట్లాడొద్దంటూనే భూసారం, వరదలు, అంటుకట్టడం, ప్రేమ గురించి అవిశ్రాంతంగా మాట్లాడతాడు.

84 ఏళ్ల కరీముల్లా 6 దశాబ్దాలుగా తాతముత్తాతల నుండి వచ్చిన వ్యవసాయ భూమిలో పనిచేస్తున్నాడు. చెట్లతో ఆయనకున్న ప్రేమ గురించి ఇలా చెబుతున్నాడు. '7వ తరగతి ఫెయిల్ అయ్యాక, తాతతో పాటు పొలంలో పనిచేసేవాడ్ని. అప్పటి నుండి ఇక్కడే నా దినచర్య మొదలయ్యేది. ప్రస్తుతం వయసురీత్యా నేను మాట్లాడలేకపోతున్నాను. కానీ నా చెట్టు గురించి చెప్పడానికి మాత్రం వెనుకాడను. ఈ చెట్టుకి, నాకు మధ్య ఉన్న బంధం అపారమైన ప్రేమతో ముడిపడింది. ఈ చెట్టు నా జీవితకాల జ్ఞాపకాలను కలిగివుంది. ఈ చెట్టును చూడడానికి, దీనికి కాస్తున్న రకరకాల మామిడి పండ్లను అధ్యయనం చేయడానికి ప్రజలు ఇక్కడికి రావాలి. నేనున్నా, లేకపోయినా నా తరువాత తరం వారు ఇలాంటి ప్రయోగాలు ముున్ముందు మరిన్ని చేయాలి. ఎందుకంటే ఈ చెట్టుకి కాసే ప్రతి కాయ దాని ప్రత్యేక లక్షణాలను కలిగివుంటుంది' అని ఆయన ఎంతో గర్వంగా చెబుతున్నారు.

మొదటిసారి 1957లో పురాతన పద్ధతిలో అంటుకట్టడాన్ని కరీముల్లా ప్రారంభించారు. 'మొదటిసారి ప్రయోగం, ఫలితం రాకముందే బెడిసికొట్టింది. ఆ ఏడాది అధిక వర్షాల వల్ల తోటలోకి నీరు చేరి ప్రయోగం విఫలమైంద'ని ఆయన గుర్తుచేసుకున్నారు. అప్పుడే వర్షాల వల్ల పంట నష్టపోకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో పరిశోధన చేయడం మొదలుపెట్టారు. ఇంకోసారి భూమిలో సారం తగ్గడం వల్ల మేలైన జాతి వృక్షాలు కూడా సంవృద్ధిగా ఫలాలు ఇవ్వకపోవడం గుర్తించారు. భూసారం పెరిగే చర్యలు తీసుకున్నారు. ఇలా తన అనుభవాల నుంచి ఎన్నో ప్రయోగాలు చేసిన కరీముల్లా 'వ్యవసాయ శాస్త్రవేత్తలకు ఏమాత్రం తీసిపోర'ని ఆయన్ని బాగా తెలిసినవారు అంటారు.

రకరకాల ప్రయోగాల తర్వాత 1987లో కరీముల్లా మరోసారి రకరకాల మామిడిచెట్లకు అంటుకట్టి విజయం సాధించారు. అలా ఆయన అంటుకట్టడం ప్రారంభించిన ఓ చెట్టు రకరకాల ప్రయోగాలకు నెలవైంది. 125 ఏళ్ల ఆ చెట్టు ఇప్పటికీ ఆ తోటలో ఉంది. ఆ చెట్టు గురించి కరీముల్లా ఎంతో గొప్పగా చెబుతారు. 'ఈ చెట్టు నా తాతల కాలం నాటిది. నా మొదటి ప్రయోగం



ఈ చెట్టుమీదే చేశాను. ఎన్నో ప్రయోగాల తరువాత దీని ప్రతి కొమ్మ రకరకాల రంగుల్లో, రుచుల్లో మామిడిపండ్లను ఇస్తుంది. ఇదంతా సాధించడం ఒక్కరోజులో జరగలేదు. దీని వెనుక ఎంతో నిరీక్షణ ఉంది' అని కరీముల్లా ఆ చెట్టును ప్రేమగా తడుతూ చెప్పారు.

'మీ జీవిత కాలంలో ఎన్ని చెట్లను పెంచారు?' అని ఎవరైనా అంటే కరీముల్లా దగ్గర సమాధానం దొరకదు. ఎందుకంటే తన జీవితకాలంలో చెట్లను పెంచడమే విధిగా చేశారు కానీ, లెక్కపెట్టడం ఆయన ఎప్పుడూ చేయలేదు. ప్రస్తుతం కరీముల్లా కొడుకు నజీముల్లా ఖాన్ (57) తోటపనులు చూసుకుంటున్నారు. వయోభారంతో సతమతమవుతున్నా కరీముల్లా రోజుకో సారైనా తోటలోకి వస్తుంటారని ఆయన చెబుతున్నాడు. 'నాన్నకు సాయంగా తోటలోకి వచ్చిన నేను ఇప్పుడు పూర్తికాలం బాధ్యతలు తీసుకున్నాను. ఇదంతా ఈ తోటపై నాన్న పెంచుకున్న ప్రేమే' అంటాడు నవ్వుతూ నజీముల్లా.

రకరకాల మామిడి పండ్లు పెంచడమే కాదు, వాటికి ప్రముఖుల పేర్లు కూడా పెడతాడు కరీముల్లా. అలా ఈ చెట్టుకు కాసిన పండ్లలో సచిన్ టెండూల్కర్, ఐశ్వర్యరాయ్, నరేంద్రమోడీ, అమితాబ్ బచ్చన్, అనార్కలి వంటి ఎన్నో పేర్లు ఉన్నాయి. అల్ఫోన్సో, లంగ్రా, కేసర్, దశేరి, చౌన్సా వంటి రకాలు ఆ తోటలో ఎక్కడ చూసినా కనిపిస్తాయి. ఒక్కో ప్రయోగం ఫలసాయం రావడానికి సుమారు 10 నుంచి 12 ఏళ్లు పడుతుందని ఈ తండ్రీ కొడుకులు చెబుతున్నారు. అంతకాలం ఓపిగ్గా ఎదురుచూడడం, ప్రయోగం విఫలమైతే మళ్లీ ప్రయత్నించడం వెనుక కరీముల్లా కృషి నిరంతరమైనది.

కరీముల్లా చేసిన ఈ ప్రయోగాలు చూసేందుకు ఈ తోటకి దేశవిదేశాల ప్రకృతి ప్రేమికులు వస్తుంటారు. కొంతమంది వీటిపై అధ్యయనం చేస్తారు. కరీముల్లా దగ్గర పాఠాలు నేర్చుకుంటారు. అయితే 'గురువును నేను కాదు.. ఈ చెట్లే గురువులు' అని కరీముల్లా చాలా వినయంగా వారికి చెబుతారు.



తక్షణ శక్తికి చెరకు రసం

ఎండలు మండుతున్న వేళ కూల్‌డ్రింక్స్‌కి బదులు చెరకు రసం తాగితే ఎంతో మేలు.

- చెరకు రసం అలసట, నిస్సత్తువను తగ్గించి తక్షణ శక్తిని అందిస్తుంది.
- చెరకులో పిండిపదార్థాలు, ఫైబర్, పొటాషియం, జింక్, ఫాస్ఫరస్, క్యాల్షియం, ఐరన్ లాంటి మినరల్స్ పుష్కలంగా ఉంటాయి. విటమిన్-ఎ, బి, సి కూడా మెండుగా ఉంటాయి. దీంతో చెరకు రసం క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల శరీరంలో ప్రొటీన్ స్థాయిలు పెరుగుతాయి. - మూత్రపిండాల ఆరోగ్యానికి కూడా మంచిది.
- అలాగే క్రమం తప్పకుండా చెరకు రసం తాగితే రోగనిరోధక శక్తి పెరుగుతుంది.
- ఇందులోని ఫ్లేవనాయిడ్స్, యాంటీఆక్సిడెంట్లు, ఇతర ఫెనోలిక్ కాంపౌండ్స్ వృద్ధాప్య ఛాయలు రాకుండా అడ్డుకుంటాయి.
- చెరకు రసం కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించి గుండె ఆరోగ్యాన్ని కాపాడుతుంది.

ఎక్కువ వద్దు

- అయితే కొంతమంది చెరకురసం ఆరోగ్యానికి మేలు చేస్తుందని.. ఎక్కువగా తాగుతారు. ఒకేసారి రెండు గ్లాసుల కంటే ఎక్కువ చెరకు రసం తాగితే.. ఆరోగ్యానికి హాని జరిగే ప్రమాదం ఉంది.
- చెరకు రసం అధికంగా తీసుకోవడం వల్ల విరేచనాలు, మలబద్ధకం, డయాబెటిస్ వచ్చే ప్రమాదం ఉంది.
- అలాగే 20 నిమిషాల కంటే ఎక్కువసేపు నిల్వ ఉంచింది తాగకూడదు. ఒకవేళ తాగితే శరీరానికి మంచిది కాదు.
- నిల్వ ఉన్న చెరుకురసం ఆక్సీకరణ చెంది, కడుపు నొప్పి, వాంతులు, కళ్లు తిరగడం వంటి సమస్యలకు కారణమవుతుంది. కాబట్టి తాజాగా చేసిన చెరకు రసం తాగడం మంచిది.
- చెరకు రసంలో పోలికోసనాల్ అధికంగా ఉంటాయి. పోలికోసనాల్ అధికంగా ఉండటం వల్ల నిద్రలేమి సమస్య వచ్చే అవకాశం ఉంది. ఈ సమస్య ముదిరితే.. మానసిక సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది.
- చెరకు రసంలో కేలరీలు, చక్కెర పుష్కలంగా ఉంటాయి. ఇవి ఎక్కువగా తీసుకుంటే బరువు త్వరగా పెరుగుతారు.
- బరువును అదుపులో ఉంచుకోవాలంటే.. రోజుకు ఒక గ్లాసు చెరకు రసం మాత్రమే తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.
- చెరకులో ఉండే పోలికోసనాల్ రక్తాన్ని పలుచగా చేస్తాయి. దీని వల్ల రక్తం గడ్డకట్టదు.

ఎండల్లో షూటింగులు బిజీ బిజీ



ఈ ఎండల్లో మన తెలుగు హీరోలు షూటింగుల్లో బిజీగా గడుపుతున్నారు. ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో 'రాజా సాబ్' చిత్రం అజీజ్‌నగర్‌లో షూటింగ్ జరుపుకుంటోంది. 'అఖండ 2' కోసం ఆర్‌ఎఫ్‌సీలో వేసిన సెట్‌లో షూటింగ్ చేస్తున్నారు భాను భోగవరపు సినిమా కోసం జాన్‌వాడలో షూటింగ్‌తో రవితేజ బిజీగా ఉన్నారు. సాయి ధరమ్ తేజ్ హీరోగా నిరంజన్ రెడ్డి నిర్మిస్తున్న సినిమా షూటింగ్ తుక్కుగూడలో జరుగుతోంది. అలాగే తేజ సజ్జ హీరోగా రూపొందుతున్న 'మిరాయ్' మూవీ రామోజీ ఫిలిం సిటీలో షూటింగ్ జరుపుకుంటోంది. సిద్దు జొన్నలగడ్డ హీరోగా 'తెలుసు కదా' షూటింగ్ బాచుపల్లిలో జరుగుతోంది. నీరజా కోన ఈ చిత్రంతో దర్శకురాలిగా పరిచయం అవుతున్నారు. అఖిల్ హీరోగా మురళీ కిషోర్ తెరకెక్కిస్తున్న రొమాంటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ షూటింగ్ శంకరపల్లిలో జరుగుతోంది. ఇలా పలు చిత్రాలు వివిధ ప్రాంతాలలో శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్నాయి.



అల్లు అర్జున్‌కు జోడీగా సమంత

అల్లు అర్జున్- అట్లీ కాంబినేషన్‌లో త్వరలో సైన్స్‌ఫిక్షన్‌గా తెరకెక్కనున్న సినిమాలో కథానాయికగా సమంతను ఎంపిక చేసినట్లుగా సమాచారం. అనారోగ్య సమస్యలతో ఇటీవల ఆమె సినిమాల్లో కనిపించింది చాలా తక్కువ. వెబ్‌సిరీస్‌ల్లో నటిస్తూ అలరిస్తున్నారు. సోషల్‌మీడియాలో అప్‌డేట్‌గా ఉంటున్నారు. చేసిన ఐదు సినిమాలు మంచి విజయాన్ని సాధించిన ఉత్సాహంలో అట్లీ ఉన్నారు. పుష్ప 2తో అంతర్జాతీయస్థాయిలో గుర్తింపు పొందిన అల్లు అర్జున్‌తో ఆయన కొత్త సినిమా చేస్తున్నారు. ఈ సినిమాను సన్ పిక్చర్స్ సంస్థ రూ.600 కోట్ల బడ్జెట్‌తో నిర్మిస్తుందని సమాచారం. గతంలో అల్లు అర్జున్‌తో సన్నాఫ్ సత్యమూర్తిలో సమంత నటించారు. అట్లీ దర్శకత్వంలో వచ్చిన మెర్సల్, తెరి చిత్రాల్లో ఆమె నాయికగా నటించారు. అల్లు అర్జున్‌కు జోడీగా సమంత అయితే బాగుంటుందని అట్లీ భావించారట.

నిర్మాతగా రవితేజ కుమార్తె మోక్షద




టాలీవుడ్ కథానాయకుడు రవితేజ కుమార్తె మోక్షద నిర్మాణ రంగంవైపు ఆసక్తి చూపుతున్నారు. మొదట్లో ఆమె కథానాయికగా నటిస్తారనే ఊహాగానాలు వచ్చాయి. సినీ నేపథ్యం లేకుండా వచ్చి టాలీవుడ్‌లో స్టార్ హీరో అయ్యారు రవితేజ. ఆయనకు కుమారుడు మహాధన్, కుమార్తె మోక్షద ఉన్నారు. కుమారుడు 'రాజా ది గ్రేట్' సినిమాలో బాలనటుడిగా చేశారు. ప్రస్తుతం ఓ దర్శకుడి దగ్గర సహాయకుడిగా ఉంటూ నేర్చుకుంటున్నారు. వినోద్ అనంతోజు దర్శకత్వంలో ఆనంద్ దేవరకొండతో ఒక సినిమాను సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మించే యోచనలో ఉంది. ఈ సినిమాకు మోక్షద ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా వ్యవహరించబోతున్నట్లుగా ఇండస్ట్రీలో చర్చ జరుగుతోంది. ఒక ప్రత్యేకమైన కథాంశంతో కూడిన యాక్షన్-థ్రిల్లర్‌గా ఈ చిత్రం రానుంది.



మరో చిత్రంతో ...

ధనుష్ హీరోగా టాలీవుడ్ దర్శకుడు శేఖర్ కమ్ముల దర్శకత్వంలో వస్తున్న చిత్రం 'కుబేర'. ఈ సినిమా షూటింగ్‌లో ఉండగానే ధనుష్, శేఖర్‌తో మరో చిత్రానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. 'కుబేర' షూటింగ్ టైమ్‌లోనే శేఖర్, ధనుష్‌కు ఓ కథ వినిపించగా దానికి ఆయన అంగీకరించారని తెలుస్తోంది. ఈ కొత్త ప్రాజెక్టు కూడా 'కుబేర' సినిమాను నిర్మిస్తున్న ఏషియన్ సినిమాస్ బ్యానర్‌లో నిర్మిస్తున్నారు.

యథార్థ సంఘటనే 'ప్రేమకు జై'



'పల్లెటూరి నేపథ్యంలో వాస్తవంగా జరిగిన ఓ సంఘటన ఆధారంగా ఈ సినిమా తెరకెక్కించాం. మా హీరో హీరోయిన్లు అనిల్ బురగాని, జ్వలితా బాగా చేశారు. మా టీం అందరి కృషి వల్ల ఈ సినిమా ఇంత బాగా వచ్చింది. శుక్రవారం థియేటర్లలో విడుదలయ్యే ఈ సినిమాను ప్రేక్షకులు ఆదరించాలని కోరుకుంటున్నాం' అని దర్శకుడు శ్రీనివాస్ మల్లం అన్నారు. అనసూర్య నిర్మించిన చిత్రం 'ప్రేమకు జై'. శుక్రవారంనాడు ఈ సినిమా థియేటర్లలో విడుదల కానుంది. ప్రమోషన్ కార్యక్రమాల్లో భాగంగా దర్శకుడు మల్లం శ్రీనివాస్ పై విధంగా మాట్లాడారు.

పోలీసులే భయపడితే ...



రాంగోపాల్ వర్మ తాజాగా ఓ సినిమా ప్రకటించారు. 'పోలీస్ స్టేషన్ మే భూత్' అనే ఈ చిత్రం హారర్ నేపథ్యంలో రాబోతోంది. 'మీరు చనిపోయిన వారిని చంపలేరు' అనేది ట్యాగ్‌లైన్. ఇందులో మనోజ్ బాజ్‌పేయ్ ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. సినిమా కథ గురించి రాంగోపాల్ వర్మ కొన్ని విషయాలు ముచ్చటించారు. 'మనం భయపడినప్పుడు పోలీసుల దగ్గరకు వెళతాము. కానీ పోలీసులు భయపడినప్పుడు ఎక్కడికి పరిగెత్తుతారు? అన్న పాయింట్ మీదనే ఈ కథాంశం తిరుగుతుంది. ఒక ఘోరమైన ఎన్‌కౌంటర్ తర్వాత ఓ పోలీస్ స్టేషన్ దెయ్యాల స్టేషన్‌గా మారుతుంది. గ్యాంగ్‌స్టర్ల దయ్యాల నుండి తప్పించుకోవడానికి

కదం తొక్కిన కెఎల్ రాహుల్

- బౌలింగ్‌లో రాణించిన విప్‌రాజ్, కుల్దీప్
- బెంగళూరు ఢిల్లీ గెలుపు



బెంగళూరు: చిన్నస్వామి మైదానంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబి)పై ఢిల్లీ క్యాపిటల్స్ ఘన విజయం సాధించింది. బెంగళూరు నిర్దేశించిన 164పరుగుల లక్ష్యాన్ని ఢిల్లీ జట్టు 17.5 ఓవర్లలో కేవలం 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. వికెట్ కీపర్ కెఎల్ రాహుల్(93నాటౌట్; 53బంతుల్లో 7ఫోర్లు, 6సిక్సర్లు)కి తోడు స్టబ్స్(38నాటౌట్; 23బంతుల్లో 4ఫోర్లు, సిక్సర్) మ్యాచ్‌ను ముగించారు. టాపార్డర్ బ్యాటర్లు డుప్లెసిస్(2), ఫ్రేజర్(7), అభిషేక్ పోరెల్(7) నిరాశపరిచినా.. కెఎల్ రాహుల్ క్రీజ్‌లో నిలదొక్కుకొని మ్యాచ్‌ను ముగించడం విశేషం. అంతకుముందు టర్నింగ్ పిచ్ మీద ఢిల్లీ క్యాపిటల్స్ స్పిన్నర్లు రాణించారు. ఓపెనర్ సాల్ట్‌కు తోడు చివర్లో టిమ్ డేవిడ్ మాత్రమే బ్యాటింగ్‌లో రాణించారు. దీంతో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 163పరుగులు చేసింది. పవర్ ప్లేలో ధాటిగా ఆడిన ఓపెనర్ ఫిలిప్ సాల్ట్(37) టాప్ స్కోరర్. విప్‌రాజ్ నిగమ్ బౌలింగ్‌లో పెద్ద షాట్ ఆడిన రజత్ పటిదార్(25), విరాట్ కోహ్లి(22)లు విఫలమయ్యారు. అయితే.. టిమ్ డేవిడ్(37 నాటౌట్) మెరుపు బ్యాటింగ్‌తో బెంగళూరును ఒడ్డున పడేశాడు. డెత్ ఓవర్లలో రెచ్చిపోయిన అతడు 2 ఫోర్లు, 4 సిక్సర్లు బాదాడు. తొలుత సాల్ట్ తనదైన శైలిలో ధాటిగా ఆడి ఢిల్లీ బౌలర్ల గుండెల్లో గుబులు రేపాడు. మిచెల్ స్టార్క్ వేసిన 3వ ఓవర్లో రెచ్చిపోయిన అతడు తొలి బంతిని సిక్సర్‌గా మలిచి ఆ తర్వాత 4, 4, 6, 4 బాది 30 పరుగులు రాబట్టాడు. అ తర్వాత అక్షర్ బౌలింగ్‌లో విరాట్ సిక్సర్ బాది స్కోర్ 60 దాటించాడు. అయితే.. ఆ తర్వాత బంతికే సింగిల్ తీసే క్రమంలో సాల్ట్ రనౌటయ్యాడు. అభిషేక్ పొరెల్ విసిరిన బంతి అందుకున్న రాహుల్ వికెట్లను గిరాటేశాడు. దాంతో,61 వద్ద ఆర్సీబీ తొలి వికెట్ పడింది. ముకేశ్ కుమార్ బౌలింగ్‌లో దేవ్‌దత్ పడిక్కల్(1) ఔటయ్యాడు. కోహ్లి సైతం విప్‌రాజ్ నిగమ్ బౌలింగ్‌లో సిక్సర్‌తో జోరు పెంచాడు. కానీ, అదే ఓవర్లో పెద్ద షాట్ ఆడబోయి మిచెల్ స్టార్క్‌కు దొరికాడు. అంతే.. అక్కడి నుంచి ఆర్సీబీ స్కోర్ వేగం తగ్గిపోయింది. ఢిల్లీ బౌలర్లలో విప్‌రాజ్ నిగమ్, కుల్దీప్ యాదవ్‌కు రెండేసి, ముఖేశ్ కుమార్, మోహిత్ శర్మకు ఒక్కో వికెట్ దక్కాయి.

స్కోర్‌బోర్డు...

బెంగళూరు ఇన్నింగ్స్: సాల్ట్ (రనౌట్) విప్‌రాజ్ నిగమ్/రాహుల్ 37, కోహ్లి (సి)స్టార్క్ (బి)విప్‌రాజ్ నిగమ్ 22, దేవదత్ పడిక్కల్ (సి)అక్షర్ (బి)ముఖేష్ కుమార్ 1, రజత్ పటీధర్ (సి)రాహుల్ (బి)కుల్దీప్ 25, లివింగ్‌స్టోన్ (సి)అశుతోష్ శర్మ (బి)మోహిత్ శర్మ 4, జితేశ్ శర్మ (సి)రాహుల్ (బి)కుల్దీప్ యాదవ్ 3, కృనాల్ పాండ్యా (సి)అశుతోష్ శర్మ (బి)విప్‌రాజ్ నిగమ్ 18, టిమ్ డేవిడ్ (నాటౌట్) 37, భువనేశ్వర్ కుమార్ (నాటౌట్) 1, అదనం 15. (20 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి) 153పరుగులు. **వికెట్ల పతనం:** 1/61, 2/64, 3/74, 4/91, 5/102, 6/117, 7/125 **బౌలింగ్:** స్టార్క్ 3-0-35-0, అక్షర్ పటేల్ 4-0-52-0, విప్‌రాజ్ నిగమ్ 4-0-18-2, ముఖేశ్ కుమార్ 3-1-26-1, కుల్దీప్ యాదవ్ 4-0-17-2, మోహిత్ శర్మ 2-0-10-1.

ఢిల్లీ ఇన్నింగ్స్: డుప్లెసిస్ (సి)రజత్ పటీధర్ (బి)యశ్ దయాల్ 2, ఫ్రేజర్ (సి)జితేశ్ శర్మ (బి)భువనేశ్వర్ 7, అభిషేక్ పోరెల్ (సి)జితేశ్ శర్మ (బి)భువనేశ్వర్ 7, కెఎల్ రాహుల్ (నాటౌట్) 93, అక్షర్ పటేల్ (సి)టిమ్ డేవిడ్ (బి)సుయాశ్ శర్మ 15, స్టబ్స్ (నాటౌట్) 38, అదనం 7. (17.5ఓవర్లలో 4వికెట్ల నష్టానికి) 169పరుగులు. **వికెట్ల పతనం:** 1/9, 2/10, 3/30, 4/58 **బౌలింగ్:** భువనేశ్వర్ 4-0-26-2, యశ్ దయాల్ 3.5-0-45-1, హస్త్రజిల్‌వుడ్ 3-0-40-0, సుయాశ్ శర్మ 4-0-25-1, కృనాల్ పాండ్యా 2-0-19-0, లివింగ్‌స్టోన్ 1-0-14-0

ఐపిఎల్‌లో నేడు

చెన్నై సూపర్‌కింగ్స్ × కోల్‌కతా నైట్‌రైడర్స్
వేదిక: చెన్నై; రాత్రి 7.30గం॥లకు

ధోనీకే చెన్నై సూపర్ కింగ్స్ పగ్గాలు

- గాయంతో ఐపిఎల్‌కు రుతురాజ్ గైక్వాడ్ దూరం



చెన్నై: ఐపిఎల్ సీజన్-18లో పేలవ ఫామ్‌లో ఉన్న చెన్నై సూపర్ కింగ్స్‌కు మరో భారీ షాక్ తగిలింది. ఆ జట్టు రెగ్యులర్ కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ గాయం కారణంగా ఈ సీజన్ మిగిలిన మ్యాచ్‌లకు దూరమయ్యాడు. దీంతో అతడి స్ధానంలో ఎంఎస్ ధోనికి మరోసారి జట్టు పగ్గాలను మేనెజ్‌మెంట్ అప్పగించింది. "రుతురాజ్ గైక్వాడ్ మోచేయి ఎముక విరిగింది. దీంతో ఈ ఏడాది ఐపీఎల్ సీజన్ నుంచి రుతురాజ్ తప్పుకున్నాడు. అతడి స్ధానంలో ఎంఎస్ ధోని కెప్టెన్‌గా బాధ్యతలు స్వీకరించనున్నాడు" అని కేకేఆర్‌తో మ్యాచ్‌కు ముందు గురువారం విలేకరుల సమావేశంలో ఫ్లెమింగ్ పేర్కొన్నాడు. కాగా గైక్వాడ్ మార్చి 30న గౌహతి వేదికగా రాజస్తాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో గైక్వాడ్ గైక్వాడ్ కుడి మోచేయికి గాయమైంది. ఆ మ్యాచ్‌లో జోఫ్రా ఆర్చర్ వేసిన ఓ షార్ట్ బాల్ గైక్వాడ్ మోచేయికి బలంగా తాకింది. వెంటనే రుతు తీవ్రమైన నొప్పితో విల్లవిల్లాడాడు. ఆ తర్వాత ఫిజియో సాయం తీసుకుని తన ఇన్నింగ్స్‌ను కొనసాగించాడు. ఈ సీజన్‌లో చెన్నై ఆడిన ఐదు మ్యాచ్‌లో కేవలం ఒక్క విజయంతో పాయింట్ల పట్టికలో తొమ్మిదో స్ధానంలో కొనసాగుతోంది.

క్వార్టర్స్‌కు కాస్ట్రో- ధృవ్ కపిల

- ఆసియా బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్స్



నింగ్బో(చైనా): ఆసియా బ్యాడ్మింటన్ ఛాంపియన్స్ సింగిల్స్‌లో భారత షట్లర్ల పోరాటం ముగియగా.. మిక్స్‌డ్ డబుల్స్‌లో ధృవ్ కపిల-తానీసా కాస్ట్రో క్వార్టర్స్‌కు చేరారు. ప్రి క్వార్టర్స్‌కు చేరిన కిరణ్ జార్జి, ప్రియాన్షు రాజ్‌వత్‌తోపాటు పివి సింధు కూడా ఓటమిపాలైంది. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ ప్రి క్వార్టర్‌ఫైనల్లో ప్రియాన్షు 14-21, 17-21తో నరాకో(జపాన్) చేతిలో, కిరణ్ జార్జి 21-19, 13-21, 16-21తో విటిద్‌శరమ్(థాయ్‌లాండ్) చేతిలో ఓటమిపాలయ్యారు. ఇక మహిళల సింగిల్స్‌లో పివి సింధు 11-21, 21-16, 16-21తో టాప్‌సీడ్ యమగుచి(జపాన్) చేతిలో పోరాడి ఓటమిపాలైంది. ఇక పురుషుల డబుల్స్‌లో రేతినసబాపతి-అంసక్రూనమ్ జోడీ 15-21, 14-21తో, మిక్స్‌డ్ డబుల్స్‌లో ప్రభుదేశ్-సూర్యా జంట 11-21, 14-21తో చైనా షట్లర్ల చేతిలో పరాజయాన్ని చవిచూశారు. ఇక తానీసా కాస్ట్రో-ధృవ్ కపిల జంట క్వార్టర్‌ఫైనల్లోకి దూసుకెళ్లింది. హోరాహోరీగా సాగిన ఈ పోరులో ధృవ్ కపిల-కాస్ట్రో జంట 12-21, 21-16, 21-18తో చైనీస్ తైపీ షట్లర్లపై గెలిచి క్వార్టర్‌ఫైనల్‌కు చేరారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68